అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
సోమవారం 5-3-2018
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 4 సంచిక : 66 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | 12 + 16 పేజీలు ధర : 5.00

విత్తనోత్పత్తి రాష్ట్రానికి

విత్తన చట్టమేదీ?

మూడేండ్లలో వ్యవసాయ బడ్జెట్ రూ.24,804 కోట్లు



అందులో రుణమాఫీ రూ.15,452 కోట్లు

- **ఎవుసానికి పెట్టింది రూ. 9352 కోట్లే**

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా విత్తనతోత్పత్తి చేసే అగ్ర రాష్ట్రానికి విత్తన చట్టం లేకపోవడమేమిటీ అని వ్యవసాయ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్నట్టు విత్తన భాండాగారం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి విత్తన బాంఢాగారంగా తీర్చిదిద్దుతామని చెబుతున్న ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోతోంది. 2015లో విత్తన చట్టానికి సంబంధించిన ముసాయిదా రూపొందించారు. దీనిపై రైతులు, రైతు సంఘాల ప్రతినిధుల చేత సలహాలు, సూచనలను వ్యవసాయ శాఖ స్వీకరించింది. కాగా ఇంత వరకు విత్తన చట్టం రూపొందించలేకపోయింది. నిజామాబాద్ జిల్లాలో పసుపు, చెరకు పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ఇంత వరకు అతీగతీ లేదు. మొత్తం 11 చెక్కర ఫ్యాక్టరీలుంటే అందులో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు ఫ్యాక్టరీలు మూసివేసింది. మిగిలిన 11 ఫ్యాక్టరీలు నత్తనడకన కొనసాగుతున్నాయి. రెండున్న లక్షల ఎకరాల్లో ఉత్పత్తి అయ్యే చెరకు ప్రస్తుతం 50వేల హెక్టార్లకు పడిపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే చెరకు పంట మాయమయ్యే అవకాశాలున్నాయి. 2014 నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ రంగానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.24,804 కోట్లు. ఇందులో ఈ మూడేండ్లలో రుణమాఫీ కింద పోయిన నిధులు రూ.15,452 కోట్లు. వాస్తవంగా వ్యవసాయానికి ఖర్చు చేసింది ...9లో

ఇది ప్రజాస్వామ్యమేనా?

దేశ పరిణామాలపై కేసీఆర్ ఆవేదన

- గుణాత్మక మార్పు రావాలని ఆకాంక్ష
- ప్రత్యామ్నాయ రాజకీయం వైపు దేశం చూపు
- బీజేపీ..కాంగ్రెస్ పాలన వల్ల దేశం అధోగతి
- ఇంకెన్నాళ్లు రైతు ఆత్మహత్యలు
- చైనా అభివృద్ధిని చూసైనా మనం మారాలి
- ఒక మాట చెప్పా... దేశం నలుమూలల నుంచి ఫోన్లు



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశంలో జరుగుతున్న పరిణామాలపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు స్పందించారు. అవసరమైతే దేశ రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించడంతో అనుహ్యామైన స్పందన వచ్చింది. ఒక్కమాట చెప్పా..దేశ నలుమూలల నుంచి వివిధ రాజకీయపార్టీలకు చెందిన నేతలు ఫోన్లు చేశారు. 'తమ్ముడూ కలిసి ముందుకు వెళ్లదామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధైర్యమిచ్చారు. జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్‌సోరెన్, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్, మహారాష్ట్రకు చెందిన ఇద్దరు ఎంపీలు ఫోన్ చేసి ప్రత్యామ్నాయానికి రాజకీయ ఫ్రంట్‌కు మద్దతు, సంఘీభావం తెలిపారు'. అని ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు చెప్పారు. దేశ రాజకీయాల్లోకి వస్తానన్న నేపథ్యంలో కేసీఆర్‌కు అభినందనలు తెలుపడానికి వచ్చిన పార్టీ ఎంపీలు, మంత్రుల, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ఆదివారం ప్రగతిభవన్‌లో ఆయన ప్రసంగించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే ఆశ్చర్యకరంగా ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70 ఏండ్లు గడిచినప్పటికీ ఈ దేశం ఎటు పోతుందన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులు ఏంటీ? అని ఆలోచిస్తే ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రజల ఆశీస్సులు ఉంటే దేశ రాజకీయాలకు దశా..దిశా నిర్దేశిస్తానని కేసీఆర్ చెప్పారు. దేశ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఈ రెండు పార్టీల పాలన వైఫల్యం ప్రజలకు అర్థమైందని, అందుకే దేశం మొత్తం ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు చూస్తోందన్నారు. 70 ..9లో

వర్గీకరణతోనే అంతరాలకు పరిష్కారం

ప్రొఫెసర్ నాగేశ్వర్

- 13న బంద్‌కు మావోయిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు : వరవరరావు వివరాలు 10లో
- ఉమ్మడి రిజర్వేషన్ల విధానానికి కాలం చెల్లింది : మందకృష్ణ మాదిగ

టీఆర్టీకి 2,42,332 మంది హాజరు

- ప్రశాంతంగా ముగిసిన రాతపరీక్షలు
- ఫిబ్రవరి 24 నుంచి 4 వరకు నిర్వహణ

వివరాలు 9లో



విభజన హామీలు తేల్చండి...

- కేంద్రంపై పోరుకు తెలంగాణ, ఏపీ సిద్ధం
- నేటి నుంచి పార్లమెంట్ రెండో విడత
- పీఎన్‌బీ స్కాంపై అస్త్రశస్త్రాలతో విపక్షాలు సిద్ధం
- 'ఈశాన్య' గెలుపుతో ఉత్సాహంగా కాషాయదళం



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు పొందుపరిచిన విభజన హామీలను అమలు చేయాలని కేంద్రంపై పోరుకు తెలుగు రాష్ట్రాలు సిద్ధమయ్యాయి. నేటి(సోమవారం) నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాలను ఇందుకు వేదికగా మార్చుకోనున్నాయి. రిజర్వేషన్ల నిర్ణయం రాష్ట్రాల పరిధిలో ఉండాలని, విభజన హామీలను అమలు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయానికి అనుబంధం చేయాలని మూడు ప్రధాన డిమాండ్లతో టీఆర్ఎస్ పోరుకు సమయాత్తమవుతోంది. మరోవైపు ప్రత్యేక హోదాతో పాటు రైల్వేజోన్, ఆర్థికసాయంపై ఏపీకి చెందిన అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ పోరాటానికి సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రారంభంకానున్న బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా సాగనున్నాయి. ఇక జాతీయ అంశాలకొస్తే పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై మోడీ సర్కారును నిలదీయాలని విపక్షాలు సమాయత్తమవుతున్నాయి. మరోవైపు ఈశాన్య గెలుపుతో మరింత దూకుడుగా వ్యవహరించాలని కాషాయ శ్రేణులు నిర్ణయించాయి.

జనవరి 29న ప్రారంభమైన బడ్జెట్ తొలి విడత సమావేశాలు.. ఫిబ్రవరి తొమ్మిదితో ముగిశాయి. సుమారు నెల రోజుల విరామం తరువాత సోమవారం ప్రారంభంకానున్న బడ్జెట్ రెండో విడత సమావేశాలు ఏప్రిల్ ఆరో తేదితో ముగుస్తాయి. ఈ సమావేశాల్లో ముఖ్యంగా ట్రిపుల్ తలాక్ బిల్లుతో పాటు ఆర్థిక నేరగాళ్ల బిల్లును ఆమోదించాలని కేంద్రం అజెండాగా పెట్టుకుంది. ఇటీవల పంజాబ్ నేషనల్ బ్యాంకులో వెలుగుచూసిన సుమారు రూ.12,700 కోట్ల కుంభకోణం నేపథ్యంలో ఆర్థిక నేరగాళ్ల బిల్లుకు కేంద్ర కేబినెట్ ఇటీవల ఆమోదం ...9లో

ఒక్కరోజే ఏడుగురు

ఆగని అన్నదాతల ఆత్మహత్యలు

- మృతుల్లో నలుగురు కౌలు రైతులు,
- ఇద్దరు మహిళలు, ఓ వికలాంగుడు

నవతెలంగాణ-యంత్రాంగం

తెగుళ్లతో పంట దిగుబడిరాక...పంట నష్టపోయి పుట్టెడు దు:ఖంతో అప్పులోళ్లకు ముఖం చూపలేక..కౌలు కట్టలేక...ప్రాజెక్టుల కింద భూములు పోతుంటే తట్టుకోలేక కర్షకులు లోలోన కుమిలిపోతున్నారు. ఓదార్చేవారు లేక...ప్రభుత్వం నుంచి భరోసా లభించక చనిపోతున్నారు. ఆదివారం ఒక్కరోజే ఏడుగురు అన్నదాతలు ఆత్మహత్య చేసుకున్నారు. మృతుల్లో నలుగురు కౌలురైతులు, ఇద్దరు మహిళారైతులు, ఓ వికలాంగ రైతు ఉన్నారు.

పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడుకు చెందిన మాలోత్ లక్ష్మా (45) తన మూడెకరాల పోడు భూమితో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగు చేస్తున్నాడు. కాలం కలిసి రాక, పంటలు సరిగ్గా పండక పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీరలేదు. రూ.4లక్షల అప్పుంది. దీనికి తోడు సీతారామ ప్రాజెక్టు కాల్వ కింద తన పోడు భూమి పోతున్నది.దానికి ప్రభుత్వం పరిహారం ఇవ్వబోమని చెప్పడంతో కొంత కాలంగా తీవ్ర మనస్థాపానికి గురవుతున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు వ్యవసాయం చేయొద్దని చెబుతుండటంతో ఏం చేయాలో పాలుపోక ఆదివారం సాయంత్రం చేను వద్దకెళ్లి పురుగు మందు తాగి చనిపోయాడు. మృతునికి భార్య బుజ్జి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం పొట్టిపల్లికి చెందిన నాగేశ్వర్(42) తన రెండెకరాలతో పాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి ...9లో

మూఢత్వంతో నరబలికి యత్నం

- తప్పించుకున్న యువకుడు
- పెద్దపల్లి జిల్లాలో గుప్తనిధుల కోసం తవ్వకాలు
- పోలీసుల అదుపులో నిందితులు వివరాలు 9లో

'తెలంగాణ ప్రజల పార్టీ' ఆవిర్భావం

అధ్యక్షులుగా జస్టిస్(రిటైర్డ్) చంద్రకుమార్



నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మరోపార్టీ ఆవిర్భవించింది. అట్టడుగువర్గాలకు రాజ్యాధికారం, ఉచిత విద్య, వైద్యం, అవినీతి నిర్మూలన లక్ష్యాలుగా తెలంగాణ ప్రజల పార్టీ(టీపీపీ) ఏర్పాటైంది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన ...9లో

అమెరికా ట్రేడ్ వార్‌పై చైనా హెచ్చరిక

దిగుమతి సుంకం పెంచటంపై ఆగ్రహం

బీజింగ్: తమ వర్తక, వాణిజ్య ప్రయోజనాల్ని దెబ్బతీస్తే...చూస్తూ ఊరుకోమని అమెరికాను చైనా హెచ్చరించింది. స్టీల్, అల్యూమినియం దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీగా సుంకాలు విధించటాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికాతో తాము వాణిజ్య యుద్ధాన్ని(ట్రేడ్‌వార్) కోరుకోవటం లేదని, ఒకవేళ అమెరికా ఏకపక్షంగా అలాంటి యుద్ధానికి తెరలేపితే తగిన విధంగా స్పందించేందుకు తామూ సిద్ధంగానే ఉన్నామని, అమెరికా ట్రేడ్‌వార్...తమ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని చైనా పార్లమెంట్ అధికార ప్రతినిధి ఝాంగ్ యూసీ ఆదివారం ఒక ప్రకటన చేశారు. దేశీయ తయారీ రంగాన్ని రక్షించుకోవటం కోసం ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకాలను విధించబోతున్నామని ట్రంప్ కొద్ది రోజుల క్రితం ప్రకటించటం సర్వత్రా ప్రకంపనలు సృష్టించాయి. అమెరికా నిర్ణయంపై కెనడా, యురోపియన్ దేశాలు, బ్రెజిల్, చైనా, మెక్సికో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ముఖ్యంగా చైనాతో వాణిజ్య సంబంధాలపై ప్రత్యేక దృష్టిసారించారు. అమెరికా-చైనా మధ్య పెద్దస్థాయిలో వాణిజ్య లోటు ఏర్పడిందని ...9లో

కొక్కొరోకో..



భక్తా..! నాకు దూప దీపాలు వద్దు.. దండం పెట్టుకో చాలు..!!

వినబడుతోందా?

ప్రపంచవ్యాప్తంగా 46.6కోట్ల మంది సౌండ్ ఇంజినీర్లు

- 2050 లోపు 90కోట్లు చేరుకునే అవకాశం : డబ్ల్యూహెచ్ఓ
- పెరుగుతున్న నగరీకరణ, సకాలంలో చికిత్స లేకపోవడమే కారణం
- పుట్టిన బిడ్డలకు వినబడుతుందో లేదో కూడా పట్టించుకోని 84.1శాతం ఇండియన్ పేరెంట్స్
- కాక్లియర్ ఇండియా మరియు ఫస్ట్ మామ్స్ క్లబ్ సర్వేల్లో వెల్లడి

లోకంలోని అందాలను కండ్లు చూపిస్తే.. ఆ అందాల మాటున దాగున్న భావాలను చెవులు వినిపిస్తాయి. అందుకే.. కనిపించే లోకానికి వినిపించే లోకం తోడైతేనే ప్రతీది పరిపూర్ణం అవుతుందని అంటారు. ఐతే, నానాటికీ పెరిగిపోతున్న శబ్ద కాలుష్యం, పిల్లల విషయంలో చూపుతోన్న అశ్రద్ధ వెరసి రానున్న తరాలు వినికిడి శక్తిని తీవ్రంగా కోల్పోయే ప్రమాదమున్నదని తాజాగా తేలడం విస్తుగొలుపుతోంది. ఈ నేపథ్యంపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..



కడవేర్గు

శారీరకంగా వివిధ అవయవాల పనితీరు, వాటికి తరుచూ వచ్చే సమస్యలపై మానవుడు తీసుకుంటున్న శ్రద్ధ.. వినికిడి సమస్యపై చూపడం లేదన్నది వాస్తవం. వినికిడి లేకపోతే జీవితం నిశ్శబ్దం, నిస్సారమనే విషయాన్ని ఒప్పుకోవాల్సిందే!

పదిలో ముగ్గురికేనా?

పుట్టిన బిడ్డకు వినికిడి సమస్య ఆదిలోనే ఎదురైతే.. ఆ పసికూనకు పరిసరాల్లోని శబ్దాలు వినబడవు. ఫలితం.. ఆ పసివాడి తొ ఉచ్ఛరణే అగమ్యగోచరం.. తదుపరి పలుకులు ...9లో

జిన్నా ప్రత్యేక దేశం కోరలేదు..!

- మైనారిటీ హోదాకు అంగీకరిస్తే

అలా జరిగేది కాదు : ఫరూఖ్ అబ్దుల్లా



జమ్ము: ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలని మహ్మద్‌అలీ జిన్నా కోరలేదని జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. ముస్లింలు, సిక్కులకు మైనారిటీ హోదా కోరారని, అందుకు జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, సర్దార్‌పటేల్ అంగీకరించలేదని..అందువల్లే జిన్నా ప్రత్యేక దేశంగా పాకిస్థాన్‌ను డిమాండ్ చేశారని ఫరూఖ్ అన్నారు. జిన్నా కోరినట్టు మైనారిటీ హోదాకు అంగీకరించి ఉంటే పాకిస్థాన్, ఆ తర్వాత బంగ్లాదేశ్ ఏర్పడేవే కావని అంతా ఇండియాలోనే కలిసి ఉండేవారని ఫరూఖ్ అన్నారు. జమ్ములోని షేర్ ఏ కాశ్మీర్ భవన్‌లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఫరూఖ్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ జాతిపితగా జిన్నాకు పేరున్నది. ఫరూఖ్ వ్యాఖ్యల్ని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఖండించారు. చరిత్రను మరోసారి చదవాలని ఫరూఖ్‌ను కోరారు. పాకిస్థాన్ డిమాండ్‌ను వదులుకుంటే జిన్నాను అవిభాజ్య ఇండియాకు ప్రధానిగా చేయడానికి కాంగ్రెస్ నేతలను ఒప్పిస్తానంటూ మహాత్మాగాంధీ ప్రతిపాదించారని జితేంద్రసింగ్ అన్నారు.

ఢిల్లీ మహిళా కమిషన్ నిర్వహిస్తున్న... 'రేప్ రోకో'కు పలు సంస్థల మద్దతు



న్యూఢిల్లీ: మహిళలపై జరుగుతున్న లైంగికదాడులపై సత్వరమే చర్యలు తీసుకునేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ... రెండు నెలలుగా ఢిల్లీ మహిళా కమిషన్(డీసీడబ్ల్యూ) ఆధ్వర్యంలో చేపట్టిన 'రేప్ రోకో' ఉద్యమానికి మద్దతు రోజురోజుకు పెరుగుతోంది. ఇండియన్ మెడికల్ అసోషియేషన్ (ఐఎంఏ), ఢిల్లీ డిస్ట్రిక్ట్ కోర్టు బార్ అసోషియేషన్ (డీడీసీబీఏ)లు ఆదివారం సంఘీబావం ప్రకటించాయి. 'మేము ఈ ఉద్యమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం. మహిళలపై జరుగుతున్న అరాచకాల్ని అరికట్టేందుకు డీసీడబ్ల్యూ కోరుతున్నట్టు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి ఉరితీయడమే సరైన శిక్ష అని, ఇలా చేస్తేనే మహిళలపట్ల దాడులు ఆగుతాయని' ఐఎంఏ ఓ లేఖలో పేర్కొంది. ఇన్నాళ్ల ఖర్చు చేయకుండా ఉన్న 'నిర్భయ' నిధుల్ని వెంటనే మహిళలు, బాలికల సంక్షేమానికి ఉపయోగించాలని ఐఎంఏ, డీడీసీబీఏలు కోరాయి. ఈ యేడాది జనవరిలో ఎనిమిది నెలల శిశువుపై ఓ దుర్మార్గుడు అతి కిరాతకంగా లైంగికదాడికి పాల్పడ్డాడు. అప్పటినుంచి డీసీడబ్ల్యూ ఆధ్వర్యంలో.. లైంగికదాడులకు పాల్పడేవారిని ఆరు నెలల్లో కఠినంగా శిక్షించేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆ సంస్థ అధ్యక్షురాలు స్వాతి మలివాల్ ఆధ్వర్యంలో ప్రజలు సత్యాగ్రహ దీక్ష చేస్తోన్నారు.

ఫోర్టిస్‌కు నోటీసులు !

న్యూఢిల్లీ : హెల్త్‌కేర్ దిగ్గజం ఫోర్టిస్‌కు సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్' (ఎస్ఎఫ్ఐఓ) నుంచి నోటీసులు జారీ అయ్యాయి. సంస్థలో జరిగిన ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలను మార్చి9వ తేదీలోపు సమర్పించాలని అధికారులు ఆదేశించారు. ఫోర్టిస్ సంస్థలో జరిగిన ఆర్థిక అవకతవకలకు సంబంధించి కార్పొరేట్ వ్యవహారాల శాఖ దృష్టి సారించింది. ఈ విషయాన్ని ఆ సంస్థ బీఎస్ఈ ఫైలింగ్‌లో పేర్కొంది. ప్రస్తుతం దర్యాప్తు అధికారులకు సదరు సమాచారాన్ని అందజేసే పనిలో ఫోర్టిస్ అధికారులు నిమఘ్నమయ్యారు. కంపెనీ ప్రమోటర్లుగా వ్యవహరించిన మాల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్‌లు బోర్డ్ అనుమతి లేకుండా 78 మిలియన్ డాలర్లను వినియోగించుకున్నట్టు ఆరోపణలు రావడంతో వివాదం తలెత్తింది. దీంతో ఎస్ఎఫ్ఐఓలు ఈ వ్యవహారంపై దృష్టిపెట్టింది. దీంతోపాటు సెబీకూడా ప్రమోటర్ల వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించింది.

హాంకాంగ్‌లో నీరవ్‌మోడీ : ఈడీ

- మోసాల కోసం లంచంగా బంగారం, వజ్రాలు : సీబీఐ



ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను రూ.12,600 కోట్లమేర మోసగించిన వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీ హాంకాంగ్‌లో ఉన్నట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తెలిపింది. అయితే,నీరవ్ హాంకాంగ్‌లో తలదాచుకున్నాడన్న విషయాన్ని పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టుకు సమర్పించిన పత్రాల నుంచి తొలగించినట్టు ఈడీ తరపు న్యాయవాది హితేన్ వెనెగాంకర్ ఓ మీడియా ప్రతినిధికి తెలిపారు. మరోవైపు హాంకాంగ్‌లో ఉన్నట్టు తమ దగ్గర సమాచారమున్నదని ఈడీలోని సీనియర్ అధికారి స్పష్టం చేశారు. డబ్బు అక్రమ తరలింపు నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద నీరవ్‌మోడీతోపాటు ఆయన మేనమామ మెహుల్ ఛోక్సీలకు ప్రత్యేక కోర్టు నాన్‌బెయిలెబుల్ వారెంట్లు జారీ చేసిన విషయం తెలిసిందే.

పీఎన్‌బీ నుంచి రుణాలు పొందేందుకు బ్యాంకు ఉద్యోగులకు నీరవ్‌మోడీ పెద్దమొత్తాల్లో లంచాలు ఇచ్చినట్టు సీబీఐ అధికారులు ప్రత్యేక కోర్టుకు తెలిపారు. పీఎన్‌బీ ముంబయిశాఖలోని ఫారెక్స్ విభాగంలో పని చేసే యశ్వంత్‌జోషికి 60 గ్రాముల బరువున్న రెండు బంగారు నాణేలతోపాటు వజ్రాభరణాలను ఇచ్చినట్టు సీబీఐ తెలిపింది. ఈ ఆభరణాలను జోషీ ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్నట్టు సీబీఐ తెలిపింది. ఈ కేసులో అరెస్టయిన జోషీతోపాటు 14మంది నిందితులు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు. పీఎన్‌బీలో జరిగిన ఆర్థిక కుంభకోణంపై సీబీఐతోపాటు ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి.

జనవరిలో ఈ కుంభకోణం వెలుగు చూడకముందే నీరవ్‌మోడీ, గీతాంజలి జెమ్స్ చైర్మన్ మెహుల్ ఛోక్సీ తమ కుటుంబాలతోసహ విదేశాలకు చెక్కేసిన విషయం తెలిసిందే. నీరవ్‌మోడీకి అమెరికాలో ఫైర్‌స్టార్ డైమండ్ పేరుతో వజ్రాల వ్యాపార సంస్థ ఉన్నది. ఆ సంస్థ పేరుతో అక్కడి కోర్టులో ఇప్పటికే దివాలా పిటిషన్ వేసి తన వ్యాపార నిర్వహణకు అడ్డంకులు లేకుండా (దివాలా) చట్టం నుంచి రక్షణ పొందే ప్రయత్నం చేస్తున్నారు. వ్యాపార కార్యకలాపాల నిమిత్తమే తాను విదేశాల్లో ఉంటూ దర్యాప్తు సంస్థల ముందుకు రాలేకపోతున్నానంటూ ఈడీకి నీరవ్‌మోడీ ఈ మెయిల్ ద్వారా తెలిపారు.

ఉత్తర్ ప్రదేశ్ ఉప ఎన్నికల్లో త్రిముఖ పోటీ

లక్నో: ఉత్తర్‌ప్రదేశ్ ఉప ఎన్నికల్లో త్రిముఖ పోటీ నెలకొంది. ఆ రాష్ట్రంలోని గోరఖ్‌పూర్, ఫూల్పూర్ పార్లమెంటరీ నియోజక వర్గాలకు మరో వారం రోజుల్లో ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఈ రెండు నియోజక వర్గాలపై దృష్టి సారించాయి. ఈ ఎన్నికలను 2019లో జరగబోయే సాధారణ ఎన్నికలకు రిహార్సల్స్‌గా రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు అన్ని పార్టీలు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఉత్తర్‌ప్రదేశ్ శాసన మండలికి ఎన్నికవ్వడంతో రెండు నియోజకవర్గాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది. గోరఖ్‌పూర్ ముఖ్యమంత్రి యోగి నియోజక వర్గం కావడంతో బీజేపీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన నియోజక వర్గంగా మారింది. ఫల్పూర్ నియోజక వర్గం ఒకప్పుడు కాంగ్రెస్‌కు అత్యంత ప్రాధాన్యత గల నియోజక వర్గంగా నిలిచింది.

పీఎన్‌బీ అధికారికి లంచంగా బంగారు నాణాలు, వజ్రాల నగలు

- నిరవ్ మోడీ కేసులో కోర్టుకు తెలిపిన సీబీఐ

ముంబయి: పీఎన్‌బీ కుంభకోణం కేసులో విచారణలో సీబీఐ కొత్త విషయాలను వెల్లడించింది. నీరవ్ మోడీ నుంచి బ్యాంకు అధికారి బంగారు నాణాలు, వజ్రాల నగలు లంచంగా తీసుకున్నారని దర్యాప్తులో తేలినట్టుగా సీబీఐ శనివారం కోర్టుకు తెలిపింది. పీఎన్‌బీ కుంభకోణం కేసులో నీరవ్ మోడీ బ్యాంకు అధికారులతో కుమ్మక్కైనట్టుగా సీబీఐ అనుమానించింది. ఇందులో భాగంగా 14 మందిని అరెస్టు చేసి విచారణ చేపట్టింది. పీఎన్‌బీ కేసులో తొలిసారి అరెస్టులు జరిగాయి. కాగా నీరవ్ మోడీ నుంచి ఒక అధికారి లంచాలు తీసుకున్నట్టుగా సీబీఐ తెలిపింది. ముంబయి బ్రాంచ్‌లో ఫోరెక్స్ విభాగానికి మేనేజర్‌గా వ్యవహరిస్తున్న యశ్వంత్ జోషి... రెండు60 గ్రాముల బంగారు నాణాలు, ఒక జత బంగారు నగలు, వజ్రాలతో చేసిన చెవి రింగులు మోడీ నుంచి స్వీకరించినట్టుగా సీబీఐ కోర్టుకు వివరించింది. జోషి లంచంగా తీసుకున్న వస్తువులను ఆయన నివాసంలో స్వాధీనం చేసుకున్నట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు. మోడీ, జోషితో కలిసి బ్యాంకును మోసగించాడని సీబీఐ ఇన్‌స్పెక్టర్ దామోదరన్ కోర్టులో తెలిపారు.

నేటి నుంచి పార్లమెంటులో బడ్జెట్ సమావేశాలు

- బ్యాంకు స్కాములతో ప్రభుత్వాన్ని కట్టడి వ్యూహంలో విపక్షాలు

న్యూఢిల్లీ: పార్లమెంటులో బడ్జెట్ సమావేశాల రెండో భాగం నేడు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల విరామం అనంతరం లోక్ సభ, రాజ్య సభలు మళ్లీ నేడు సమావేశాల్లో పాల్గొనబోతున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో చోటుచేసుకున్న స్కాముల అంశాన్ని కాంగ్రెస్ సహ విపక్షాలన్నీ లేవనెత్తనున్నాయి. నీరవ్ మోడీ స్కాం సహా దళితులు, మహిళలపై జరుగుతున్న దాడులు, రైతుల, నిరుద్యోగం తదితర సమస్యలనూ ప్రతిపక్షాలు ఎత్తిచూబోతున్నాయని విశ్వసనీయ సమాచారం. ఈ సెషన్‌లో ప్రభుత్వాన్ని కట్టడి చేసేందుకు ఇతర విపక్ష పార్టీలతో కలిసి వ్యూహాన్ని రచిస్తామని కాంగ్రెస్ నాయకుడు ఒకరు తెలిపారు. అన్ని విపక్ష పార్టీలు కలిసి వివిధ సమస్యలపై ప్రభుత్వం నుంచి సమాధానాన్ని రాబట్టుతామని వివరించారు. ఈ సమావేశాల్లో రెండు సభల్లోనూ ప్రభుత్వం పలు బిల్లులను ప్రతిపాదించనున్నది. పేమెంట్ గ్రాట్యుటీ (సవరణ) బిల్లు 2017, స్పెసిఫిక్ రిలీఫ్(సవరణ)బిల్లు 2017లను నేడు లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది.

నాగాలాండ్‌లో బీజేపీ-ఎన్‌డీపీపీ సంకీర్ణ ప్రభుత్వం

- 32మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నది : ఎన్‌డీపీపీ నేత రియో

కోహిమా: నాగాలాండ్‌లో బీజేపీ-ఎన్‌డీపీపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. తనకు స్పష్టమైన మెజారిటీ ఉన్నందున ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని ఎన్‌డీపీపీ నేత నేఫ్యూ రియో ఆదివారం నాగాలాండ్ గవర్నర్ పిబి ఆచార్యను కలిశారు. 60 స్థానాలున్న అసెంబ్లీలో తనకు 32మంది ఎమ్మెల్యేల మద్దతు ఉన్నదని ఆయన గవర్నర్‌కు తెలిపారు. శనివారం వెల్లడైన నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్(ఎన్‌పీఎఫ్)కు 27 సీట్లు, బీజేపీకి 12 నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(ఎన్‌డీపీపీ)కి 17 సీట్లు,బీజేపీకి 12 సీట్లు, నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ)కి 2 సీట్లు, జేడీ(యూ)కు ఒక సీటు రాగా ఓ స్థానంలో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఎన్‌డీపీపీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వానికి ఎన్‌పీపీ, జేడీ(యూ)తోపాటు ఓ స్వతంత్ర అభ్యర్థి కూడా మద్దతు ఇవ్వనున్నట్టు తెలుస్తోంది.

మేఘాలయ ముఖ్యమంత్రిగా కాన్రాడ్ సంగ్మా

షిల్లాంగ్: మేఘాలయ కొత్త సీఎంగా నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) నేత కాన్రాడ్ సంగ్మా కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 6న రాష్ట్ర సీఎంగా ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎన్‌పీపీ-బీజేపీ కూటమి ఏర్పాటు చేసే ప్రభుత్వంలో బీజేపీకి ఒక క్యాబినెట్ బెర్త్ ఖరారైంది. సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపడం అంత సులువు కాదని, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని కాన్రాడ్ సంగ్మా తెలిపారు. ఆయనకు యునైటెడ్ డెమోక్రటిక్ పార్టీ(యుడీపీ) అధ్యక్షుడు డొంకుపర్ రాయ్ మద్దతు పలి కారు. ఎన్‌పీపీ, బీజేపీ, యుడీపీ, హెచ్ఎస్‌పీడీపీకి చెందిన ఎమ్మెల్యేలతో ఆదివారం సాయంత్రం షిల్లాంగ్‌లో రాష్ట్ర గవర్నర్ గంగా ప్రసాద్‌ను కాన్రాడ్ సంగ్మా కలిశారు. మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నందున కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను ఆయన కోరారు. శనివారం వెల్లడించిన ఫలితాల్లో కాంగ్రెస్‌కు21, ఎన్‌పీపీ-బీజేపీ కూటమికి21, ఇతరులకు 17 స్థానాలు లభించడంతో ఇక్కడ హంగ్ ఏర్పడింది.

87కోట్ల బ్యాంకు ఖాతాలకు ఆధార్ లంకె పూర్తి

న్యూఢిల్లీ: ఆధార్ అనుసంధానం గడువు ఈ నెల 31న ముగుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమయ్యారు. దాదాపు 80శాతం బ్యాంక్ ఖాతాలకు, 60శాతం మొబైల్ కనెక్షన్‌లకు ఆధార్‌ను అనుసంధానించినట్టు యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. 12 అంకెల ఆధార్‌ను బ్యాంకు అకౌంట్లు, పాన్ కార్డు, మొబైల్ సిమ్‌కార్డులతో ఆధార్‌ను ఈ నెల 31లోపు తప్పనిసరిగా అనుసంధానించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. మొత్తం 109.9కోట్ల బ్యాంక్ అకౌంట్లకుగాను 87కోట్ల అకౌంట్లకు ఆధార్ అనుసంధానం పూర్తయిందని యూఐడీఏఐ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఇందులో 58కోట్ల డాక్యుమెంట్ల పరిశీలన పూర్తయిందని, మిగతా డాక్యుమెంట్ల పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. దేశంలో 142.9కోట్ల మొబైల్ కనెక్షన్‌లు క్రియాశీలకంగా ఉన్నాయని వాటిలో 85.7 కోట్ల వినియోగదారులు ఆధార్‌ను అనుసంధానించుకున్నారని పేర్కొన్నారు. దాదాపు 80శాతం బ్యాంక్ ఖాతాలకు అనుసంధానం పూర్తయిందని, గడువులోపు అందరూ అనుసంధానం చేసుకుంటారని ఆశిస్తున్నానని యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ పాండే తెలిపారు.

యూపీ ఉప ఎన్నికల్లో ఎస్పీకి మద్దతు

- సార్వత్రిక ఎన్నికల్లో పొత్తు ఊహాగానమే : మాయావతి

న్యూఢిల్లీ: 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీతో కలిసి పోటీ చేయనున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని బీఎస్పీ అధినేత్రి మాయావతి స్పష్టం చేశారు. అవి ఆధారరహితమైన, తప్పుడు వార్తలని ఆమె అన్నారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తమకు గౌరవనీయమైన సంఖ్యలో సీట్లు ఇచ్చేందుకు ప్రతిపాదన వస్తే అప్పుడే నిర్ణయిస్తామని మాయావతి తెలిపారు. యూపీలో ఈ నెల 11న గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాల్లో బీఎస్పీ తమ అభ్యర్థులను నిలబెట్టకుండా అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ అభ్యర్థులకు మద్దతు ప్రకటించింది. దాంతో, రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయన్న ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. బీజేపీని ఓడించేందుకే ఉప ఎన్నికల్లో ఎస్పీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని తమ పార్టీ నిర్ణయించినట్టు మాయావతి తెలిపారు.

మా అభివృద్ధితో ఎవరికీ హాని లేదు : చైనా

బీజింగ్: తమ దేశ అభివృద్ధితో ఇతర దేశాలకు ఎటువంటి హాని ఉండదని చైనా వెల్లడించింది. చాలా ఏండ్ల తర్వాత చైనా వార్షిక పార్లమెంట్ సమావేశంలో జాతీయ రక్షణ బడ్జెట్ నివేదికను ప్రకటించకపోవడం గమనార్హం. ప్రతీ సంవత్సరం నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి రక్షణ బడ్జెట్‌ను వాటాల వారీగా ప్రవేశపెట్టేవారు. అయితే ఈ ఏడాది నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ నూతన అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన విదేశాంగ శాఖ మాజీ మంత్రి ఝూంగ్ ఎసుయ్..రక్షణ బడ్జెట్ కేటాయింపులకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించలేదు. చైనా ఎప్పుడూ శాంతియుత అభివృద్ధికి కట్టుబడి ఉంటుందని ఈ సందర్భంగా జాంగ్ వెల్లడించారు.

ఆ బాలుడు 50 మందిని చంపాలనుకున్నాడు



వాషింగ్టన్: అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలోని పాఠశాలలో ఓ 14 ఏండ్ల బాలుడు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 17 మందికిపైగా చిన్నారులను పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. పాఠశాల నుంచి సస్పెండ్ చేసినందుకు కోపంతో ఈ విపరీత చర్యకు పాల్పడినట్టు పోలీసులు వెల్లడించారు. అతనికి తుపాకులన్నా, ఇతరులను చంపడమన్నా కూడా ఇష్టమేనని పేర్కొన్నారు. అయితే ఆరోజు పాఠశాలలో జరిపిన కాల్పుల్లో దాదాపు 50 మందిని చంపాలని బాలుడు పథకం వేశాడట. తాజా విచారణంలో ఆ బాలుడి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను పరిశీలిస్తే భయంకరమైన విషయాలు బయటపడ్డాయి. ఎవరెవర్ని చంపాలి? ఎలా చంపాలి? వంటి విషయాలను ఓ పోస్ట్‌లో రాసిపెట్టుకున్నాడట. తన తండ్రి ట్రక్కు తాళాలు దొంగిలించి..తాను చదువుతున్న పాఠశాలకు వెళ్లి విచక్షణారహితంగా కాల్పులు జరపాలని అనుకున్నాడు. కాల్పులు జరిపే సమయంలో టీచర్లు పాఠశాల నుంచి బయటికి పారిపోకుండా వారి వద్ద ఉన్న తాళాలు లాక్కోవాలనుకున్నాడు.

తాను చదువుతున్న పాఠశాలలోనే కాదు దగ్గర్లోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల గురించి ఆరా తీసినట్టు పోలీసులు తెలిపారు. గతంలో పాఠశాలల్లో జరిగిన కాల్పుల్లో ఎంత మంది చనిపోయారు? అన్న సమాచారాన్ని కూడా సేకరించాడు. ఇతర హంతకులతో పోలిస్తే తాను వారికంటే ఎక్కువగా కాల్చాలని కుదిరితే ఏకంగా 150 మందిని హతమార్చాలని పథకం రచించాడు.

ఊహించని ప్రమాదం..

- స్థానికుల చొరవతో ప్రాణాలు దక్కాయి

కాలిఫోర్నియా : ఉవ్వెత్తున్న ముంచుకోచ్చిన హిమపాతంతో అక్కడంతా గందరగోళంగా మారింది. స్నోబోర్డింగ్ కోసం వెళ్లిన ఐదుగురు చెల్లాచెదురు అయిపోయారు. వారిని చూసేందుకు వచ్చిన ప్రేక్షకులు హాహాకారాలు చేయసాగారు. అంత సురక్షితంగా ఉన్నారనుకున్న క్రమంలో ఓ మహిళ తన భర్త కనిపించటం లేదంటూ బిగ్గరగా అరిచింది.

రక్షణ సిబ్బందితోపాటు ప్రేక్షకులు కూడా రంగంలోకి దిగి అతన్ని వెతకటం ప్రారంభించారు. దాదాపు 20 నిమిషాల తర్వాత మంచు పొరల్లో కూరుకుపోయిన అతన్ని గుర్తించారు. గడ్డ కట్టిన మంచును ఉత్త చేతులతో తవ్వి అతని ప్రాణాలు కాపాడారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అతను ప్రాణాలతో బయటపడ్డాడు. కాలిఫోర్నియా, నెవాడా మధ్యలో ఉన్న స్క్వా వ్యాలీలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. తన పుట్టినరోజు జరుపుకునేందుకు భార్యతోసహ వచ్చిన వ్యక్తికి ఈ అనుభవం ఎదురైంది. స్థానికుల చొరవతో అతను ప్రాణాలతో బయటపడ్డాడని పోలీసులు తెలిపారు. మంచు కప్పేయటంతో ఆ రిసార్ట్‌ను తాత్కాలికంగా మూసేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది.

పాక్‌లోని సింధ్ ప్రావిన్స్ సెనేటర్‌గా...

హిందూ దళిత మహిళ ఎన్నిక

- చరిత్ర సృష్టించిన కోల్హి



కరాచీ: ముస్లిం మెజారిటీ దేశమైన పాకిస్తాన్‌లో ఓ హిందూ దళిత మహిళ చరిత్ర సృష్టించారు. సింధ్ ప్రాంతానికి చెందిన కృష్ణకుమారి కోల్హి (39) సింధ్ ప్రావిన్స్‌కు సెనేటర్‌గా ఎన్నికయ్యారు. ఈమె పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) సభ్యురాలు. దేశంలో మహిళల అభ్యున్నతి, మైనారిటీల హక్కుల సాధనకు కోల్హి గెలుపు ఓ మైలురాయి వంటిదని పీపీపీ పేర్కొంది. 52 మంది సెనేటర్ల పదవీ కాలం ఈ నెలతో ముగిసిపోతుండటంతో ఈ ఎన్నికలు నిర్వహించారు. పీపీపీ ఇంతకుముందు రత్న భగవాన్ దాస్ చావ్లా అనే హిందూ మహిళను సెనేటర్‌గా నియమించింది.

ఎవరీ కోల్హి...

సింధ్ ప్రావిన్స్‌లోని థార్ జిల్లా నాగర్‌పర్కర్ అనే మారుమూల గ్రామానికి చెందిన కోల్హి. ఓ నిరుపేద రైతు కుటుంబంలో జన్మించారు. ఆమె 9వ తరగతి చదువుతున్నప్పుడే మూడేండ్లు కుటుంబంతో సహా జైలులో గడిపారు. 16వ యేట ఆమె వివాహం జరిగింది. పెండ్లి తర్వాత తన చదువును కొనసాగించారు. 2013లో సింధ్ యూనివర్సిటీ నుంచి సోషియాలజీలో పట్టా పొందారు. తన సోదరుడి తో కలిసి పీపీపీలో సామాజిక కార్యకర్తగా పనిచేశారు. కోల్హి కుటుంబానికి ఉద్యమ వారసత్వం ఉంది. ఆమె పూర్వీకులైన రూప్లో కోల్హి .. బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడారు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో ఆయన పాల్గొన్నారు. 1858లో ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం ఉరితీసింది.

సైనిక విన్యాసాలకు పాల్పడితే ఊరుకునేది లేదు

- అమెరికాకు ఉ.కొరియా హెచ్చరిక



ప్యాంగ్యాంగ్: అగ్రరాజ్యం అమెరికాను ఉత్తరకొరియా హెచ్చరించింది. దక్షిణ కొరియాతో కలిసి సైనిక విన్యాసాలకు పాల్పడితే ఊరుకునేది లేదని ఉ.కొరియా అధికారి ఒకరు మీడియా ద్వారా వెల్లడించారు. అమెరికా, దక్షిణ కొరియాకి మధ్య జాయింట్ మిలిటరీ డ్రిల్స్ ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్తర కొరియాకి చెందిన ఓ అధికారి దీని గురించి మీడియా ద్వారా స్పందించారు. అమెరికా దక్షిణ కొరియాతో కలిసి మిలిటరీ డ్రిల్స్‌కి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు.

ఇరు దేశాలు కలిసి డ్రిల్స్‌కు పాల్పడితే దక్షిణ కొరియా, ఉత్తర కొరియా మధ్య ఉన్న సమన్వయం దెబ్బతింటుందని అన్నారు. ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలను మానుకునేలా ఆ దేశంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తీవ్ర చర్యలు తీసుకుంటున్నట్టు ఫిబ్రవరిలో అమెరికా ప్రకటించింది. ఈ చర్యలు ఉత్తర కొరియాపై ఎలాంటి ప్రభావం చూపకపోతే రెండో విడత ప్రక్రియను ఉపయోగిస్తామని అది ప్రపంచానికి చాలా ప్రమాదకరమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు.

అమెరికా విధిస్తున్న ఆంక్షలపై ఉత్తరకొరయా అభ్యంతరం తెలిపింది. ఈ విషయంలో అమెరికాతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అయితే ఇందుకు అమెరికా కూడా ఒప్పుకుంది కానీ ఉత్తరకొరియాతో చర్చలు జరిపాక దేశం ఎలాంటి అణు ప్రయోగాలకు పాల్పడకుండా ఉండాలని అమెరికా డిమాండ్ చేసింది.

సిరియాను వణికిస్తున్న అంటువ్యాధి

- ఎడారి ఈగలతో వ్యాప్తి...
- సోకినవారు 20-30 రోజుల్లో మృతి!



ఈగలతో వ్యాప్తి..

దమాస్కస్: అసలే అంతర్యుద్ధంతో అతాలకుతలం అవుతున్న సిరియాను ఒక కొత్తరకం అంటువ్యాధి బెంబేలెత్తిస్తోంది. జిహాదీ జబ్బుగా వ్యవహరించే 'లెష్మెనియాసిస్' సిరియాలో వేగంగా వ్యాపిస్తోంది. ముఖ్యంగా ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు ఆక్రమించిన ప్రాంతాల్లో ఈ వ్యాధి వ్యాప్తి తీవ్రంగా ఉంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తులు 20-30 రోజుల్లో కన్నుమూస్తున్నారు. గతంలో ఈ వ్యాధి సిరియా, ఇరాక్‌లో ఉన్నట్టు ఎటువంటి ఆధారాలు లేవు. ఐఎస్ ఎప్పుడైతే సిరియాలో ప్రవేశించిందో అప్పుడే ఈ వ్యాధి బయటపడింది. దీంతో ఈ వ్యాధిని స్థానికంగా జిహాదీ వ్యాధిగా వ్యవహరించడం మొదలుపెట్టారు.

ఈ భయంకరమైన వ్యాధి సాధారణంగా ఎడారి ఈగల నుంచి వ్యాపిస్తోంది. ఇవి సిరియాలో లేవు. పక్కనున్న దేశాల నుంచి ఈ వ్యాధి క్రిములను ఎడారి ఈగలు తీసుకొచ్చి ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. చాలా మంది ఉగ్రవాదులు ఇతర దేశాల నుంచి సిరియా వచ్చే క్రమంలో వారి సామగ్రిని తరలించారు. ఈ క్రమంలో వాటిపై వాలిన ఎడారి ఈగలు సిరియాలోకి ప్రవేశించి ఉండవచ్చని భావిస్తున్నారు. అవి సిరియాలో ప్రవేశించిన సమయంలోనే ఐఎస్ వివిధ గ్రూపులతో యుద్ధం చేస్తోంది. ఈ క్రమంలో చాలా మంది చనిపోయారు. వీరి మృతదేహాలపై ఈగలు వాలి క్రిములను వ్యాపింప చేశాయి. అప్పట్లో శవాలను వీధుల్లోని చెత్తకుప్పల్లో వేసేవారు. దీంతో ఈ వ్యాధి అత్యంత వేగంగా వ్యాపించింది. ఒక సారి ఈ వ్యాధి సోకిన వ్యక్తి శరీరంపై పుండ్లు ఏర్పడి నెమ్మదిగా ఆ భాగాలు కుళ్లిపోతాయి. ముఖంపై మొదలైయ్యే పుండ్లు నెమ్మదిగా శరీరం మొత్తం వ్యాపిస్తాయి. పరాన్న జీవుల నుంచి వ్యాపించే ఈ వ్యాధితో అవయవాలు కుళ్లిపోయి ఆ వ్యక్తి మృతి చెందుతాడు. శరీరంలోని ప్రతి కణం దీనిప్రభావానికి లోనుకావడం శాస్త్రవేత్తలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇది కేవలం ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉండే వ్యాధికాదు. దీంతో మిగిలిన ప్రాంతాలకు వ్యాపించక ముందే అదుపు చేసేందుకు వ్యాక్సిన్ తయారు చేసేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం ఒక ప్రయోగాత్మక వ్యాక్సిన్‌ను సిద్ధం చేశారు.

అమెరికాకు కూడా జీవితకాల అధ్యక్షుడు వస్తాడు...

- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌పై ప్రశంసలు కురిపించిన ట్రంప్



వాషింగ్టన్ : చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌ను అమెరికా అధ్యక్షుడు పొగడ్తలతో ముంచెత్తారు. ఆయన గొప్ప వ్యక్తి అని.. చైనాలో గత వందేండ్లలో అత్యంత శక్తిమంతమైన అధ్యక్షుడు ఆయనేనని కొనియాడారు. చైనాలో అధ్యక్ష పదవిని రెండుసార్లు మాత్రమే చేపట్టే నిబంధనను అక్కడి అధికారిక కమ్యూనిస్ట్ పార్టీ శనివారం తొలగించింది. దీంతో జిన్‌పింగ్ నిరవధికంగా ఆ పదవిలో కొనసాగేందుకు మార్గం సుగమం చేసింది. ఈ నేపథ్యంలో శనివారం దక్షిణ ఫ్లోరిడా ఎస్టేట్‌లో నిర్వహించిన విరాళాల సేకరణ కార్యక్రమంలో రిపబ్లికన్ దాతలనుద్దేశించి ట్రంప్ మాట్లాడుతూ చైనా అధ్యక్షుడిపై ప్రశంశలు కురిపించారు.

"ఆయన ప్రస్తుతం జీవితకాలపు అధ్యక్షుడు. ఎంతో గొప్పవ్యక్తి. ఆయన అలా చేయగలిగారు. దీన్ని నేను గొప్ప విషయంగా భావిస్తున్నా. ఆమెరికా కూడా జీవితకాలపు అధ్యక్షుడిని ఏదో ఒకరోజు కలిగి ఉంటుంది'" అని అన్నారు. అమెరికా రాజ్యాంగం ప్రకారం ఆ దేశ అధ్యక్షుడిగా ఒక వ్యక్తి రెండు పర్యాయాలు మాత్రమే కొనసాగే అవకాశం ఉంది. గతంలో ఫ్రాంక్లిన్ రూస్‌వెల్ట్ 1932 నుంచి వరుసగా నాలుగు పర్యాయాలు అమెరికా అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ తర్వాత 1951లో అమెరికా రాజ్యాంగానికి సవరణలు చేసి.. ఒక వ్యక్తి అధ్యక్ష పదవిని రెండు పర్యాయాలకంటే ఎక్కువ సార్లు చేపట్టకుండా నిబంధన తీసుకువచ్చారు.

'వైట్‌హౌస్' వద్ద కాల్పులు



వాషింగ్టన్: ఓ గుర్తు తెలియని వ్యక్తి అమెరికా అధ్యక్ష భవనం 'వైట్‌హౌస్' భద్రతా సిబ్బందికి, ఉన్నతాధికారులకు ముచ్చెమటలు పట్టించాడు. ఏకంగా వైట్‌హౌస్‌పై కాల్పులు జరిపిన ఆ దుండగుడు తనకు తానే కాల్చుకుని ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది.

వైట్ హౌస్ సిబ్బంది కథనం ప్రకారం.. ఓ సాయుధుడు శనివారం మధ్యాహ్నం అధ్యక్ష భవనం వద్దకు చేరుకున్నాడు. తన వెంట తెచ్చుకున్న తుపాకీతో పెన్సిల్వేనియా అవెన్యూ వద్ద కొన్ని రౌండ్లు కాల్పులు జరిపాడు. కాల్పుల ఘటనలో ఒక్కసారిగా అప్రమత్తమైన సిబ్బంది సాయుధుడ్ని పట్టుకునేందుకు చూడగా.. తుపాకీతో కాల్చుకుని బలవన్మరణం పొందాడు. కాల్పుల నేపథ్యంలో వైట్‌హౌస్ వద్ద చోటుచేసుకున్న భయానక పరిస్థితులకు సంబంధించిన వీడియో ట్వీటర్‌లో వైరల్‌గా మారింది. కాగా, శనివారం ఫ్లోరిడా పర్యటనలో ఉన్న ట్రంప్ దంపతులు సాయంత్రానికి వైట్‌హౌస్‌కు రావాల్సి ఉంది. వారు మరికాసేపట్లో వైట్‌హౌస్‌కు వస్తారని అనుకున్న సమయంలో అక్కడ కాల్పులు చోటుచేసుకున్నాయి. అయితే, కాల్పులు జరిగిన సమయంలో వైట్‌హౌస్‌లో ట్రంప్ దంపతులు లేకపోవడం, వారు ఇంకా ఫ్లోరిడా పర్యటనలోనే ఉండటంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. గత నెల 23న ఓ మహిళ తన కారుతో అధ్యక్ష భవనం వద్ద బీభత్సం సృష్టించగా, వైట్‌హౌస్ సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.


రుణమాఫీకి సరిహద్దు అడ్డు

రూ.108కోట్ల రుణమాఫీ జాడేది అమాత్యా?

- మంత్రి పోచారం దృష్టికి సమస్య
- అర్హత ఉన్నా 21వేల మంది రైతుల పేర్లు మాయం
- కలెక్టర్ లేఖ పంపినా స్పందన కరువు

నవతెలంగాణ-ఖమ్మం ప్రతినిధి

"రైతుల సంక్షేమంలో యావత్ దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉంది... రూ.17,500కోట్ల రైతు రుణమాఫీ చేసి రైతులకు అండగా ఉన్నాం.." అని ఇటీవల ఖమ్మం బహిరంగ సభలో వ్యవసాయ శాఖామంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి చెప్పారు. కానీ, మంత్రి మాటలు ఖమ్మం జిల్లాలోని రైతులకు ఏ మాత్రం వర్తించవని దాదాపు 21వేల మంది రైతులే విమర్శిస్తున్నారు. అన్ని విధాలా అర్హత ఉన్నా ఏపీ, తెలంగాణ ప్రాంతాల సరిహద్దుల్లో ఉండటం వల్లే తమకు రుణమాఫీ అందకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు రుణాలు రీషెడ్యూల్ చేసుకున్నందుకు అర్హత కోల్పోయారని అధికారులు ప్రకటించారు. దీంతో ఇటీవల జిల్లాలో పర్యటించిన మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 21వేల మందికి అందాల్సిన రూ.108కోట్లను విడుదల చేయాలని మొరపెట్టుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అర్హత ఉండీ రుణమాఫీ అందని రైతుల ఆవేదనపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..



2014లో మొదటి విడత రుణమాఫీని విడుదల చేసే సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు పంపిన నివేదిక ప్రకారం 3లక్షలా 80వేల తొమ్మిది మందికి రూ.1711.38కోట్ల రుణమాఫీని విడుదల చేయాలి. అందులో మొదటి విడతగా రూ.409కోట్లు విడుదలయ్యాయి. అనంతరం అర్హత లేనివారిగా పేర్కొంటూ దాదాపు 21వేల మంది రైతుల పేర్లను జాబితా నుంచి తొలగించాలని, వారి పేరున విడుదల చేసిన రుణమాఫీ నిధుల్లో రూ.27కోట్లను వెనక్కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో చేసేదేమీ లేక అధికారులు రైతుల ఖాతాలకు జమకావాల్సిన రుణమాఫీ నిధులను వెనక్కి పంపారు. ఈ విషయమై వ్యవసాయాధికారులను ఆరా తీయగా రెండో విడతలో అన్ని కలిపి వస్తాయన్నారు. ఇలా నాలుగు విడతలుగా మంజూరైన నిధుల్లో ఒక్కపైసా కూడా నేటికి అందలేదు. నాలుగేండ్లుగా ఎదురుచూసిన బాధిత రైతులు చివరకు బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరగలేక మంత్రి పోచారం దృష్టికి తీసుకెళ్లారు.

సరిహద్దులో ఉండటమే సమస్యా ?

తెలంగాణ, ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దులో ఉన్న గ్రామాలకు చెందిన రైతుల భూములు ఆంధ్రాలోకి వెళ్లాయి. ఆధార్, గుర్తింపు కార్డులు ఖమ్మం జిల్లాలోనే ఉన్నాయి. వీరికి ఏపీ ప్రాంతంలో భూములుండటంతో రుణమాఫీకి అర్హత లేదని తేల్చిచెప్పి నిధులు వెనక్కి మళ్లించారు. మరికొందరు రీ షెడ్యూల్ చేసుకుని బ్యాంకులకు కిస్తీలు కట్టడంతో వారికి రుణమాఫీ అందకుండా పోయింది. మరికొందరు 1/70 యాక్టు అమల్లో భాగంగా అందకుండా పోయింది. వీరందరికీ ఏపీజీవీబీ బ్యాంకుకు చెందిన 48 శాఖల ద్వారా రుణాలు మాఫీ కావాల్సి ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొదటి, రెండో విడతల్లో రైతులకు అందకుండా పోయిన రుణమాఫీ రూ.108కోట్లను విడుదల చేసేందుకు కలెక్టర్ లోకేష్ కుమార్ ప్రభుత్వానికి 2015లోనే నివేదిక పంపారు. అయినా ఈ విషయమై ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు.

రుణమాఫీ అందలేదు...: మన్నెపల్లి వెంకటేశ్వర్లు, పోచారం

రుణమాఫీ అయితదనుకున్న. అధికారులు నిర్లక్ష్యంతో నాలాంటి రైతులపేర్లను జాబితాలో చేర్చలేదు. రుణమాఫీ కాలేదని ఫిర్యాదుచేస్తే రెండో విడతలో వస్తుందన్నారు. ఎదురుచూశాం.

నాలుగు విడతలు రుణమాఫీ అయినా నాకు మాత్రం నయాపైసా మాఫీ కాలేదు. న్యాయంగా మాకు దక్కాల్సిన రుణమాఫీని ఇప్పటికైనా అందించాలి.

రుణమాఫీ నిధులను తగ్గించే చర్యల్లో భాగమే.. : మాదినేని రమేష్- రైతు సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి

రుణమాఫీ నిధులను తగ్గించే చర్యలో భాగంగా ఏవేవో సాకులను చూపుతూ జాబితా నుంచి ఎక్కువ సంఖ్యలో రైతుల పేర్లను ప్రభుత్వం తీసేసింది.

జిల్లాకు సంబంధించి రైతులపేర్లను వ్యవసాయ అధికారులు పంపినా నివేదికల నుంచి అర్హుల పేర్లను తొలగించి అన్యాయం చేశారు. బాధిత రైతులకు న్యాయం చేయాలి.

రజక ఫెడరేషన్‌కు రూ.800 కోట్లు కేటాయించాలి

- మంత్రి ఈటలకు రజక వృత్తిదారుల సంఘం వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రజక ఫెడరేషన్‌కు వచ్చే బడ్జెట్‌లో రూ.800 కోట్లు కేటాయించాలని రజక వృత్తిదారుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజు నాగరాజు, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లేష్, హైదరాబాద్ నగర అధ్యక్షులు జి బిక్షపతి తదితరులు ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ 2017-18 వార్షిక బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ.250 కోట్లు కేటాయించి కేవలం రూ.7 కోట్లు మాత్రమే విడుదల చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేటాయించిన మొత్తంలో రూ.3 కోట్లు రుణాలకు, రూ.4 కోట్లు మోడ్రన్ దోభీఘాట్ల నిర్మాణానికి కేటాయించి నేటికి ఆ నిధులను ఖర్చు చేయలేదన్నారు. రజక ఫెడరేషన్ రుణాలు, సొసైటీల ఏర్పాటు, వ్యక్తిగత రుణాలు, దోభీఘాట్ల నిర్మాణాలపై బీసీ సంక్షేమ శాఖ సమాచారం అందించడం లేదని తెలిపారు. బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ నిధుల విడుదల మాత్రం జరగడం లేదన్నారు. వచ్చే బడ్జెట్‌లో ఆధునిక వాషింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.100 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వాషింగ్ ప్లాంట్లు మొత్తం అగ్రకులాల చేతిల్లోనే ఉన్నాయని, అలా కాకుండా వాటిని రజకులకే కేటాయించాలని కోరారు. అదేవిధంగా మొబైల్ లాండ్రీ పథకాన్ని ఏర్పాటు చేసి రజకులకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంత దోభీ ఘాట్లకు రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు.

స్వామికి కన్నీటి వీడ్కోలు

నవతెలంగాణ-కాజీపేట రూరల్

సీపీఐ మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ డీసీఎం దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్ అంత్యక్రియలు వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం రాంపేటలో ఆదివారం జరిగాయి. వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక కన్వీనర్ ఆకుల ప్రభాకర్ నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

పేదలకు అందుబాటులో క్యాన్సర్ ఆస్పత్రి

- మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు
- నగరంలో 200 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన



నవతెలంగాణ - బాలసముద్రం

కేన్సర్ మహమ్మారి బారిన పడిన బడుగు, బలహీన, పేద వర్గాలు చికిత్స కోసం హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అందుబాటులో క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ అర్బన్ జిల్లాలోని ఆరెపల్లి ఓఆర్ఆర్ జంక్షన్‌లో ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు విద్యాసాగర్ ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతర ప్రతిమ ఫౌండేషన్ చైర్మెన్ బొయినిపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను తాను దగ్గరి నుంచి చూశానని, వారి బాధలు వర్ణనాతీతం అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు ఇతర రాష్ట్రాల వ్యాధిగ్రస్తులు కూడా వచ్చే విధంగా నాణ్యమైన వైద్యాన్ని అందించాలని ఆస్పత్రి యాజమాన్యానికి సూచించారు. బోయినపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ నాణ్యమైన వైద్యం అందిస్తామని, ఇక్కడి వాతావరణం కూడా ఆస్పత్రి నిర్మాణానికి అనుకూలంగా ఉందన్నారు. స్పీకర్ మధుసూదనచారి మాట్లాడుతూ ఆస్పత్రి నిర్మాణం చేయాలనుకోవడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి నిర్మాణంలో చేదోడు వాదోడుగా ఉంటామని ఆస్పత్రి యాజమాన్యానికి భరోసా ఇచ్చారు. ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ క్యాన్సర్ ఆస్పత్రిని వరంగల్ నగరంలో నిర్మించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి మెడికల్ కాలేజీగా రూపుదిద్దు కోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్థికమంత్రి ఈటల రాజేందర్, పర్యా టక, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అజ్మీరా చందులాల్, ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, పసునూరి దయాకర్, సీతారాం నాయక్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, వరంగ ల్ నగర మేయర్ నన్నపునేని నరేందర్, కుడా చైర్మెన్ మర్రి యాదవరెడ్డి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా పెండ్లి వేడుక

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్, పద్మావతి దంపతుల ప్రథమ పుత్రిక మేఘన వివాహం రోహిత్‌తో అంగరంగ వైభవంగా జరిగింది. సికింద్రాబాద్ సిఖ్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఈ పెండ్లి వేడుకలో పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకలో వధూవరుల కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఇచ్చిన హామీలు అమల్జేయ్

- ఆ తర్వాత థర్డ్ ఫ్రంట్‌పై ఆలోచించు : వీహెచ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

'ముందుగాల్ల ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలు అమల్జేయ్. ఆ తర్వాత థర్డ్ ఫ్రంట్‌పై ఆలోచించు' అంటూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు సీఎం కేసీఆర్‌కు సూచించారు. థర్డ్ ఫ్రంట్ పెట్టి ఢిల్లీకి సీఎం కేసీఆర్ వెళ్లడం సాధ్యం కాదన్నారు. ఆదివారం బాసరకు వెళ్లారు. అనంతరం నిజామాబాద్‌లోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఉన్న పదవికే న్యాయం చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. 'కాంగ్రెస్ పార్టీ చేపట్టిన బస్సు యాత్ర చూసి కేసీఆర్ భయపడుతున్నాడు. జనమొస్తలేరని ప్రచారం చేస్తున్నరు. అలాంటప్పుడు ఉలికెందుకు? యాత్రకొస్తున్న స్పందనను చూసి ఓర్వలేకనే విమర్శిస్తున్నారు' అని అన్నారు. రైతుల చేతులకు బేడీలు వేయించిన చరిత్ర కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేకే, డీఎస్‌లకు కాంగ్రెస్‌లో ఉన్న విలువ టీఆర్ఎస్‌లో లేదని, అందుకే మాట్లాడకుండా చేతులు ముడుచుకొని సభల్లో కూర్చుంటున్నారని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల విధానమే తమ నినాదమన్న కేసీఆర్.. ఇప్పుడు వాళ్లనే చంపుతున్నాడన్నారు.

ఎంసెట్ దరఖాస్తుల స్వీకరణ షురూ

- తొలిరోజే సాంకేతిక సమస్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, ఫారెస్ట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎంసెట్-2018 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో నిర్వహించే ఎంసెట్‌కు తొలిరోజే సాంకేతిక సమస్య తలెత్తింది. ఎంసెట్ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని పొందుపరచడంలో సర్వీస్ ప్రొవైడర్‌కు కొన్ని ఇబ్బందులు వచ్చినట్టు సమాచారం. దీంతో ఎంసెట్ వెబ్‌సైట్ అభ్యర్థులకు సకాలంలో కాకుండా సాయంత్రానికి ఆలస్యంగా అందుబాటులోకి వచ్చింది. ఎంసెట్ వెబ్‌సైట్‌ను చూసేందుకు అభ్యర్థులు ఉదయం నుంచే ఎదురుచూసినా అందుబాటులోకి రాకపోవడంతో నిరాశ చెందారు. సాయంత్రం అందుబాటులోకి రావడంతో సమాచారాన్ని వెతికే పనిలో అభ్యర్థులు పడ్డారు. ఎంసెట్ రాతపరీక్షలు మే 2 నుంచి 7వరకు ఆన్‌లైన్‌లో జరగనున్న విషయం తెలిసిందే. దరఖాస్తుల సమర్పణకు తుది గడువు వచ్చేనెల 4వ తేదీ వరకు ఉంది. ఎంసెట్ దరఖాస్తు ఫీజు ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు రూ.400, బీసీ, ఓసీ, ఇతరులకు రూ.800 నిర్ణయించారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాలు రెండు పరీక్షలు రాసే అభ్యర్థుల్లో ఎస్సీ, ఎస్టీలకు రూ.800, ఇతర అభ్యర్థులకు రూ.1,600 ఉంది. ఎంసెట్‌కు దరఖాస్తు చేసే అభ్యర్థులందరికీ తప్పనిసరిగా ఈ-మెయిల్ ఉండాలనే నిబంధన విధించారు. మే 2,3 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ, ఫారెస్ట్ కోర్సుల్లో ప్రవేశాలకు రాతపరీక్ష, మే 4,5,7 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్ష జరగనుంది. సాంకేతిక కారణాలతో ఆలస్యంగా వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిందని ఎంసెట్ కన్వీనర్ ఎన్ యాదయ్య నవతెలంగాణతో చెప్పారు.

పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో విదేశీ బృందం

- చేపల పెంపకంపై శిక్షణ
- కేజ్ కల్చర్ (పంజర వల) విధానం పరిశీలన

నవతెలంగాణ-కూసుమంచి

ఆఫ్రికన్ దేశాలైన నైజీరియా, ఇథియోపియాతో పాటు పలు దేశాలకు చెందిన 15మంది ప్రతినిధుల బందం ఆదివారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరులో గల పీవీ నర్సింహారావు తెలంగాణ మత్స్య పరిశోధనా కేంద్రాన్ని సందర్శించింది. చేపల పెంపకంలో అవగాహన పొందే నిమిత్తం ఈ బందం ఇక్కడకు వచ్చింది. జాతీయ వ్యవసాయ అభివద్ధి మండలి ఆధ్వర్యంలో 21రోజులుగా వర్షాధారిత ప్రాంతాల్లో పంటల సాగు విధానాలపై విదేశీయులు శిక్షణ పొందుతున్నారు. అందులో భాగంగా పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో చేపల పెంపకంలో మెళకువలు నేర్చుకునేందుకు శిక్షణ నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా చేపల పెంపకంలో పాటించే జాగ్రత్తలు, నీరు, వాతావరణం, లాభ నష్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ బృందానికి క్రీడా ప్రిన్సిపల్ సెక్రటరీ అండ్ డైరెక్టర్ కృష్ణారావు, కో-డైరెక్టర్ నాగార్జున కుమార్, సీనియర్ రీసెర్చ్ ఫెలో శ్రీనివాస్‌లు సారథ్యం వహించారు. చేపల పెంపకంలో పాటించాల్సిన నియమాలు, మెళకువలను ప్రయోగపూర్వకంగా పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త విద్యాసాగర్‌రెడ్డి వివరించారు. అనంతరం మత్స్యపరిశోధనా కేంద్రం నుంచి పాలేరు జలాశయంలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్ (పంజర వల)ను పరిశీలించారు. అందులో చేపల పెంపకం విధానం, వాటికి ఆహారం, తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

నవతెలంగాణ
దర్వాజ
హైదరాబాద్ 4
సోమవారం 5-3 -2018

అతని కల నిజమైంది!

అవును అతని కల నిజమైంది
నగదు రహిత భారతానికి
తెర తీసినట్లయింది!

తేనెటీగల కళ్ళు కప్పే
తెరువరులు మ ధువునెత్తుకెళ్ళారు!
సప్త సముద్రాలు దాటించిన అతని కంట అశ్రువులశించలేము!

ముందు జాగ్రత్తగా
అతని దేశ భక్తి విదేశాల్లో డిపాజిటైంది!
దేశాలెన్నో తిరగమరిగిన అతనికి
ఇప్పుడే దేశమే పరాయిదైంది!

జీరో అకౌంట్లన్నీ
స్విస్ బ్యాంకు అక్రమ ఖాతాల వైపు చూస్తుంటే
మన ఖాతాలిక్కడ జీరో అయినవి!

ఈ దేశంలో దొంగలకు ముసుగు లేదు
వేల వేల కోట్ల స్కాములకు కొదవ లేదు!

దేశభక్తి ఫ్యాషనైన చోటల్లా
నినాదాలు భ్రమలు కలిగిస్తాయి!
మనమిప్పుడు సామ్రాజ్య వాదాన్ని నిలదీసినట్లే
ప్రదర్శనా శీల దేశభక్తిని ఎండగట్టాలి!!

– కోట్ల వెంకటేశ్వరరెడ్డి, 9440233261

కలగా మిగిలిన జ్ఞాపకం

ఊళ్ళో ఉన్న బడితో బతకడం కష్టం. హైదరాబాదులో ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నాల ఫలితాలు ఎంతకీ తేలడం లేదు. దాంతో మరోదారి వెతుక్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఆ ప్రయత్నాల్లో భాగంగా చౌడేపల్లె వెళ్ళాను. విజయవాణిలో కూర్చున్నాను. నాక్కూడా చాలామంది ఉపాధ్యాయుల్లాగే, ఏమా బడి', 'పాఠశాల' పుస్తకాలనుపయోగించుకుని పాఠాలు చెప్పిన అనుభవం ఉంది. కానీ ఆ పుస్తకాలు వెలువడే విద్యాలయానికి వెళ్ళడం మాత్రం అదే మొదటిసారి. కృష్ణమూర్తిగారు ఊళ్ళో లేరు. వచ్చేవరకూ ఎదురు చూద్దామనే ఉద్దేశంలోనే అక్కడే తిరుగుతూ కాలం గడుపుతున్నాను. అదే సమయంలో మా తమ్ముడు రమణ కుమార్ పాపిరెడ్డిగారి పల్లెనించీ పంపించిన విద్యార్థి విశ్వనాథ్ నన్ను వెతుక్కుంటూ వచ్చాడు. విషయం ఏమిటంటే హైదరాబాద్‌లో రచయితగా ఉద్యోగం వచ్చింది. మర్నాడే వెళ్ళి ఉద్యోగంలో చేరాలి. ఉద్యోగం కోసం కాకపోయినా కనీసం కృష్ణమూర్తిగారిని చూడ్డం కోసమైనా ప్రయత్నిద్దామని చూస్తే ఆయన రావడం ఇంకా ఆలస్యం అవుతుందని తెలిసింది. దాంతో ఆయన్ని చూడకుండానే వెనుదిరిగి రావాల్సి వచ్చింది. ఆవిధంగా ఆయన దగ్గరకి ఒక ఉద్యోగం కోసం వెళ్ళాను. కానీ మరో ఉద్యోగంతో తిరిగివచ్చాను.

ఒకసారి నేను వరంగల్లులో ఉండగా ఫోనొచ్చింది. అవతలివైపునుండి మాట్లాడుతున్నది మా పలమనేరు బాలాజీ స్వరంలా అనిపించడంతో వినడం మొదలు పెట్టాను. తరవాత ఆ గొంతు అతనిది కాదని అర్థమైనా అవతలినించీ మాటలు కొనసాగుతూనే ఉన్నాయి. సాహిత్యం గురించీ తెలుగు భాషగురించీ దాదాపు గంటసేపు మాట్లాడుకున్నాం. అంతసేపు మాట్లాడినా అయన గురించి నేను ఏ వివరాలూ అడక్కపోవడంతో పాపం కృష్ణమూర్తిగారు తన గురించి తనే చెప్పుకోక తప్పలేదు. ఆయన గురించి తెలియగానే నేను ఉద్యోగం గురించి విజయవాణికి వెళ్ళిన విషయమూ అక్కడుండగానే హైదరాబాద్ నించీ ఉద్యోగంలో చేరమని వచ్చిన ఉత్తరం గురించీ చెప్పగానే అవతలి వైపునించీ గొల్లుమనే నవ్వు తెరలు తెరలుగా వినిపించింది. ఆ నవ్వే ఆయనకి గుర్తింపు. అందులోని స్వచ్ఛత ఆయనకి మాత్రమే స్వంతం. అప్పటినించీ మొదలైన స్నేహం నానాటికీ చేవదేరుతూ వచ్చింది.

ఓ సాయంత్రం ఫోన్ సంభాషణలో మీకు ఏ సాహిత్య ప్రక్రియ ఇష్టం అనడిగారు. అన్నీ ఇష్టమేనని చెప్పాను. అలా కాదు ఏ ప్రక్రియమీద మాట్లాడగలరు అన్నారు. ఏ ప్రక్రియలోనైనా ప్రత్యేకంగా కృషి చేసిన వాళ్ళు మాత్రమే ఆ ప్రక్రియగురించి సాధికారికంగా మాట్లాడగలరు. కానీ



నాయుని కృష్ణమూర్తి (1951 - 1 మార్చి 2018)

ఆ సహజత్వం, స్వచ్ఛత, ఆ ఏకతలో విలసిల్లే అనేకత, ఆ అనేకతలోనే వెల్లివిరిసే ఏకత ఇవన్నీ ఆయన రాసిన కథలు, నవలలు, నాటకాలూ అన్నిటా సరిసమానంగా పరుచుకుని ఉంటాయి. అంతేకాదు, పురాణాల్ని కూడా తనదైన సహజసుందర శైలిలో రాశారు. వాటిలో 'జయమ్' విశిష్టమైనది.

నాలా దేనిమీదా ఏ అధికారం లేనివాళ్ళు దేనిగురించైనా అనర్గళంగా మాట్లెడెయ్యగలరు అన్నాను. ఆయన మళ్ళీ సుదీర్ఘంగా నవ్వారు. దాని అర్థం ఏమిటో మరో నాలుగు రోజులకి వచ్చిన పోస్టు చూశాగ్గానీ అర్థం కాలేదు. చౌడేపల్లెలో జరగబోయే ఏడు పుస్తకాల ఆవిష్కరణ సందర్భంగా వెలువడనున్న 'మల్లెలు తూరుపెత్తిన వేళ' అనే కవిత్వ సంపుటి గురించి మాట్లాడమంటూ నాకు పంపిన పుస్తకం. అది సి వేణుగారి కవిత్వం. దాని గురించి మాట్లాడ్డానిగ్గానీ అందులోని కవిత్వ విలువలను గురించి చెప్పడానిగ్గానీ నేను ఎంతమాత్రం సరిపోను. కానీ తప్పించుకోలేని పరిస్థితి. చివరికి ఆ కవిత్వంలోని లయబద్ధతని పట్టుకుని పాటలుగా వరసలు కట్టుకుని పాడి వినిపించాను. ఆ విధంగా ఎప్పుడో పదేళ్ళ క్రితం పిల్లలకి మాత్రమే పాటలు నేర్పిన అనుభవం ఉన్న నేను మొదటిసారిగా పాటగాడినైపోయాను. అందరికీ ఆత్మీయుడిని కూడా అయిపోయాను. అదేంటా్రర్ హఠాత్తుగా ఇలాంటి పరీక్షలు పెట్టేస్తే ఏమైపోవాలి అని అడిగితే, "మీ జొన్నవిత్తులవాళ్ళు సంగీతంలో దిట్టలు కదా" అంటూ ఆంధ్ర గంధర్వ జొన్నవిత్తుల శేషగిరిరావుగార్ని గుర్తు చేసి నన్ను ధన్యుణ్ణి చేశారు. అదీ వారి సమయజ్ఞత. వారు గుర్తు చెయ్యడంలోనే కాదు ఎదుటి మనిషిని గుర్తించడంలోనూ సందర్భానికి తగినట్టుగా మలుచుకోవడంలోనూ వారికి అస్తిత్వాన్ని సమకూర్చడంలోనూ ఎంతో నేర్పరి.

ఆయన్ని మీరూ చూశారుగా..? తెల్ల ప్యాంటూ తెల్ల షర్టూ వేసుకున్న వాల్మీకి లాగానో వ్యాస మహర్షిలాగానో కనిపిస్తారు. రంగెయ్యని ఆ తెల్ల జుట్టూ గెడ్డం.., పాల మీగడలా మెరిసే మీసాలూ వాటి వెనుక విరిసే చిరు నవ్వులే చెప్పేస్తాయి, ఆయన సహజత్వానికి ఎంత ప్రాధాన్యత నిస్తారనే విషయాన్ని. తెలుపంటే స్వచ్ఛతకి నిదర్శనం. తెలుపంటే రంగులన్నీ కలగలిసిన ఏక వర్ణం. అంతేకాదు, అది ఏకం అయిన అనేకం కూడా. ఆ సహజత్వం, స్వచ్ఛత, ఆ ఏకతలో విలసిల్లే అనేకత, ఆ అనేకతలోనే వెల్లివిరిసే ఏకత ఇవన్నీ ఆయన రాసిన కథలు, నవలలు, నాటకాలూ అన్నిటా సరిసమానంగా పరుచుకుని ఉంటాయి. అంతేకాదు, పురాణాల్ని కూడా తనదైన సహజసుందర శైలిలో రాశారు. వాటిలో 'జయమ్' విశిష్టమైనది. దానికి రావలసినంత పేరుప్రతిష్ఠలు రాలేదు. దానిమీద జరగాల్సినంత చర్చ జరగలేదు.

ఆయన పూనుకుంటే ఏ పనైనా సకాలంలో చక్కని క్రమశిక్షణతో విజయవంతంగా పూర్తికావలసిందే. అంతవరకూ ఆయన విశ్రమించరు. అది సంస్థ నిర్వహణలోనే కాదు, సాహిత్య నిర్వహణలో కూడా ఎన్నో సందర్భాల్లో నిరూపితమైంది. ప్రక్రియాభేదం లేకుండా అన్నిరకాల పుస్తకావిష్కరణలు, చర్చాకార్యక్రమాలు, సాహిత్య సభలు, ఒకటా రెండా సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి ఆయన చెయ్యని పనిలేదు. ఆ సభలకు హాజరుకాని సాహిత్యవేత్తలు లేరు. అన్ని చేసినా అయనకి తృప్తిలేదు. ఒక బృహద్గ్రంథాలయాన్ని స్థాపించాలనే కోరిక ఇంకా అలాగే మిగిలిపోయింది...

అందులో లైబ్రేరియన్‌గా శేషజీవితం గడపాలనే నా కోరికలాగే.

– జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి, 94400 37258

జర్మనీలో కమ్మని కవితా పరిమళం

యాత్రాసాహిత్యం చదివినప్పుడు మనసు పరవశిస్తుంది. కేవలం కాలక్షేపమే కాకుండా చారిత్రక, సాంస్కృతిక అంశాల సమాహారంగా చదువరిలోనూ నిక్షిప్తమవుతుంది. ఆ రచన ఒక కవి చేసినదయినపుడు ఆ కవితాజ్యోతుల వెలుగుల్లో ఉద్వేగాల గాలులు మనల్ని తాకుతాయి. అలాంటి ఉద్విగ్నానుభూతిని కలిగించారు ఆచార్య ఎన్.గోపి గారు తమ 'జర్మనీలో కవితాయాత్ర' గ్రంథంతో...

సాహిత్య అకాడెమీ తరఫున వారు, హిందీ కవి డా.చందర్ త్రిఖ, పంజాబీ కవి డా.సతీష్ వర్మ, బెంగాలీ కవి డా.అంశుమన్ కలిసి 2014 మేలో ఆరు రోజులపాటు సాగిన కవితా యాత్ర అనుభవాల సారం ఈ పుస్తకం. హేంబర్గ్, హేలే- విట్టనబర్గ్, బెర్లిన్, హైడెన్బర్గ్ నగరాలలోని విశ్వవిద్యాలయాల్లో కవితా పఠనం, కవిపరిచయాలు లక్ష్యంగా వీరి యాత్ర సాగింది. కొన్నిచోట్ల Asian Studies సంస్థలుండటం హిందీ బెంగాలీ భాషలకు చాలా ఆదరణ ఉండటం ఇప్పుడిప్పుడే ఉర్దూ, తమిళ్, కన్నడ భాషలకు గుర్తింపు రావటాన్ని మనం గమనిస్తాం. వీరి కవిత్వం మూడు భాషల్లో అంటే మూలభాషతో పాటు ఇంగ్లీషు, జర్మనీ అనువాదాలుగా అక్కడి విద్యార్థులకందటం కవిత్వంపై చర్చ. ఇది వారి షెడ్యూలయితే వెళ్లిన ప్రతిచోటు చారిత్రిక నేపథ్యంతో పాటు గోపిగారి కవితావేశం కూడా వెల్లువై మన ముంగిట వాలుతుంది.

హేంబర్గ్ నగరం ధ్వంసమయిన ప్రతిసారీ ఫీనిక్స్ పక్షిలా రెక్కలు విప్పుకుని పైకిలేచిందంటారు గోపి.

హేంబర్గ్ నగరంలో అడుగుపెట్టగానే "నేను తలకు చుట్టుకొచ్చిన ఇండియా మబ్బులు/ ఇక్కడి మేఘాలతో సంభాషిస్తున్నాయి" అంటారు.

హేంబర్గ్‌లో అంబరాన్నంటిన కవిత్వం శీర్షికలో హేంబర్గ్ యూనివర్సిటీ ముప్పై వేలమంది విద్యార్థులతో కలకలలాడుతుందంటే నమ్మగలమా. ఎల్బా నది ఒడ్డునున్న నగరం హేంబర్గ్. ఎల్బానది పై రాసిన కవితలో ఇలా అంటారు గోపి... "అలల కదలిక అదే లయల మెలికలు వేరు/ ఈ బ్రిడ్జ్ కింద అలలు రహస్యంగా ప్రేమించుకుంటున్నాయి/ అలలు ఎప్పటికప్పుడు కొత్తవి మనుషులూ అంతే/ కానీ కాలగమనం





మాత్రం సనాతనం"

తరువాత ప్రయాణంలో హ్యాలే-విట్టన్ బర్గ్ జంటనగరాలను దర్శించారు. అక్కడ మార్టిన్ లూథర్ యూనివర్సిటీలో వారి కవితా పఠనం సాగింది. షేక్స్పియర్ హేమ్లెట్ నాటకంలోని డెన్మార్క్ యువరాజు ఈ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడని చెబుతాడు అంటారు గోపి. ఈ యూనివర్సిటీ ఔన్నత్యాన్ని చెబుతూ జర్మనీ భాషకు పితామహుడంటారుట మార్టిన్ లూథర్ కింగ్ ని... రెండవ ప్రపంచ యుద్ధంలో అన్ని నగరాలపై దాడులు జరిగాయి కానీ హ్యాలే నగరంపై జరగలేదుట. 'హ్యాలే నగరం' అన్న కవితలో ఇలా అంటారు గోపి "చెక్కు చెదరని వందల సంవత్సర భవనాలు/ చరిత్ర పూలదండలో పరిమళించే మరువం దవనాలు"

అక్కడి నుంచి గోపిగారి బృందం జర్మనీ రాజధాని బెర్లిన్ కి పయనమయింది. బెర్లిన్ గురించి చెబుతూ ఇక్కడ 45 లక్షల మంది జనాభాలో 180 దేశాలవారున్నారు. నగరంలో మూడో వంతు పార్కులు, అడవులు, ఉద్యానవనాలు, నదులు చెరువులే అంటారు. అంతేకాకుండా 153 మ్యూజియంలు, అత్యధికంగా న్యూస్ పేపర్లు ప్రచురింపబడే నగరం బెర్లిన్ అంటే ఆశ్చర్యమేస్తుంది. నలభై ఐదులక్షల జనాభాకు 20 లక్షల కార్లున్న ఈ నగరంలో ట్రాఫిక్ జాంలే ఉండవంటారు వారు. ఇక బెర్లిన్ రెండవ ప్రపంచ యుద్ధ కేంద్ర బిందువు. ఆ యుద్ధ కుటిలతను కుయుక్తులను ఉటంకిస్తూ నియంత హిట్లర్ చివరిరోజుల బంకర్‌ను విషాదంగా చూస్తారు. ఎన్నో లక్షల ప్రాణాలను హరించిన ఉన్మాది ఏం సాధించాడని అంటూ.. యుద్ధానంతరం మొలిచిన 'బెర్లిన్ గోడ'పై వారినుంచి కవిత అప్రయత్నంగా వెలువడుతుంది "బెర్లిన్ గోడ అందంగా ఉండదు/ నిజానికి గోడలేవీ అందంగా ఉండవు/ యుద్ధ పిపాసులు మానవత్వాన్ని చీల్చి గీసిన నెత్తుటిరేఖ/ ఎన్నింటికో సాక్షి ఈగోడ"

ఆ చేదు స్మృతులను హృద్యంగా మలిచారు. బెర్లిన్‌లో టాగోర్ పరిశోధనకేంద్రం, ఇండియన్ ఎంబసీ సంయుక్తంగా వీరి కవితాగోష్ఠిని నిర్వహించాయని చెబుతూ అక్కడ చదివిన నానీలు, నానీల గురించి చేసిన ప్రసంగానికి ఊహించని స్పందన లభించింది అంటారు గోపి..

ఈ కవుల సమూహం చివరిగా హైడెల్ బర్గ్ నగరంలోని South Asia Institute లో తమ కవితా పఠనంతో వీరి పర్యటన ముగిసింది. హైడెల్ బర్గ్ నగరంలో ముప్ఫైవేల మంది ఆసియా విద్యార్థులున్నారుట. నగరమంతా సైకిళ్ళ వాడకమెక్కువట. ఇక్కడి వారికి హిందీ కవులైన ఫైజ్ అహ్మద్ ఫైజ్, నిరాలా, మహదేవివర్మ నజ్రుల్ ఇస్లాం వంటివారు సుపరిచితులంటారు.

ఆరు రోజుల పాటు సాగిన ఈ జర్మనీ కవితా యాత్రలో మనమూ ఓ భాగమైపోతాం..

వారితో తిరిగొచ్చిన అనుభూతిని పొందుతాం. బహుశా యాత్రా సాహిత్యం గొప్పదనమేఅది.. వేర్వేరు భాషల వారమైనా కవిత్వం మమ్మల్ని కలిపేసిందంటారు. ఈ ప్రయాణంలో వారికి తోడ్పడిన టాగోర్ పరిశోధనాకేంద్రం డైరెక్టర్ శివప్రకాశ్ ఇంకా ఇతర ఆచార్యులను ఆర్ద్రంగా తలుచుకుంటారు గోపి..

పశ్చిమ దేశాలనుంచి మనం నేర్చుకోవాల్సిన అంశాలలో క్రమశిక్షణ, పరిశుభ్రత వంటివి ముఖ్యమైనవి అన్నమాటలు అక్షర సత్యాలు...

జర్మనీలో కవితాయాత్ర చల్లగ వీచే గాలి తెమ్మెరలా చాలాకాలం మనల్ని పరిమళమై అల్లుకుంటుంది. చదవటం మొదలుపెట్టాక చివరిపేజీ వరకూ పుస్తకాన్ని మూయలేం. చదివాక కళ్ళు మూసుకుంటే జర్మనీ కమ్మని జ్ఞాపకమై వెంటాడుతుంది.

– సి.యస్ రాంబాబు, 9490401005

ఎలుకల మందు

పాతిక వరికంకులైనా సరే
పిడికెడు బియ్యమైనా సరే జాతీయ సంపదే!
గుప్పెడు బియ్యపు గింజలకు పసుపు కలిపి
పాతిక జంటలకు తలంబ్రాలు పొయ్యొచ్చు
ఇండియాగేటు ముందు వంద పక్షులకు ఆహారంగా
వెయ్యొచ్చు
చార్మినార్ ముందు చల్లి జీవకారుణ్యాన్ని
ప్రకటించుకోవచ్చు



ఆకలి
దేహమిచ్చిన వరమనుకుని ఆరోమాటిక్ బియ్యం
తినేవాళ్లకు
ఏ అస్మితల అలికిడీ వినిపించకూడదు
ఏ అస్థి పంజరాలూ క్షుద్బాధతో తూలిపడకూడదు
పంటమీద గింజలు ముదిరినా సరే
పండించిన రైతు ప్రాణాలు వదిలేసినా సరే
ఏ సజీవ ఆజీవ ప్రాణులైనా సరే
వరికంకులను కొరికి వర్షాకాలపు బొరియల్లో
దాచుకోడానికి వీల్లేదు
వడ్ల గోదాముల్లో దండెత్తిన ధాన్యలక్ష్మిని ముట్టుకోడానికి వీల్లేదు

పాలకులిచ్చిన ఉచ్చులను బిగించండి
పంచిన విషపు బిళ్ళలను చేల కన్నాలలో వేయండి
'ఇర్ల వాళ్ళ'ను పిలిచి బొరియల్లో ఊదర పెట్టించండి
ఊపిరాడకుండా బయటకు రప్పిచ్చి బొందబెట్టండి
సర్కారు విషమిచ్చినా సరే తాగించి తీరండి

ఎలుకల్నయినాసరే
ఆకలేసి బియ్యం దొంగిలించే ఆదివాసీలనైనా సరే
ఇలానే కొట్టి కొట్టి చంపండి
దేశ సంపదను కాపాడుకోండి

(కిలో బియ్యం దొంగతనం చేసినందుకుగాను కొందరి చేతుల్లో ప్రాణాలు కోల్పోయిన ఆదివాసీ మధు కోసం)

– తుల్లిమల్లి విల్సన్ సుధాకర్, 9538053030

సాహిత్యవార్తలు

రెండు దశాబ్దాల తెలంగాణా సాహిత్యం - సమాలోచన

'రెండు దశాబ్దాల తెలంగాణ సాహిత్యం – సమాలోచన' పేరుతో రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సు ఈ నెల 6,7 తేదీల్లో గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాలలో జరుగుతుంది.

కవయిత్రుల కవిత్వ విశ్లేషణ

ధ్వని కవిత్వ లయ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాహిత్య సమాఖ్య అధ్వర్యంలో అఫ్జల్ గంజ్ లో స్టేట్ సెంట్రల్ లైబ్రరీ, హెరిటేజ్ బిల్డింగ్ మార్చి11వ తేది ఉదయం 10.30 గంటలకు 'ధ్వని' (కవిత్వలయ) ప్రత్యేక కవయిత్రుల కవిత్వ విశ్లేషణ కార్యక్రమం జరుగుతుంది. ఇందులో శిలాలోలిత, మెర్సీమార్గరేట్, నారదభట్ల అరుణ, తమ కవితలు వినిపిస్తారు. కె. విమల కవిత్వ విశ్లేషణా ప్రసంగం చేస్తారు. ఆత్మీయ అతిథిగా డా॥కొండవీటి నాగవాణి, అధ్యక్షత: దేవనపల్లి వీణావాణి సమావేశకర్తగా సరోజ వింజామర పాల్గొంటారు.

– ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

కవి సంధ్య – పానుగంటి కవితల పోటీ ఫలితాలు

ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవిసంధ్య, కవిత్వ పత్రిక పానుగంటి ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కవితల పోటీలో మొదటి బహుమతి గాడ్స్ డెత్ సర్టిఫికేట్ (ర్యాలి శ్రీనివాస్ – రామచంద్రాపురం), రెండవ బహుమతి ఇంటి పాదాల వద్ద (పి.అశోక్‌కుమార్ – యానాం), మూడో బహుమతి నల్ల కుందేలు (బండారి రాజ్ కుమార్ – వరంగల్) కి వచ్చాయి. ఈ బహుమతులను యానాంలో మార్చి 21వ తేదీన జరిగే ప్రపంచ కవితా దినోత్సవం రోజున ప్రదానం చేస్తారు.

ద్వానా సప్తతి స్ఫూర్తి పురస్కారం

ద్వా.నా. శాస్త్రి సప్తతి పూర్తి సందర్భంగా 'సాహిత్య విమర్శ' గ్రంథానికి ద్వానా సప్తతి స్ఫూర్తి పురస్కారం ఇవ్వబడుతుంది. ఏ ప్రక్రియా విమర్శకి సంబంధించినదైనా 2016, 2017, 2018 సంవత్సరాలలో అచ్చయినవి, కనీసం రెండు వందల పుటలకు తక్కువ కాని గ్రంథాలు రెండు ప్రతులు ఏప్రిల్ 2018 లోపు పంపాలి. మొదటి బహుమతి పది వేలు, రెండో బహుమతి ఐదు వేల రూపాయలు. రచనలు పంపాల్సిన చిరునామా డి.శశికాంత్, 1-1-428, ఫ్లాట్ 101, ఆర్చిడ్ నెస్ట్, గాంధీనగర్, హైదరాబాద్ – 500080.

– డి.శశికాంత్, ద్వానా సాహితీ కుటీరం


రచనలకు ఆహ్వానం

అనంతుడు ఫౌండేషన్ విస్తృత సాహిత్య కార్యక్రమాల్లో భాగంగా విళంబి ఉగాది ప్రతేక సంచిక వెలువరిస్తోంది. ఈ సంచికకు ఔత్సాహిక కథకులు, కవులు, వ్యాస కర్తల నుంచి తెలంగాణ నగర, పల్లె జీవన సాంస్కృతికతను, భాషను ప్రతిబింబించే కథలను, కవిత్వాన్ని, వ్యాసాలను ఆహ్వానిస్తోంది. రచనల్ని mothkurus@gmail.com కు మార్చ్ 8లోగా మెయిల్ చేయాలి. చిరునామా : అనంతుడు ఫౌండేషన్, ఇం.నెం.3-83, కొండ గడప (గ్రామం), మోత్కూరు (మండలం), యాదాద్రి భువనగిరి జిల్లా – 508277.

వినూత్నమైన కథా కథనాలు

తను, తన కుటుంబం – కుటుంబ జీవితానికి సంబంధించినవే కాకుండా తన అనుభవాలను, జ్ఞాపకాలను యథాతథంగా అక్షరీకరించి 'చింతకింది మల్లయ్య ముచ్చట్లు' పేరుతో పుస్తకంగా తీసుకువచ్చారు.

ఇవన్నీ స్వీయ కథనాలు. అందునా ఆత్మకథాత్మకాలు కాబట్టి ఈ కథలన్నింటిలోనూ వున్న రచయిత ఆలోచనాధార చైతన్య స్రవంతిని జ్ఞాపకం తెస్తుంది. అవిచ్ఛిన్నమైన అన్‌సెన్సార్డ్ ఆలోచనాధార చైతన్య స్రవంతి అని చెప్పబడుతుంది. ఇందులో వున్న 'మంట' అనే కథ ఒక్కటే పూర్తి చైతన్య స్రవంతి ధోరణిలో వచ్చింది. కొన్నింటిలో పాక్షిక చైతన్య స్రవంతి ధోరణి, మరి కొన్నింటిలో చైతన్య స్రవంతి ఛాయలు కనిపిస్తాయి. అన్ సెన్సార్డ్‌గా వచ్చే చైతన్య స్రవంతి ధోరణిలో కనిపించే కాముకత్వం, లైంగిక ప్రకోపం, అశ్లీలాలు మర్యాదస్తులకు కొరుకుడు పడడం కష్టమే. చైతన్య స్రవంతి వల్ల వచ్చే ప్రమాదమేమిటంటే, రచయిత తనకు తెలియకుండానే తాను బహిర్గతమవుతాడు. తాను, తన ఇష్టాయిష్టాలు, న్యూతనలు – అసంతృప్తులు, తన జీవితం, తన కుటుంబ జీవితాన్ని కూడా బజార్న పెట్టే అవకాశముంది. అందుకే




చాలామంది రచయితలు దాని జోలికి పోలేదు. దాన్ని డీల్ చేసే సత్తా కూడా చాలామందిలో లేకపోవడం కూడా ఒక కారణమే. ఒక విస్తృతి అధ్యయనశీలి, ఒక తాత్త్వికుడు, ఒక అసంతృప్త జీవి అంతరంగ మధనమే అనేకానేక విషయాల్ని పాఠకులతో పంచుకుంటుంది. అందులో భాష మరీ ప్రధానం. చైతన్య స్రవంతి పద్ధతిలో భాషతో చెడుగుడు ఆడుకోవచ్చు. శ్రీశ్రీ నుండి లెనిన్ ధనిశెట్టి వరకు అలాగే సక్సెస్ అయ్యారు. ఈ కోవలో వచ్చిన మరో వినూత్న శైలి పూడూరి రాజిరెడ్డిది. మౌఖిక కథనరీతికి దగ్గరగా వుండి రచయిత మనతో ముచ్చటిస్తున్నట్లే వుంటుంది. కొన్నిసార్లు ఆ రచయిత మనమే అన్నట్లుగా, ఆ అనుభవాలు మనవే అన్నట్లుగా భ్రమింపజేస్తుంది. కథ ప్రారంభమే మన చేతుల్లో వుంటుంది. ఒకసారి ప్రారంభించామా ఆటోమేటిగ్గా చివరివాక్యం వరకు ఆ అద్భుత శైలీ ప్రవాహంలో కొట్టుకుపోక తప్పదు. ఆ ద్రవరూప శైలి ఎంతటి గొప్ప పఠనీయతని సాధించి పెట్టిందో తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. యు.ఎ.నరసింహమూర్తి అనే విమర్శకుడు 'తెలుగు వచనశైలి' పేరిట వచనాన్ని అద్భుతంగా రాసే వారి పరిచాయాన్ని, వారి వచనశైలి గొప్పదనాన్ని వివరిస్తూ ఒక బృహద్గ్రంథమే రాశారు. ఒకవేళ వారు బతికివుంటే తప్పకుండా పూడూరి రాజిరెడ్డికి ఒక అధ్యాయమే కేటాయించేవారు.

మనం ఊహించినట్టుగా మన జీవితం ఉండదనీ, మనం కోరుకున్నట్లుగా మన జీవితం కొనసాగదని తెలిసినప్పుడు, వాటిని ఇతరుల జీవితాలలో చూడడం అనవసరమని 'చింతకింది మల్లయ్యతో ముచ్చట' పెడితే తెలుస్తుంది. అబ్సర్డ్ కథాకథనానికి 'రెండడుగుల నేల' గురించి చెప్పుకోవాలి. ఇందులో కొన్ని కథలు స్కెచ్‌ల లాగా లేదా డాక్యుమెంటరీ కథనాలుగా వున్నాయనే మాట వినపడింది. అది నిజం కాదు. లాటిన్ అమెరికన్ కథకుడు 'బోర్గెస్' పద్ధతి అది. ఇది శిల్పపరంగా కొనసాగే వినూత్న ప్రక్రియ. ఈ టెక్నిక్ గురించి తెలియనివారు ఇది కథ కాదు, స్కెచ్ అని పొరపడే ప్రమాదముంది. ఇవి కథలు అయినా కాకపోయినా, నచ్చినా నచ్చకపోయినా, ఒక అద్భుతమైన రచనాశైలి ఈ పుస్తకం నిండా కమ్ముకుని వుంది. అది మనసు చివరిదాకా లాక్కెళ్ళి ఆసక్తిగా చదివింపజేస్తుంది. అదే ఈ పుస్తకం ప్రత్యేకత.

చింతకింది మల్లయ్య ముచ్చట్లు (ఇతర కథలు), పూడూరి రాజిరెడ్డి, పేజీలు : 154, వెల : 144, ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు.

– కె.పి.అశోక్‌కుమార్, 9700000948



మహిళా దినోత్సవం అనగానే.. 'మహిళా సాధికారత' 'ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం' వంటి పెద్ద పెద్ద మాటలు వినిపిస్తాయి. ఈ నేల మీద సగమై ఉన్నాం.. కానీ నిజంగా అవకాశాల్లో సగ భాగం పంచుకున్నామా? ఇన్నేండ్ల స్వతంత్ర భారతావనిలో ఉన్న మహిళలు ఎంతమంది? ఉద్యోగాల్లో ఉన్న వాటా ఎంత? ఇంటా, బయటా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉద్యోగాల్లోకి వస్తున్న మహిళకు ఇస్తున్న గౌరవం ఎంత? ఏండ్లకేండ్లుగా ఇవన్నీ సమాధానం లేని ప్రశ్నలు. ఎంత ముందడుగు వేస్తున్నా... అడుగడుగునా అవమానాలు, అణచివేతలు, వేధింపులు. ఎన్నయినా ఎదురవ్వనీ... మహిళలు పరస్పర సహకారం అందించుకుంటూ ముందడుగు వేయాలని, మహిళా దినోత్సవం జరుపుకోవాల్సిన అవసరం లేని రోజు రావాలని ఆకాంక్షిస్తున్నారీ వర్కింగ్ ఉమెన్.

ఒకరోజంటూ అవసరంలేని రోజు రావాలి...



పరస్పర సహకారం అవసరం...

మహిళా దినోత్సవం జరుపుకోవడం మంచిదే. జరుపుకోవాల్సిన అవసరం లేని రోజు వస్తే ఇంకా బాగుంటుంది. అప్పుడే నిజంగా ప్రతి విషయంలో మహిళలు సమానంగా ఉన్నట్టు లెక్క. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు మహిళల్లో చాలా మార్పు వచ్చింది. అన్ని రంగాల్లో పురుషుల కంటే ఎక్కువగా పనిచేస్తున్నారు. వృత్తి, వ్యక్తిగత బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతున్నారు. అయినా గుర్తింపు రావడం లేదు. ఇంకా వెనుకబడి ఉన్నాం చాలా రంగాల్లో. దీనినుంచి బయటపడాలి. విద్యావంతులైన మహిళలు... తమ ఉద్యోగమో, వ్యాపారానికో మాత్రమే పరిమితమవ్వకూడదు. వెనుకబడిన బాలికలకు, మహిళలకు అవగాహన కల్పిస్తే బాగుంటుంది. అయితే మగవాళ్ల ఆలోచన ధోరణి మారనంత వరకు మహిళలు ఏ స్థాయిలో ఉన్నా ఇబ్బందులు పడుతున్నాం. పడుతూనే ఉంటాం. అందుకోసం కొత్త కొత్త చట్టాలు వచ్చాయి. మహిళా సంఘాలు కూడా చాలా యాక్టివ్‌గా పనిచేస్తున్నాయి. దీనివల్ల ఏదైనా జరిగినప్పుడు చెప్పడానికి ముందుకొస్తున్నారు మహిళలు. చట్టాలపైన అవగాహన కల్పించుకుంటే... ఎక్కడైనా, ఏ స్థాయిలోనైనా పనిచేయగలుగుతాం అని నా విశ్వాసం. నా పరిధిలో చూస్తే... బాలికల విద్య చాలా పెరిగింది. ఆడపిల్లలను చదివించాలన్న చైతన్యం తల్లిదండ్రుల్లో పెరిగింది. డ్రాపవుట్స్ లేకుండా చూసే ప్రయత్నం చేస్తున్నాం. మహిళలు వ్యక్తిగా మాత్రమే కాకుండా... సమాజానికి, మహిళలకు, బాలికలకు సహకారం అందించగలిగే స్థాయిలో ఉండాలి. అట్లా చేస్తే రాబోయే తరం అంతా మనదే!

- టి. అరుణశ్రీ, సెక్టోరల్ ఆఫీసర్, నల్గొండ జిల్లా

బరువు తగ్గే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయి..!



ఆర్తీ అగర్వాల్ (మార్చి 5, 1984 - జూన్ 6, 2015)

Women of the day

మోడలింగ్‌రంగం నుంచి చిత్రపరిశ్రమలు వచ్చిన ఆర్తి అగర్వాల్ తెలుగులోని అగ్రహీరోలందరి సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. తెలుగు, హిందీ, తమిళం చిత్రాల్లో నటించి అలరించింది. కొన్ని సంవత్సరాల వ్యవధిలోనే 50కి పైగా సినిమాల్లో నటించి అగ్రతారల జాబితాలో చేరారు. ఆత్మహత్యాప్రయత్నంలో, యాక్సిడెంట్‌లో ప్రాణాలతో బయటపడినా.. లైపోసెక్షన్ ఆపరేషన్ వికటించడంతో మృతిచెందిన సినీతార ఆర్తి అగర్వాల్.

అమెరికాలో స్థిర పడిన గుజరాతీ కుటుంబంలో ఆర్తి జన్మించారు. ఆమె తండ్రి కౌశిక్ అగర్వాల్ అమెరికాలో స్థిరపడిన బిజినెస్‌మాన్. ఆమె తల్లి వీమా అగర్వాల్. న్యూజెర్సీలో పుట్టి పెరిగిన ఆమెకు డాన్స్ చాలా ఇష్టం. 14ఏండ్ల వయసులో మోడలింగ్‌రంగంలో అడుగుపెట్టారు. ఫిలడెల్ఫియాలోని ఓ స్టేజ్ షోలో డాన్స్ చేయడానికి హీరో సునీల్‌శెట్టి ఆమెను ఆహ్వానించారు. ఆ కార్యక్రమానికి బిగ్ బీ అమితాబ్ బచ్చన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్తీ డాన్స్ చూసి ఫిదా అయిన బిగ్ బీ ప్రోత్సహంతో ముంబాయ్‌కి వచ్చి యాక్టింగ్ స్కూలులో చేరారు. 2001వ సంవత్సరంలో బాలీవుడ్‌లో పాగల్‌పాన్ సినిమాలో అవకాశం ఇప్పించారు. ఈ సినిమాలో ఆర్తీ అద్భుతంగా నటించి, అందరి మెప్పు పొందింది. ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు నిర్మించిన 'నువ్వు నాకు నచ్చావ్' చిత్రంలో ద్వారా తెలుగు సినీరంగానికి కథానాయికగా పరిచయమయ్యారు. వెంకటేష్‌హీరోగా నటించిన ఈ సినిమా ఘన విజయం సాధించడంతో తెలుగులో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేష్, బాలక ష్ణ, నాగార్జున, యువ కథానాయకులైన మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్, రవితేజ,ఉదయ్ కిరణ్, తరుణ్‌లతోనూ నటించారు. చిరంజీవితో ఆమె నటించిన 'ఇంద్ర' చిత్రం ఆర్తిని అగ్రతారగా నిలబెట్టింది. తెలుగులో సుమారు 50కి పైగా సినిమాల్లో నటించింది.

తమిళంలోనూ తెరంగ్రేటం చేసి 'బంబ్రా కన్నాలై' చిత్రంతో నటించారు. టాప్ హీరోయిన్‌గా కొనసాగుతున్న సమయంలోనే ఆర్తి ఆత్మహత్యా ప్రయత్నం చేసి ప్రాణాలతో బయటపడ్డారు. మరోఏడాది తర్వాత అనుమానాస్పద పరిస్థితుల్లో మెట్లపై నుండి జారిపడి ఆర్తి ఆసుపత్రి పాలై.. కొద్దినెలల చికిత్స తర్వాత పూర్తిగా కోలుకున్నారు.

న్యూజెర్సీకి చెందిన గుజరాతీ ప్రవాస భారతీయుడు ఉజ్వల్ నికమ్‌తో ఆర్తికి పెండ్లి.. కొద్దినెలలకు వారు విడాకులు తీసుకోవడం వెంటవెంటనే జరిగిపోతాయి. ఆర్తి చెల్లెలు అదితి హీరోయిన్‌గా అల్లు అర్జున్ హీరోగా నటించిన గంగోత్రి సినిమా వచ్చింది. కొన్నేండ్లు విరామం తీసుకున్న తర్వాత తిరిగి ఆమె వెండితెరకు వచ్చారు. అదే సమయంలో 'జంక్షన్ లో జయమాలిని', 'ఆమె ఎవరు ?' సినిమాలు అంగీకరించారు. ఆర్తీ నటించిన 'రణం 2' విడుదల కాగా...'ఆపరేషన్ గ్రీన్ హంట్' విడుదలకు సిద్ధమైంది.

స్థూలకాయం, శ్వాసకోస సమస్యలతో బాధపడుతున్న ఆర్తీ చికిత్సకోసం అమెరికా వెళ్లి అక్కడే చికిత్స తీసుకున్నారు. అమెరికాలోని అట్లాంటిక్ సిటీలో లైపోసక్షన్ సర్జరీ చేయించుకున్నారు. అయితే చికిత్స వికటించి...గుండెపోటు వచ్చి చనిపోయారు.

శ్రమదోపిడీ...



ఇరవై ఒకటవ శత్బాం మొదట్లోనే మరమనిషి శస్త్ర చికిత్స చేయడం చూస్తున్నాం. ధన్వంతరిని పూజిస్తాం. కానీ పురాణ కాలం నుచి నేటి రోబోటిక్ సర్జరీస్ పరిణామం వరకు ఎక్కడా మహిళల ప్రస్తావన లేకపోవం విచారించదగ్గర విషయం. ఆది మానవుల కాలం నుంచి నిన్నమొన్నటివరకు దాయిని(మంత్రసాను)లే కదా పురుడుపోస్తూ వచ్చారు. మరి చరిత్రలో ఎక్కడా వారి గొప్పతనం రికార్డు అవ్వలేదు. చిన్న ఉదాహరణ మాత్రమే చెబుతాను.. నిజాం కాలంలో స్థాపించబడ్డ ఉస్మానియా వైద్య కళాశాలలో అనస్థీషియా ప్రక్రియను మొట్టమొదట ఒక మహిళా వైద్యురాలు ప్రారంభించింది. ఇది ఎక్కడా సరిగ్గా డాక్యుమెంట్ అవ్వలేదు. ఇదే సిటీలో ఎనభై పదులు దాటిన స్త్రీ వైద్య నిపుణులు ఎందరో ఉన్నారు. కానీ నిర్విరామ సేవలు ఎవ్వరూ ఇంతవరకు గుర్తించలేదు. అత్యవసర వైద్య సేవా విభాగంలో పనిచేస్తున్న చాలా సీనియర్ మహిళా ప్రొఫెసర్స్‌కి ఎలాంటి గుర్తింపు లేదు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పనిచేస్తున్నా.. నైపుణ్యత, పేరు ప్రతిష్ట వరకు మహిళలను వెనక్కి నెట్టేస్తారు. అయినా స్త్రీ మనస్తత్వం ప్రకృతి తత్వం. ఇవ్వడమే కానీ ఆశించడం తెలియదు. ఈ అంతర్జాతీయ కార్మిక మహిళా దినోత్సవం సందర్భంగా ఏ రంగంలో ఉన్న మహిళ అయినా శ్రమదోపిడీకి గురికావద్దని కోరుకుంటున్నా.

- డాక్టర్ సంధ్య, సిఎఎస్, ఇఎస్ఐ

సంఘటితం కావాలి..



1909లో అమెరికాలోని న్యూయార్క్ పట్టణంలో సోషలిస్ట్ పార్టీవాళ్ల 'థెరిస్సామల్కిమల్' సలహా మేరకు స్త్రీలు తమ హక్కులు సాధించే నిమిత్తం ప్రతి ఏడాది మార్చి 8న అంతర్జాతీయంగా మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 109ఏండ్ల నుంచి మహిళాదినోత్సవ సంబురాలు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నా.. సమాజంలో ఏ మార్పు రాలేదు. నా ఆవేదనను అక్షరాలలో..

సబలా! ఓ సబలా!
నీవు అబలవు కాదు సబలవు అని నిరూపిస్తున్నావు
ఏ రంగంలో అయినా నీ మేధస్సును ఉపయోగిస్తున్నావు
కుటుంబంలో ఆదర్శగృహిణిలా
ధైర్యంలో రాణి రుద్రమలా
ఆపదలో ఆడపులిగా
విశ్వాంతరాలలో నీ పేరు మారుమ్రోగుతుంటే
అది విని నీ మనస్సు ఉర్రూతలూగుతుంటే
ఈ సమాజం మీకు ఏ పీఠం వేసిందమ్మా?
అది పైకి కనబడకున్న నీ మనస్సు రగులుతుంది కదమ్మా
ఇంకా స్త్రీ గొప్పతనాన్ని ఒప్పుకోని పురుషపుంగవులు
ఈ సమాజాన్ని పీడిస్తున్న ఎందరో నరరూపరాక్షసులు
ఎందుకోగాని స్త్రీలు తమ హక్కులు సాధించడానికి
ఇవ్వడం లేదు సమాజం సహకారాన్ని
ఎంత ఎత్తుకు ఎదిగినా ఇంకా తొక్కి పెట్టే ప్రయత్నమే
మహిళలు సంఘటితం కావాలి..
మగవారి అరాచకాలను ఆపాలి..
తమ హక్కులు సాధించాలి..
దేశప్రగతిని నిలపాలి.

- వంగ అనురాధ, తెలుగు భాషోపాధ్యాయిని, కాకతీయ హైస్కూల్, వారాసిగూడ, హైదారాబాద్.

వేచి చూస్తుంటారు...



ఉమెన్స్‌డే అనగానే ఉద్యోగస్తులకు ఒక దేను కేటాయించి... వాళ్లకు ఆటపాటలో, ఇతర పోటీలో నిర్వహించడం కాదు. దాని వెనుక ఉన్న చరిత్రను, ఉద్దేశాన్ని సామాన్య జనాల్లోకి తీసుకెళ్లగలగాలి. మహిళలకోసం చేసే ఏ పైనా క్షేత్రస్థాయిలో, గ్రామాల్లో ఉన్న మహిళలు చేరేలా ఉండాలి. 'మన సమస్యలు మాట్లాడుకోవచ్చు. అందరం కలిసి చర్చించుకోవచ్చు. మా రక్షణ కోసం పలానా చట్టాలున్నాయి' అని విద్యావంతులైన మహిళల నుంచి సాధారణ స్త్రీ వరకు తెలియాలి. ఈ ఒక్కరోజు మాత్రమే కాదు... ప్రతిరోజూ స్త్రీకి గౌరవం దక్కాలి. ఆ గౌరవించే స్థాయిని పురుషులు అలవరుచుకోవాలి. నిజానికి వివక్ష అన్నిచోట్లా ఉంది. కాకపోతే అన్నిసార్లు బయటికి చెప్పుకోలేము. బాగా పనిచేసి మంచి పేరొచ్చినా కష్టమే. 'ఆమె ఒక్కతే చేస్తుందా? మేం చెడ్డవాళ్లమా?' అని అవమానపరచడం చేస్తుంటారు. మహిళా ఉద్యోగి అయితే 'ఎక్కడ చిన్న తప్పు దొరుకుతుందా?' అని వేచి చూస్తుంటారు. ఉన్నతాధికారుల దగ్గర పెట్టాలనే ఆలోచనతో ఉంటారు. ఆకాశంలో సగం... అవకాశాల్లో సగం అని చెబుతుంటాం. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటాయి. అవకాశం వచ్చినప్పుడు అందిపుచ్చుకోవాలనుకున్నా అందుకు అనుకూల పరిస్థితులు ఉండవు. అందుకే మా హాస్టల్‌లో పిల్లలు 'మీరు అనుకున్నది సాధించాలి. ఎవ్వరికీ భయపడకూడదు. మీరు చేసేదే సరైనది అనుకుంటే ధైర్యంగా చేసుకుంటూ వెళ్లిపోవాలి. ఇండిపెండెంట్‌గా ఎదగాలి' అని చెబుతుంటా.

- పి. జ్యోతి, కేర్‌టేకర్, కాలేజీ గాల్స్ బీసీ హాస్టల్ - ఎ, నల్గొండ

చేయి మీద పడిందో..!

కొన్ని సంఘటనలను చూసినప్పుడు మహిళలను గౌరవించే సమాజం రూపుదిద్దుకోవాలంటే ఎన్ని పోరాటాలు చేయాలో అనిపిస్తుంది. బస్సుల్లో, రోడ్లపై, ఆఫీస్‌ల్లో మహిళలను తాకాలని ప్రయత్నించేవారు నిత్యం తారసపడుతూనే ఉంటారు. వీరందరికీ బుద్ధి చెప్పాలని మనసులో ఉన్నా గొడవ ఎందుకని సర్దుకుపోతుంటారు చాలామంది మహిళలు. సర్దుకుపోయేకొద్ది మగవారి ఆగడాలు పెరిగిపెరిగి చివరికి అఘాయిత్యాలుగా మారుతాయి. వీటిని అరకట్టాలంటే మొదట్లోనే తగిన బుద్ధి చెప్పాలి. అమ్మాయిల మీద చేయి వేయాలన్నా.. తాకాలన్నా భయపడాలి. మరి ఇలాంటి వారికి ఎలా బుద్ధి చెప్పాలో ఈ వారం తెలుసుకుందాం..!



రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న అమ్మాయిని వెనక వెనక నడుసూ ఒక వ్యక్తి వెంబడిస్తున్నాడు. సమీపంలో ఎవరూ లేని చోట ఆ అమ్మాయి చేయిని పట్టుకునే ప్రయత్నం చేశాడు.



వెంటనే ఆ అపరిచిత వ్యక్తి చేయి తన చేయిని పట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నం ఆమె గమనించింది. ఒకసారి చుట్టూ చూసింది. తాను ఒంటరిగా ఉన్నానని అర్థమైంది. ఆ వ్యక్తి తనపై దాడి చేయడానికే వచ్చాడన్న విషయం స్పష్టమైంది. వెనుదిరిగి అతడి చేయిని తన ఎడమ చేతితో లాక్ చేసింది.



తన చేయిని గట్టిగా లాగే ప్రయత్నం చేస్తాడు. విడిపించుకునే అవకాశం ఇవ్వకుండా కుడిచేతిని చాచి.. అతని గొంతుకపై గట్టిగా నొక్కాలి.



బాధతో విలవిల లాడుతూ తన చేయిని గట్టిగా లాగే ప్రయత్నం చేస్తాడు. కుడిచేతిలో అతని కడుపులో ఒక పంచ్ ఇవ్వాలి. ఇంకోసారి ఏ అమ్మాయి మీద చేయి వేయాలన్న ఆలోచన వచ్చినా.. భయపడేలా పంచ్ ఉండాలి.

అమ్మాయిలు..! ఇంట్లో పనులు, చదువు, ఉద్యోగం, ఆఫీస్ పనులతో ఎంత బిజీగా ఉన్నా.. రోజూ అరగంట మీకోసం కేటాయించు కోండి. ఫిజికల్ ఫిట్‌నెస్ ఉన్నప్పుడే మీరు ధైర్యంగా ఎవరినైనా ఎదిరించగలుగుతారు. ఆల్ ది బెస్ట్!



ఎన్. లక్ష్మీ రవి,
ఇంటర్నేషనల్ గోల్డ్ మెడలిస్ట్,
రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్,
గాంధీనగర్, హైదరాబాద్.
9490239170,
9949039049

ఫొటోలు: పిప్పళ్ల వెంకటేశ్

మేం చెప్పిందే జెఏసి చెప్పింది

- పిఎసి ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

హైదరాబాద్ : నాలుగేళ్లుగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తున్న అంశాలనే జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తేల్చిందని పిఎసి ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ప్రత్యేక హోదా రాష్ట్ర హక్కు అని జెఏసి చెప్పిందని, మొదటి నుంచి అదే విషయాన్ని వైసిపి డిమాండ్ చేస్తోందని అన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రం కట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం వద్దని తాము కూడా చెబుతున్నామని, అదే విషయాన్ని జెఏసి కూడా చెప్పిందన్నారు. రైల్వే జోన్, దుగ్గరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, విద్యా సంస్థలు రావాలని వైసిపి మొదటి నుంచి డిమాండ్ చేస్తోందన్నారు. ఎన్డీయే, టిడిపి ప్రభుత్వాల్లో పవన్ కల్యాణ్ భాగస్వామి అని, నాలుగేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల్లో ఆయనకీ భాగస్వామ్యం ఉందన్నారు. టిడిపి, బిజెపి భాగస్వామ్యం నుంచి బయట పడేందుకు పవన్ చేస్తున్న ప్రయత్నాలుగానే తాము భావిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుతానిదే తప్పు అన్నట్లుగా పవన్ చూపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గించి, బాధ్యతల నుంచి బయటపడేసేందుకు చేసిన ప్రయత్నంగా అనిపించిందన్నారు. కేంద్రానికి ఎంత భాద్యత ఉందో రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అంతే బాధ్యత ఉందన్నారు. అవిశ్వాస తీర్మానం అంశం విషయంలోనూ పవన్ తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈనెల 21న అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెడితే సమయం సరిపోదనేది వాస్తవం కాదన్నారు.

ప్రజారోగ్యంపై ఐక్య ఉద్యమం

కొండూరు : కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రతిఒక్కరూ మానవతా ధృక్పథంతో కృషిచేయాలని పలువురు పిలుపునిచ్చారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా ఎ.కొండూరు మండల కేంద్రంలోని మామిడి మార్కెట్ ప్రాంగణంలో 'ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధులు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై కృష్ణాప్రతినిధి ఎం.వి.ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం జరిగిన చర్చావేదికలో వారు మాట్లాడారు. ఐక్య ఉద్యమం నిర్వహించటం ద్వారా కిడ్నీ వ్యాధుల సమస్యలను పరిష్కరించుకోవచ్చునన్నారు. సిపిఎం పశ్చిమకృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ ఎ.కొండూరు మండలంలో 19, గంపలగూడెం మండలంలోని రెండు గ్రామాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వ్యాధుల నియంత్రణకు అవసరమైన వైద్యసదుపాయాలు ఎ.కొండూరులోనే ఏర్పాటుచేయాలని కోరారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ కృష్ణానది రక్షిత జలాలను తక్షణమే తండాల్లో సరఫరా చేయాలని కోరారు. ప్రొఫెసర్ జ్యోతిలాల్ నాయక్ మాట్లాడుతూ గిరిజనుల్లో ఉన్నత విద్యనభ్యసించే వారిలో ఒక్క శాతం మాత్రమే ఉన్నారన్నారు. ఎ.కొండూరు ఎంపిపి వాసం మునియ్య మాట్లాడుతూ తిరువూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నారు. ప్రజాశక్తి కృష్ణాజిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ వై.శ్రీనివాసరావు సమన్వయ కర్తగా వ్యవహరించారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, గిరిజన ఉద్యోగ సంఘం, ప్రజాసంఘాల నాయకులు, కిడ్నీ బాధితులు పాల్గొన్నారు.

అవసరం ఎంతో..మంజూరు కొంతే

- రాష్ట్రంలో ఉపాధి హామీకి డిమాండ్
- పట్టించుకోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- వలస పోతున్న పేదలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వామపక్షాల చొరవతో యూపీఏ-1 తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులకు రాష్ట్రంలో ఆదరణ ఎక్కువగా ఉంది. ఏండ్ల తరబడి కరువు ప్రాంతంగా ఉన్న రాష్ట్రానికి ఈ చట్టం ఏడారిలో ఓయాసీస్సులో మారింది. సీపీఐ(ఎం) చొరవ చేసి కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ప్రజలకు పథకం చేరేలా 2005లో గట్టికృషి జరిగింది. రాష్ట్రంలో కూలీలు ఉపాధి హామీ పనుల పట్ల సానుకూలంగానే ఉన్నారు. క్రమం తప్పకుండా పనులు చేసుకుంటున్నారు. వందరోజుల మేర పని చేసిన కుటుంబాలు సైతం ఉన్నాయి. ఇదిలావుండగా ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ చట్టం పనుల విషయంలో అటు కేంద్రంగానీ, ఇటు రాష్ట్రంగానీ పట్టించుకోవడం లేదు. నిర్లక్షం చేస్తున్నాయి. ఇందుకు పని దినాల మంజూరు సాక్ష్యంగా నిలుస్తున్నది. రాష్ట్రానికి కావాల్సిన పనిదినాలను ముందస్తు ప్రతిపాదనల ద్వారా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారుకు పంపినా, ఆశించిన మేర స్పందించడం లేదు. ప్రతిపాదనలకు కోతలు పెట్టడం మూలంగా కూలీలకు అన్యాయం చేస్తున్నది. గత నాలుగేండ్లుగా ఉపాధి హామీ చట్టం పరిధిలో జరిగిన పనుల లెక్కలను పరిశీలిస్తే ఇట్టే అర్థమవుతున్నది. కాగా ఈ సంగతిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదు. ఇదిలావుంటే ఉపాధి హామీ పనులను వ్యవసాయంతో అనుసంధానం చేయాలంటూ కొత్త ప్రతిపాదనను కేంద్రానికి పంపింది. ఈ చర్యను రాష్ట్రంలోని ప్రజాసంఘాలు తప్పుబట్టాయి. గ్రామీణాభివృద్ధి శాఖ అడిగిన పనిదినాల కన్నా, తక్కువగా మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని కూలీల పట్ల వివక్షను ప్రదర్శిస్తున్నది.

30 జిల్లాలు..52 లక్షల కార్డులు

ఉపాధి హామీ చట్టం కింద 30 జిల్లాల్లో పనులు జరుగుతున్నాయి. దాదాపు మూడు లక్షల శ్రమశక్తి సంఘాలు ఇందులో పాల్పంచుకుంటున్నాయి. దాదాపు 52 లక్షల కుటుంబాలు ఉపాధి హామీ చట్టం కింద జాబ్‌కార్డులను పొందాయి. ఏడాది పొడవునా పేదలకు పనులు కల్పించాలని చట్టం చెబుతున్నా అటు కేంద్రంలోని బీజేపీ, ఇటు రాష్ట్రంలోని టీఆర్ఎస్ ప్రభుత్వాలకు చెవికెక్కడం లేదు. ఈ నేపథ్యంలో ఇతర దేశాలు, రాష్ట్రాలు, నగరాలకు వలసపోయే దుస్థితి ఏర్పడింది.

కావాల్సింది 66.77 కోట్ల పనిదినాలు

రాష్ట్రంలోని నిరుపేద కూలీల అవసరాలను దృష్టిలో పెట్టుకుని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రతియేటా కేంద్ర ప్రభుత్వానికి ఉపాధి హామీ పని దినాలను పెంచాలని ప్రతిపాదనలు పంపుతున్నది. అయితే కేంద్రం నుంచి సానుకూలత వ్యక్తం కావడం లేదు. గత నాలుగేండ్లుగా రాష్ట్రం నుంచి వెళ్లిన ప్రతిపాదనలు, కేంద్రం మంజూరు చేసిన పనిదినాలను పరిశీలిస్తే ఈ సంగతి ఇట్టే అర్థమవుతున్నది. 66.77 కోట్ల పనిదినాలు అవసరమని ప్రతిపాదిస్తే, కేంద్రం మాత్రం 48.64 కోట్ల పనిదినాలను మాత్రమే మంజూరు చేసింది. దాదాపు 18.13 కోట్ల పనిదినాలను కేటాయించడానికి తిరస్కరించింది. ఈనేపథ్యంలో గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పదే పదే లేఖలు, నివేదికలు, విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదు. అంతేగాక పేదలకు చెందిన ఉపాధి హామీ చట్టం పట్ల వివక్షను ప్రదర్శిస్తున్నది.

మేట్ల తొలగింపు

ఉపాధి హామీ చట్టం అమల్లో మేట్లపాత్ర కీలకం. అంతేగాక ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎపీవో, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, మండల అభివృద్ధి అధికారులు సైతం సమన్వయంగా పనిచేయాల్సి ఉంటుంది. కాగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మెట్లను తొలగించడం ప్రారంభించింది. సర్క్యులర్ 1786ను జారీచేసి దాదాపు మూడు లక్షల మంది ఉపాధి హామీ మేట్లను ఇంటికి పంపింది. వారిలో కొంత మంది జాబ్‌కార్డులను రద్దుచేసింది. నోటికాటికూడును సైతం గుంజుకుంది. దీనిపై ప్రజాసంఘాలు భగ్గుమన్నాయి. ఆందోళనకు దిగాయి.

మెటీరియల్‌లో అవినీతి

ఉపాధి హామీ చట్టం కింద కూలీల వేతనాలు, మెటీరియల్ కాంపొనెంట్ వేతనాలు కేంద్రం నుంచి వస్తాయి. ఇందులో తొలిసారి గత ఏడాది మెటీరియల్ కాంపొనెంట్ కింద సీసీ రోడ్లను రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించారు. దాదాపు రూ. 720 కోట్ల మేర మంజూరు చేశారు. ఇందులో సుమారు రూ.380 కోట్ల మేర మాత్రమే జరిగాయి. ఇందులో రూ. 150 కోట్ల అవినీతి జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో 10 శాతం బిల్లులు కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా పెండింగ్ పెట్టారు. వినియోగ పత్రాలు వచ్చిన తరువాతే ఇస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ రూ. 600 కోట్ల మేర సీసీ రోడ్ల కోసం నిధులు ఉపాధి చట్టం కింద మంజూరు చేశారు. కాగా రూ. 300 కోట్ల మేర పనులు జరిగే అవకాశం లేకపోలేదని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు.

పని దినాలు, ఖర్చు వివరాలు(కోట్లలో)

సంవత్సరం	ప్రతిపాదన	మంజూరు	ఖర్చు
2014-15	15.33	13.08	2038
2015-16	18.37	13.56	2369
2016-17	14.98	10	2625
2017-18	18.09	12	2356

గొట్టిపాడు ఘటనపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం

- న్యాయం జరిగే వరకూ వదిలే ప్రసక్తేలేదు
- అప్పటికి న్యాయం జరగకపోతే చలో అసెంబ్లీ
- 'ఛలో గుంటూరు'లో వక్తలు



'చలో గుంటూరు'కు ర్యాలీగా తరలి వెళ్తున్న వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

గుంటూరు: గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు ఘటనకు బాధ్యులైన వారిపై పదిరోజుల్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి ప్రధాన నిందితులను అరెస్టు చేయకపోతే రాష్ట్రమంతటా ఉద్యమం ఉధృతమవు తుందని ఆదివారం రాత్రి గుంటూరులో జరిగిన 'చలో గుంటూరు' సభలో మాట్లాడిన వక్తలు ప్రభు త్వాన్ని హెచ్చరించారు. పెదగొట్టిపాడులో జనవరి ఒకటిన దళితులపై పెత్తందారులు జరిపిన దాడికి నిరసనగా ఆదివారం 'స్థానిక ఉల్ఫ్‌హాల్ మైదానంలో ఏర్పాటైన దళితుల ఆత్మగౌరవ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. సభకు పెదగొట్టిపాడు దళిత బాధిత సంఘీభావ కమిటీ అధ్యక్షులు జి.శాంతకుమార్ అధ్యక్షత వహించారు. వామపక్షాలు సహా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, 57 ప్రజా సంఘాల నాయకులు ఈ సభలో పాల్గొన్నారు.ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ దమన నీతిపై పోరాటానికి ఇది అంతం కాదిది ఆరంభమని పేర్కొన్నారు. గొట్టిపాడు ఘటనలో నిందితులను అరెస్టు చేయకపోతే చలో రాజమండ్రి, ఏలూరు, ఒంగోలు, అసెంబ్లీలకు పిలుపునిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, టిడిపి నాయకులను దయ్యాలై పట్టుకుంటామని, న్యాయం జరిగేదాకా వదిలే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. జన్మభూమి కమిటీలు నీరు చెట్టు పేరుతో దళితుల భూములను స్వాహా చేసి వందల ఎకరాలను తవ్వేసి మట్టిని దోచేశాయని మండిపడ్డారు. గరగపర్రు, దేవరాపల్లి, పెదగొట్టిపాడు ఇలా అనేక గ్రామాల్లో దళితులపై దాడులు చేస్తున్నారన్నారు. గుంటూ రు జిల్లాలో ఉన్న జన్మభూమి కమిటీలు రాక్షస కమిటీలుగా ప్రవర్తిస్తున్నాయన్నారు. పలు గ్రామాల్లో దళితులు, బలహీన వర్గాల భూములను అక్రమంగా చెరువుల పేరుతో మట్టి తవ్వుకుని కోట్లు గడిస్తున్నారని పేర్కొన్నారు. గత 20ఏళ్లుగా దళితులపై దాడులు జరుగుతున్నాయని, ముఖ్యంగా గత నాలుగేళ్లుగా ఈ దాడులు మరింత పెరిగాయ న్నారు. దళిత సోషన్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మోదీ, చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయన్నారు. గుజరాత్‌లో మీసాలు పెంచారని దాడి చేశారని, తెలంగాణలో అగ్రకుల యువతిని ప్రేమించిన నేరానికి హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదగొట్టిపాడు ఘటనపై పోలీసులు ఇప్పటికైనా సరిగ్గా స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. చట్ట ప్రకారం బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేయాల్సిన అవసరం ఉందని ఇతర అంశాలు కోర్టు చూసుకుంటుందని వివరిం చారు. దళితులు నిర్వహించుకుంటున్న ఈ సభకు విధించిన ఆంక్షలను అన్ని పార్టీలు, ఇతర సభలకు కూడా వర్తింపచేయగలరా అని ప్రశ్నిం చారు. విరసం నేత కల్యాణరావు మాట్లాడుతూ దళితులు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో ఓర్వలేక పెత్తందారులు దాడులకు తెగబడుతున్నారని చెప్పారు. పలు ఘటనల్లో దళితులనే నిందితులుగా చేరుస్తున్నారని విమర్శించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జెల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు జరుగుతున్నా యన్నారు. పెదగొట్టిపాడులో అసలు నింది తులను వదిలి దళితులను అరెస్టు చేయడం దారుణమన్నారు. డిబిఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లాడుతూ దళితులపై దాడి జరిగితే ప్రజా ప్రతినిధులు, మంత్రులు, అధికారులు ఒక్కరూ కూడా బాధితులను పరామర్శించకపోవడం దురదృష్టకరమన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.ప్రభాకర్ మాట్లాడుతూ దాడి చేసిన వారిని, బాధితులను కలిపి రాజీపేరుతో డ్రామా చేశారని, ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు అగ్రకులా లకు కొమ్ముకాస్తున్నారని చెప్పారు. తమిళనాడు విసికె పార్టీ కార్యదర్శి బాలసింగం మాట్లాడుతూ దళితులు రాజ్యాధికారం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, బిజెపి, ఇతర బూర్జువా పార్టీల వారి పంచన చేరకుండా మన ఓట్లు మనమే వేసుకునే స్థాయి ఎదగాల న్నారు. అసెంబ్లీ ముట్టడి కాదు అసెంబ్లీలోకి ప్రవేశించాలన్నారు. సభలో పెదగొట్టిపాడు గ్రామా నికి చెందిన దళిత బాధితుల పోరాట కమిటి నాయ కురాలు జయభాగ్యమ్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు ఉసురు పాటి బ్రహ్మయ్య, పిసిసి కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, సిపిఐ ఎంఎల్ నాయకురాలు సింహాద్రి ఝాన్సి, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకురాలు ఎంపి రాందేవ్, ఎపిసిఎల్‌సి రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సీని యర్ న్యాయవాది వై.కోటేశ్వర రావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి.కృష్ణమోహన్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు, పెండింగ్ బిల్లుల కోసం 21న చలో అసెంబ్లీ

అమరావతి : ఉపాధిహామీ పనులు, పెండింగ్ బిల్లులు, చట్టం రక్షించుకోవడానికై ఈ నెల 21న చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టిన్నట్లు ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు వెల్లడించాయి. ఈ మేరకు ఏపి వ్యవసాయ కార్మిక సంఘం(ఎఐఎడబ్ల్యూయు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు,దాసరి భవన్) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శేఖర్, జెల్లివిల్సన్ ఆదివారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. కూలీలకు ఉన్న ఊరిలో పనికల్పించి వలసలు నివారించడానికి వచ్చిన గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి, టిడిపి ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. కూలీల కోసం వచ్చిన నిధులను నీరుచెట్టు, సిమెంట్‌రోడ్లు, పక్కగృహాలు, ప్రభుత్వ భవనాలు, ఆటస్థలాలు, చివరకు విలాసవంతమైన కార్లు కొనుగోలుకు నిధులను మళ్ళించి పేదల పొట్టగొడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిగ్రామంలో వెంటనే పని కల్పించాలని, 100 రోజులు దాటిన ప్రతి కుటుంబానికి 200 రోజుల పని, రోజు కూలీ రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసిన పనికి ప్లేసిఫ్‌లు ఇవ్వాలని, పోస్టాఫీస్‌ల ద్వారా వారంలోపు బిల్లులు చెల్లించాలని, పాత బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. రెండు పూటల పని ఆలోచన విరమించాలని, పని ప్రదేశాల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రసూతి మహిళలలకు 90 రోజులు పని దినాలకు ఉచితంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. ఒంటరి, వృద్దాప్య మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి పని ఇవ్వాలని తెలిపారు. ఉపాధి మేట్లకు గుర్తింపు కార్డు ఇచ్చి రూ.5ల పారితోషికం ఇవ్వాలని కోరారు. ఉపాధి నిధులను సిమెంట్ రోడ్లకు, భవనాలకు, స్టేడియాల, గోడౌన్‌లకు మళ్ళించొద్దని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు, దళిత, గిరిజనుల భూములు అభివృద్ధి చేయాలని కోరారు. చెరువులు, కుంటలు, పంటకాలువలు, భూగర్భ జలాలు పెరిగే అన్ని రకాల మట్టిపనులు, మట్టిరోడ్లు చేయించాలని డిమాండ్ చేశారు. యంత్రాలను నిషేధించాలని, అందరికి పనిముట్లు, టెంట్, మెడికల్ కిట్ ఇవ్వాలని, ప్రమాదాల్లో చనిపోయిన వారికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలంతా కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగుల పాదయాత్ర, అర్ధనగ్న ప్రదర్శన

విజయవాడ : సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని కోరుతూ ఉద్యోగులు తలపెట్టిన 'మహా పాదయాత్ర'లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాదయాత్ర ద్వారా నిరసన తెలుపుతున్న ఉద్యోగులపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడి అరెస్ట్ చేయడంపై ఉద్యోగులు మండిపడ్డారు. ఆదివారం పాదయాత్ర పటమట ఎన్‌టిఆర్ సర్కిల్ వద్దకు చేరుకుని ఉద్యోగ విరమణ తరువాత సిపిఎస్ ఉద్యోగి జీవితాలు ఎలా రోడ్డున పడతాయో చూపిస్తూ బిక్షాటన, అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. చట్ట సభల్లో సిపిఎస్ రద్దుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తేటతెల్లం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుండగా రంగంలోకి దిగిన పోలీసులు ఉద్యోగుల ప్రదర్శనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు ప్రదర్శన చేస్తున్న ఉద్యోగు లను బలవంతంగా జీపుల్లో ఎక్కించుకుని కమిషనరేట్ పరిధిలోని వివిధ స్టేషన్లకు తరలిం చారు. తమ సమస్యలను ప్రభుత్వానికి వివరించేం దుకు అసెంబ్లీ వద్దకు పాదయాత్ర చేపట్టామని, ప్రభుత్వం తమ పట్ల కఠినంగా వ్యవహరించడం శోచనీయమని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పేటేటి సత్యనారాయణ, సంఘం కార్యదర్శి ముప్పాళ్ళ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

కేసీఆర్ పాలనకు బొందపెట్టే రోజు దగ్గర్లోనే



రైతులను మోసగిస్తున్న టీఆర్ఎస్ సర్కార్

- ఎకరాకు రూ.4 వేలు ఎన్నికల స్టంటే : నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రజాచైతన్య యాత్రలో ఉత్తమ్

నవతెలంగాణ-బోధన్ రూరల్/బోధన్‌టౌన్

ప్రజలకు మాయమాటలు చెప్పి, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వానికి బొందపెట్టే రోజు దగ్గర పడిందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలనకు వ్యతిరేకంగా నిశ్శబ్ద విప్లవం వచ్చే సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య బస్సు యాత్ర ఆదివారం నిజామాబాద్ జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా బోధన్, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సభల్లో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ ఇప్పుడు దాని ఊసే ఎత్తటం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలోనే రైతులపై ప్రేమ చూపిస్తున్నట్టు కేసీఆర్ నటిస్తున్నారన్నారు. అందులో భాగమే ఎకరాకు రూ. 4వేల పథకమన్నారు. ఒకవేళ రైతుపై ప్రేమ ఉంటే నాలుగేండ్లుగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని చెప్పిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ప్రధాని మోడీతో చేతులు కలిపి ప్రజలను మోసం చేస్తున్నారని, ఏకకాలంలో రుణమాఫీ చేయకుండా 4 సార్లు చేసి విఫలమయ్యారని అన్నారు. అనంత రం కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. సభలో సీఎల్పీనేత జానారెడ్డి, ఏఐసీసీ నాయకులు హన్మంత్‌రెడ్డి, మండలి విపక్షనేత షబ్బీర్ అలీ, మాజీ స్పీకర్ సురేష్ రెడ్డి, మాజీ మంత్రి దానం నాగేందర్, సుదర్శన్ రెడ్డి, అరుణతార, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్ పాల్గొన్నారు.

చెరుకు రైతలనుకాపాడాలని ఆందోళన

నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించి తమను కాపాడాలని చెరుకు రైతులు నిరసన తెలిపారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో చేస్తున్న రిలే దీక్షలకు రైతులు సంఘీభావం తెలిపారు. అనంతరం అక్కడి నుంచి కాంగ్రెస్ బస్సుయాత్ర సభాస్థలికి చేరుకుని సభను అడ్డుకున్నారు. చెరుకు రైతులను కాపాడాలని, నిజాంషుగర్ ఫ్యాక్టరీని పరిరక్షించాలని నినాదాలు చేశారు. ఆదుకుంటా మని ఉత్తమ్ హామీ ఇవ్వడంతో వారు శాంతిం చారు. అనంతరం చెరుకు రైతు నాయకులు రవి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు బోధన్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో నిరసన వ్యక్తం చేశారు. స్పందిం చిన షబ్బీర్ అలీ ఎస్సీ వర్గీకరణకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నదని తెలిపారు. అనంతరం ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో... ప్రాంతీయ పార్టీలదే కీలక పాత్ర

- ఎంఐఎం అధినేత ఓవైసీ

హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్, ప్రాంతీయ పార్టీలే కీలక భూమిక పోషిస్తాయని ఎంఐఎం ఆధినేత అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. దేశ రాజకీయాల్లో 'మార్పు' రావాలని, కాంగ్రెస్ బీజేపీలకు ప్రత్యామ్నాయం రావలసిన అవసరముందన్న కేసీఆర్ వ్యాఖ్యలపై ఓవైసీ పై విధంగా స్పందించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 2018లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రాంతీయ పార్టీలే కీలకపాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. 2009లో కాంగ్రెస్, 2014లో ఎన్నికైన బీజేపీలు.. ప్రజల ఆకాంక్షలు తీర్చడంలో విఫలమయ్యాయని విమర్శిం చారు. దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం రావలసిన అవసరం ఉందన్నా రు. కేసీఆర్ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని, ఆయన చేసిన వ్యాఖ్యలు దేశ రాజకీయాలపై ప్రభావం చూపుతాయన్నారు. కేసీఆర్‌ను ప్రధానమంత్రిగా మద్దతిస్తారా అన్న ప్రశ్నకు సమాధానంగా..వీటిని ఇప్పుడే పెద్దవిగా చేసి చూపవద్దని, కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలను సంఘటితం చేయడంలో 'ఖచ్చితంగా' కేసీఆర్ ప్రధాన పాత్ర పోషిస్తారని పునరుద్ఘాటించారు.

ఎస్ఎస్‌సీ పేపర్ లీక్‌పై సీబీఐ దర్యాప్తు

న్యూఢిల్లీ : స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) పేపర్ లీకేజ్‌పై సీబీఐతో దర్యాప్తు చేయించేందుకు ఎస్ఎస్‌సీ ఛైర్మన్ ఆశిమ్ ఖురానా అంగీకరించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటనను విడుదల చేశారు. గతనెల 17 నుంచి 22 వరకు ఎస్ఎస్‌సీ సీజీఎల్(టైర్-2) పరీక్షలను నిర్వహించారు. కానీ 21వ తేదీ జరగాల్సిన పరీక్షను వాయిదా వేశారు. పేపర్ లీక్ కావడంతోనే పరీక్ష వాయిదా వేసినట్టు వార్తలు రావడంతో అభ్యర్థులు ఢిల్లీలో గత కొద్ది రోజులుగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ వివాదంపై ఢిల్లీ భాజపా ఎంపీ మనోజ్ తివారీ కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిశారు. ఎస్ఎస్‌సీ పేపర్ లీకేజ్‌పై సీబీఐ దర్యాప్తు చేయించాల్సిందిగా ప్రతిపక్ష కాంగ్రెస్ నేతలతో పాటు అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే సీబీఐ దర్యాప్తు చేయించేందుకు ఎస్ఎస్‌సీ నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగ కొలువులను సాధించాలని ఎంతో కష్టపడి చదువుతున్న యువత భవిష్యత్‌ను ఇలా పరీక్షలు వాయిదా వేయడం వల్ల గందరగోళంలోకి పడేసినట్టు అవుతోందని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు.

అసైన్డ్ భూముల ఆర్డినెన్స్‌ను వ్యతిరేకించండి

- గత ప్రభుత్వాలకు కేసీఆర్ సర్కార్‌కు తేడా ఏం లేదు : రౌండ్‌టేబుల్‌లో వక్తలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ కోసం ఆర్డినెన్స్‌ను తేవాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ ఆర్డినెన్స్ భూస్వాముల కోసం ఉద్దేశించిందే తప్ప, సామాన్య ప్రజా ప్రయోజనాల కోసం కాదని స్పష్టంచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెచ్చిన 9/77 చట్టం తరహాలోనే ప్రస్తుత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆర్డినెన్స్‌ను తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తొలుత అసైన్డ్ భూముల లెక్కలు తీసి, వాటిని ఆక్రమించిన, కొనుగోలు చేసిన వారి వివరాలను గ్రామ సభల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. వారిలో అర్హులు ఉంటే క్రమబద్ధీకరించడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని, అందుకు భిన్నంగా భూస్వాములు ఆక్రమించి ఉంటే, ఆ భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తాధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం కార్యదర్శి టి సాగర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అఖిలభారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు బి ప్రసాద్, రామకృష్ణారెడ్డి, పవన్‌కుమార్, శ్రీను, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి బండారి రవికుమార్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మ, ఆర్ ఆంజనేయులు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎమ్ ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 1956 నుంచి 2014 వరకు ఏడు విడతల్లో 22,55,617 ఎకరాల ప్రభుత్వ భూముల్లో 13,88,530 మందికి పట్టాలు ఇచ్చారని తెలిపారు. ఆ భూముల్లో 2,42,749 ఎకరాలను అసైన్డ్ పొందిన వారు అమ్ముకున్నారని, చట్ట ప్రకారం అట్టి భూములు వారసత్వంగా ఉండాలే తప్ప, అమ్ముకోవడం చెల్లదని చెప్పారు. ఈ తరహాలో భూముల్ని 84,706 మంది కొనుగోలు చేశారని ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పుడు వారందరిపేర్లపై పట్టాలు ఇవ్వాలనే ఆలోచనతో ఆర్డినెన్స్‌ను తేవాలని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. సదరు భూముల్ని కొనుగోలు చేసిన వారు అర్హులా...కాదా అనేది విచారించకుండా పట్టాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అసైన్డ్ భూముల పంపిణీలో రిజర్వేషన్‌ను పాటించకుండా, కొనుగోలుదారులకు పట్టాలు ఇవ్వడం చట్టరీత్యా చెల్లదని స్పష్టం చేశారు. దళితులకు మూడెకరాల భూ పంపిణీ కోసం 2014 నుంచి 2017 వరకు 4,087 మందికి 10,740 ఎకరాలు పంపిణీ చేశారని, మిగిలిన దళితులకు భూమిని పంచేందుకు రీ సర్వే చేయించాలని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా ప్రయివేటు వ్యక్తుల నుంచి ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి ఇతరులకు ఇవ్వదని అన్నారు. 2017 సెప్టెంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు 2.45 లక్షల సాదాబైనామాలు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చాయని, వాటికి పట్టాలు ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. దీనివల్ల ఆ రైతులు ప్రభుత్వం ఇచ్చే ఎకరాకు రూ.4వేల పంటసాయాన్ని నష్టపోతున్నారని వివరించారు. భూదాన యజ్ఞబోర్డు భూములు 1.5 లక్షల ఎకరాలు కూడా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో మొత్తం సీలింగ్ భూములు 4,64,841 ఎకరాలు మిగులుగా తేల్చారని, వాటిలో 3,75,370.52 ఎకరాలు పంపిణీ చేశారని, మిగిలిన భూముల్ని కూడా పంచాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈనెల 10వ తేదీ అన్ని జిల్లాకేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 12 లక్షల ఎకరాల అటవీ భూమి సాగులో ఉంటే కేవలం 3 లక్షల ఎకరాలకు మాత్రమే పట్టాలు ఇచ్చారని, ఇవి కాకుండా పోడు వ్యవసాయం చేసే రైతులు కూడా ఉన్నారని, వారందరికీ భూముల్ని పంచి, పంటసాయం ఎకరాకు రూ.4వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.



దళారుల పాలవుతున్న ఎర్రజొన్న, పసుపు పంటలు

వి.ప్రభాకర్

ఎర్రజొన్న సాగును మొదట రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించింది. 1976-77 వరకు ఏపీ ప్రభుత్వం ఏపీ సీడ్ కార్పొరేషన్ ద్వారా విత్తనాలు ఇచ్చి ఉత్పత్తి అయిన ఎర్రజొన్నలను కొనుగోలు చేసేది. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, మెట్‌పల్లి శాసన సభ నియోజకవర్గాలతోపాటు నిర్మల్, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారిలో ఎర్రజొన్న సమారు 50 నుంచి 60 వేల ఎకరాల్లో సాగుచేయబడుతుంది. 90శాతం నిజామాబాద్ జిల్లాలోనే సాగుచేస్తున్నారు. ఎర్రజొన్న పంట ఆహర పదార్థాలకు కాకుండా, కేవలం పాడి పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడే విధంగా పశుగ్రాసంగానే వాడబడుతుంది. ఒక ఎకరం ఎర్రజొన్న సాగు చేయడానికి రైతు కుటుంబ శ్రమతో ఖర్చు ఈ విధంగా ఉన్నది.

ప్రస్తుతం ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధర ప్రకారం రైతు రూ.3,230 ఎకరానికి నష్టపోతున్నాడు. 90 శాతం ఎర్రజొన్న సాగుచేయబడుతున్న ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో దళారి వ్యాపారులు 30,40 మంది ఉన్నారు. దళారులు మొదటి విత్తనం ఇచ్చి, ధర కూడా ఒప్పందం చేసుకొని ఎర్రజొన్నలను సేకరించి ఢిల్లీ వ్యాపారులకు ఇచ్చి కమీషన్ తీసుకొనేవారు. విత్తన దళారి ఏజెంట్లు పోటీ పడితే ఎక్కువ లాభాలు సంపాదించలేమని సిండికేట్ అవతారం ఎత్తి విత్తనం ఇచ్చి ధరను ముందే నిర్ణయించే పద్ధతికి స్వస్తి పలికారు. సీజన్ రాగానే ఢిల్లీ మార్కెట్‌లో నిల్వలు ఉన్నాయని, విదేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయని కృత్రిమంగా ధరలను తగ్గించి రైతులను నిండా ముంచుతున్నారు. రైతు పండించిన ఎర్రజొన్న పంటలకు దళారి వ్యాపారులు కృత్రిమంగా ధరలను తగ్గిస్తున్నారని 2008లో ఉద్యమం ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్రజొన్న వ్యాపారుల దోపిడీని అరికట్టాలని, రైతుల బకాయిలను ఇప్పించాలని ఉద్యమం చేపట్టారు. ఆ ఉద్యమం రైతుల ఆమరణ నిరాహార దీక్షగా మారి 7 రోజులు సాగింది. చివరి రోజు 10 వేలమంది రైతులు రోడ్లపైకి వచ్చి స్వచ్ఛందంగా నిరసన వ్యక్తపరుస్తుంటే అప్పటి ప్రభుత్వం పోలీసులతో కాల్పులు జరిపించింది. ఈ ఉద్యమ ఫలితంగా నాటి ప్రభుత్వం ఎర్రజొన్నలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుచేసి రైతుల బకాయిలను ఇచ్చే విధంగా చర్యలు చేపట్టింది.

ఒక ఎకరం ఎర్రజొన్న సాగుకు అయ్యే ఖర్చు

విత్తనం 1.1/2 బస్తాకు	రూ. 800
దున్నడానికి, దుక్కి 2 సార్లు, గెర్ర, 3 గంటల ట్రాక్టర్ గంటలకు రూ.900 చొప్పున	రూ.2,700
విత్తనాలు చల్లడం, దబ్బడం,కలుపుతీయుట,కూలీలు	రూ.2,500
20-20 మందుసంచి ఒకటికి	రూ.1,050
రెండుసార్లు యూరియా 3 బ్యాగులు	రూ.1,000
గూలికలు వేయడానికి,కొయ్యడానికి 8 మంది కూలీలు (ఒక్కొక్కరి రూ.200 చొప్పున)	రూ.1,600
మిషన్ 18 క్వింటాల్ పట్టడానికి (క్వింటాల్‌కు రూ.120)	రూ.2,160-00
నీళ్ల పారించడానికి	రూ.1,500
పంటకు కావలి	రూ.8,000
పెండ లారీ	రూ.14,000
పెండలారీ చల్లడానికి నలుగురు కూలీలు	రూ.1,000
కరెంట్ రిపేరు, ట్రాన్స్‌ఫార్మర్ పొత్తు	రూ.1,000
వంద రోజులకుగాను వడ్డీ (పెట్టుబడికి)	రూ.2,220
ఒక ఎకరం మొత్త పెట్టుబడి (రైతు శ్రమ కలిపి)	రూ. 40,030

ఈ సంవత్సరం విత్తన దళారి వ్యాపారులు తిరిగి సిండికేటై ధరను కృత్రిమంగా తగ్గించివేశారు. క్వింటాల్ ఎర్రజొన్న రూ.1,600 నుండి రూ.1,800 వరకు క్వింటాల్‌కు 10 కిలోల కడత(తరుగు) తీసుకొనే విధంగా రైతులతో ఒప్పందాలు కుదుర్చుకొనేందుకు ప్రయత్నం చేశారు. 6.2.2018న కమ్మర్‌పల్లి, జక్రాన్‌పల్లి మండల కేంద్రాలలోని జాతీయ రహదారిపై వందలాది మంది రైతులు దిగ్బంధనం చేశారు. 9వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ముందు 18 మంది రైతులు అమరణ నిరహర దీక్షలో కూర్చున్నారు. 16వ తేదీన వందలాది పోలీసులు దీక్ష వద్ద విద్యుత్ లైట్లు ఆపివేసి దీక్షను భగ్నం చేశారు.

ప్రభుత్వం కొనుగోలు నిబంధనలు - దళారులకు తోడ్పాటు


మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు 5 మాత్రమే ఏర్పాటు చేసి 45 రోజులు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించారు. రైతు ఎర్రజొన్నలు తమ ఇంట్లో ఉంచుకోవడానికి ఇష్టపడడు, వెంటనే మార్కెట్‌కు తరలించాలి. వీఆర్‌ఏ ద్వారా టోకెన్‌తో కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాల్సిందే. సుమారు 4-5 లక్షల క్వింటాళ్ల కొనుగోలుకు కేవలం 5 కొనుగోలు కేంద్రాలు సరిపోవు. తేమ శాతం 12శాతం ఉండాలని, మిగతా జొన్న 15 శాతం మాత్రమే ఉండాలనీ అనేక షరతులు పెట్టారు. ప్రభుత్వం నిర్ణయం చేయకముందు మార్కెట్ లేదని రూ.1600 నుండి 1800, అదికూడా బలవంతంగా కొనుగోలు చేస్తున్నామని, అదేదో రైతుల మేలు కొరకేనని వ్యాపారులు చెప్పేవారు. ప్రస్తుతం దళారి వ్యాపారులు గ్రామాలకు వచ్చి ప్రభుత్వం ప్రకటించిన రూ.2,300 కాకుండా రూ.2,400 నుండి రూ.2,500 చొప్పున కడ్తా 10 కిలోల నుండి 6 కిలోలు తగ్గించి కొనుగోలు చేస్తామంటే రైతులు అంగీకరించి అమ్ముతున్నారు. దళారీ వ్యాపారులకు రూ.2,500 లాభసాటి అయినప్పుడు ప్రభుత్వం రైతులతో ఉద్యమకారులతో చర్చించకుండా ఏకపక్షంగా తక్కువ ధర నిర్ణయించినందుకు రైతులకు జవాబు చెప్పాల్సిఉంది. ఐక్య పోరాటంతో రైతులు సంఘటితమై ప్రభుత్వంపై పోరాడితే విజయం సాధించవచ్చన్నది వాస్తవం.

మరో వాణిజ్య పంట 'పసుపు'

పసుపును సాంప్రదాయంగా అనేక కార్యక్రమాల్లో వాడుతుంటాం. అంతేకాక పురాతన కాలంనుండి యాంటిబైటిక్ మందుగా ఏ చిన్న గాయమైనా వారికి ముందు గుర్తుకు వచ్చేది 'పసుపు'. నేటికీ పసుపును ఔషధాలకు, రంగులకు మరియు సౌందర్య సాధనాలకు వాడుతుంటారు. పసుపు సాగుకు 10 మాసాల సమయం పడుతుంది. ప్రపంచ వ్యాప్తంగా పసుపు పంట మన దేశంలోనే 82శాతం ఉంటుంది. ఇందులో 40 శాతంపైగా ఆర్మూర్ డివిజన్‌లో పండుతుంది. 4 దశాబ్దాల క్రితం పసుపు క్వింటాల్ ధర, బంగారం ఒక్క తులం ధరతో సమానంగా ఉండేది. అందుకే రైతులు ఈ పంటను బంగారు పంటగా పిలుచుకొనేవారు. రానురాను పసుపు సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. కానీ ధర తగ్గుతోంది. వైఎస్ఆర్, కిరణ్‌కుమార్ గార్లు మార్క్‌ఫెడ్ ద్వారా పసుపును కొనుగోలు చేస్తామని విధానాన్ని ప్రకటించి నిబంధనల్లో అనేక కొర్రిలు పెట్టడంతో రైతులు తిరిగి ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించారు. పసుపు పంటకు ప్రసిద్ధి చెందిన ఈప్రాంతంలో మార్కెట్‌కు గుర్తింపు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. మహారాష్ట్రలో గల సాంగ్లీ పసుపు మార్కెట్‌కు ప్రసిద్ధి చెందింది. నిజామాబాద్‌కు సుమారు 500 కిలోమీటర్ల దూరం ఉన్నా కొంతమంది పెద్ద రైతులు సాంగ్లీ మార్కెట్‌కు తీసుకెళు తున్నారు. సాంగ్లీ పసుపు మార్కెట్‌కంటే, నిజామాబాద్ మార్కెట్‌లో ప్రతి ఏటా క్వింటాల్‌కు రూ.2000 నుంచి రూ.3000 ధర తక్కువ ఉంటుంది. దీనికి ప్రధాన కారణం పసుపు కొనుగోలుదారులు సిండికేట్ అవతారం ఎత్తి కృత్రిమంగా ధర తగ్గించడం ఇ-నామ్ (ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్) ద్వారా పసుపు ధర పెరుగుతుందని ప్రచారం చేశారు. కాని ఇ - నామ్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కాక అది కేవలం ప్రచారానికే మాత్రమే పరిమితమైంది. పసుపు బోర్డు నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రతి ఎన్నికల్లో వాగ్దానం చేస్తున్నారే తప్ప అమలు లేదు. పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చెయ్యాలని రైతులు డిమాండ్ చేస్తుంటే పాలకులు మాత్రం వేల్పూర్‌లో పసుపు, సుగంధ ద్రవ్యాల పరిశోధన కోసం స్పైసెస్ పార్క్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే పసుపు పంటకు ఉపయోగపడుతుంది. కానీ ఇతర సుగంధ ద్రవ్యాలు కలపడం వల్ల పసుపుకు న్యాయం జరగడం లేదు. పసుపు రైతుకు ఒక్క ఎకరంలో 50 వేలు నష్టం కల్గుతుంది. మార్కెట్లో పసుపు పొడి కిలో రూ.200 అమ్ముతున్నారు. క్వింటాల్‌కు రూ.20 వేలు అవుతుంది. రైతుకు మాత్రం రూ.5వేలు అందుతున్నది. ఎర్రజొన్న రైతుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని పసుపు బోర్డు సాధన, పసుపు క్వింటాల్‌కు రూ.15 వేల ధర నిర్ణయం కొరకు ఉద్యమిద్దాం.

: 94401 51616

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ - ప్రజల ప్రత్యామ్నాయం



డా॥ కాలువ మల్లయ్య

ఫర్ ద పీపుల్, ఆఫ్ ద పీపుల్, బై ద పీపుల్ అని చెప్పబడే ప్రజాస్వామ్యం మెజారిటీ ప్రజలకు దూరంగా ఫార్ ద పీపుల్, ఆఫ్ ద పీపుల్, బై ద పీపుల్‌గా మారింది. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల వల్ల దేశంలో ప్రాంతీయ పార్టీలు బలపడటం, మనువాద పార్టీ బీజేపీ బలపడి దేశ పాలనా పగ్గాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దేశంలోని ప్రాంతీయ పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాల కోసం అగ్రవర్ణ కులాల చేతుల్లో బంధీగా మారి బహుజన ఉద్యమాలను సుదూరం చేసిన పార్టీలే.. చేస్తున్న పార్టీలే. సువిశాల జాతీయ, అంతర్జాతీయ ఎజెండా లేకుండా తాత్కాలిక ఎజెండాతో ఏర్పడిన పార్టీల వల్ల దేశ మెజార్టీ ప్రజలైన బహుజన హితానికి నష్టమే తప్ప లాభం జరుగదు, జరుగడం లేదు. ఇక కమ్యూనిస్టు పార్టీలు సమసమాజ స్థాపన, సోషలిస్టు సమాజ స్వప్నమే ధ్యేయంగా దోపిడీ, పీడన లేని వ్యవస్థ స్థాపన కోసం ఏర్పడిన అంతర్జాతీయ సిద్ధాంత నేపథ్యమున్న పార్టీలు. ఆ పార్టీ సిద్ధాంతం మానవీయమైనది. సర్వ మానవాళి సమానత్వాన్ని కోరుకునేది. భారతదేశంలోని కుల స్వభావాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం వల్ల కమ్యూనిస్టు పార్టీలు తాము ఏ పేద, నిరుపేద, అట్టడుగు వర్గాల కోసమైతే పని చేస్తున్నాయో ఆ మెజారిటీ బహుజనులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతు న్నాయి. వారి మనసులను దోచుకోలేకపో తున్నాయి. ఈ పార్టీలు మా కోసమే ఉన్నాయన్న భావాన్ని ఈ దేశ బహుజనుల మనసుల్లో కల్గించలేకపో యాయి. ప్రజాస్వామ్య పార్లమెంటరీ వ్యవస్థ ద్వారా సోషలిజం తీసుకురావచ్చన్న ధ్యేయాన్ని దృష్టిలో పెట్టుకుంటే ఇది సాధ్యమవుతుంది. మార్క్స్ చెప్పిన మానవీయ ఆర్థిక సమానత్వ కోణం, పూలే చెప్పిన విద్యా విజ్ఞాన సమాజం ద్వారా గులాంగిరీ నిర్మూలన, డా॥బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన సామాజిక సమానత్వం, స్టేట్ సోషలిజంలను మేళవించడమే ఈ దేశ సమస్యలను తీర్చే మార్గమన్న విషయాన్ని కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు గుర్తించాలి.

సామాజిక పార్టీలు, ద్రవిడ పార్టీలు తమ తమ రాష్ట్రాలకు పరిమిత కులాల రాజ్యాధికార భావనకు పరిమితం కావడం వల్ల దేశమంతటా విశేష ప్రభావం కల్గించలేకపో యాయి. బీఎస్పీ స్థాపన దేశ రాజకీయాల్లో పెద్ద సంచలనమే అయ్యింది. బహుజన రాజ్యాధికార భావన దేశమంతటా వ్యాపించిం ది. కానీ అనేక కారణాల వల్ల ఆ పార్టీ ఒకే రాష్ట్రానికి పరిమితమై ఆ ఒక్క రాష్ట్రంలో కూడా అది ప్రశ్నార్థకమైంది. ఇలా బహుజన రాజకీయాల్లో పెద్ద గ్యాప్ ఏర్పడింది. ఆ గ్యాప్‌ను పూరించడం ఈ రోజు సీపీఐ(ఎం)పై పడింది. అందుకే బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవశ్యకత ఏర్పడింది. సీపీఐ(ఎం) కేరళ మోడల్ రాజకీయాలతో, బహుజన, సామాజిక పార్టీలతో ఫ్రంట్‌గా ఏర్పడి భారత రాజకీయాలను నడిపితే అది ఖచ్చితంగా ఈ దేశంలోని మతతత్వ మనువాద పార్టీ బీజేపీకి, సెమీ మతతత్వ, మనువాద, కుహనా లౌకికవాద పార్టీ కాంగ్రెస్‌కు మూడో ప్రత్యామ్నాయం కాగలదు. ఇది నేటి సామాజిక, చారిత్రక, రాజకీయ, మానవీయావసరం కూడా.

డెబ్బై ఏండ్లుగా ఈ దేశాన్ని రాష్ట్రాలను పాలిస్తున్న కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం, టీఆర్ఎస్ లాంటి ప్రాంతీయ పార్టీలు ఈ దేశ బహుజనులకు ఒరగబెట్టిందేమీ లేదు. 85శాతంగా ఉన్న బహుజనులను, ఈ దేశ మూల జాతులను సేవకులుగా, పాలితులుగానే ఉంచింది. సంపూర్ణ అక్షరాస్యతను కూడా సాధించలేకపోయింది. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసింది. దేశంలోని 94శాతం సంపదను కొద్దిమంది చేతుల్లోకి పోయేటట్టు చేసింది. 93శాతం మంది బహుజనుల చేతుల్లో ఏ సంపద లేదు. దేశాన్ని పీడిస్తున్న కుల సమస్యను నిర్మూలించకపోగా కులాలను మరింత స్థిరీకరిస్తున్నాయీ పార్టీలు. నిలువ నీడ కూడా లేని కోట్ల మంది భారతీయులు బహుజనులే. ఈ దేశాన్నేలుతున్న మనువాద పార్టీలన్నీ కుల మతాలను రెచ్చగొట్టి మనీ, మాఫియా, మీడియా సహాయంతో గెలుస్తున్నాయి తప్ప బహుజనుల బతుకులను బాగుపరచడం లేదు. బాగుపడనీయవు కూడా. వీరి ఆర్థిక విధానాలూ, బడా భూస్వాముల, పెట్టుబడిదారులుగా అగ్రకులాలను ఎదిగించే విధంగానే ఉంటాయి. వీరికి ఎన్నికల్లో ఎలా గెలువడం అనే ధ్యాస తప్ప ప్రజలను భ్రమల్లో ముంచడం తప్ప మరొకటి కాదు. ఈ పార్టీలన్నీ ఈ దేశ మెజార్టీ ప్రజలైన బహుజనులు, పేదల కోసం కావని గత 70 సంవత్సరాల పాలన తెలిపింది. ప్రస్తుత పాలన మరో నిలువెత్తు నిదర్శనం. అందువల్ల ప్రజల ప్రత్యామ్నాయంగా బహుజనుల కోసం "బహుజన లెఫ్ట్ ఫ్రంట్" ఆవశ్యకత ఎంతో ఉంది. మెజారిటీ ప్రజలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే డెమోక్రసీ అనే పదానికున్న 'ప్రజల కొరకు, ప్రజల చేత, ప్రజల యొక్క' అనే అర్థం సార్థకమవుతుంది. బుద్ధ భూమి అయిన ఈ దేశాన్ని అంబేద్కరిస్టులు, కమ్యూనిస్టులు ఏలాల్సిన అవసరం ఉంది. మార్క్సిస్టులు కోరుకున్న ఆర్థిక సమానత్వ మానవీయ కోణం, అంబేద్కర్ కోరిన సామాజిక సమానత్వ సర్వ మానవ సమానత్వ కోణం 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్' రాజ్యాధికారంలోనే సాధ్యమవుతుంది. దీంతోనే కుల నిర్మూలనా జరుగుతుంది.

: 9849377578

అత్తగారి పెత్తనం

రంగనాయకమ్మ

- 3 -


అత్తకి 85 దాటాయి. మంచం ఎక్కింది. కానీ, వీల్ చైర్‌తో గదిలోంచి కుర్చీని తోసుకుంటూ బైటికి వస్తూనే వుంటుంది. కోడలికి ఎవరైనా ఫోన్ చేస్తే, ఎవరు చేశారో, ఏం అన్నారో, అత్తకి చెప్పాలి. అలాంటప్పుడు మెత్తగా అత్త, "ఎవరమ్మా చేశారూ?" అని నెమ్మదిగా అడుగుతుంది. అంతా చెప్పాలి. చెప్పేదాకా వదలదు. కొడుకూ కోడలూ భోజనాలు చెయ్యడం, వాళ్లిద్దరే కూర్చోడం, ఒక్కసారి కూడా జరగలేదు. కొడుకు ఆలస్యంగా వచ్చినా, తల్లి కూడా అప్పటి దాకా తినకుండా ఆగుతుంది. వీల్ చైర్ రోజుల్లో కూడా కొడుకు వచ్చేదాకా ఆగి, వాళ్లిద్దరూ కూర్చుంటే, తను ఆ చైర్‌ని తోసుకుంటూ వచ్చి, వాళ్ల మధ్యనే కూర్చుంటుంది భోజనానికి. "నేను వచ్చే దాకా ఎందుకు? నువ్వు తినేసి నిద్ర పోరాదా?" అంటాడు కొడుకు. "అమ్మో! నువ్వు తినకపోతే, నా నోటికి ముద్ద ఎక్కుతుందా?" అంటుంది తల్లి. భోజనాలు నిశ్శబ్దంగా ముగుస్తాయి. ఒక్కో రోజు, భోజనాల సమయంలో, కోడలి మీద పితూరీలతోనే సాగిస్తుంది. "ఇది వరకు బాగానే చేసేది నీ పెళ్లాం. ఇప్పుడే మరీ బద్ధకం పుట్టింది. ఉప్పు చాలలేదన్నాను. వేసినట్టే లేదు" అనో ఏదో ఎత్తుతుంది.

కొడుకు ఏమీ అనడు. లేకపోతే, "ఉప్పు ఇప్పుడు కొంచెం వేసుకో" అంటే, "అబ్బే, ఇప్పుడు కలిపితే బాగోదు, రుచి రాదు. అది కూర ఉడికేటప్పుడే కూరతోపాటు ఉడకాలి. కూర ఎలా వున్నా నువ్వయితే సరిపెట్టేసుకుంటావు. మీ అయ్య, నీ లాంటి వాడా? కూరలో ఉప్పెక్కువైతే నన్ను లెంపకాయ వేసేవాడు. గజగజ లాడుతూ వండేదాన్ని. మరి మొగాళ్లకి నచ్చేలాగ చెయ్యొద్దూ?" అంటూ భోజనాల కాలం అంతా కొడుకుని కూడా సాధిస్తుంది. 'నీ పెళ్లాన్ని లెంపకాయ ఎందుకు వెయ్యవు?" అన్నట్టు! "నేనైతే నీ లాగ మింగలేను" అంటుంది చివరికి. ఆమెని, భర్త, లెంపకాయలు వేశాడనేది శుద్ధ అబద్ధం. కొడుకుకి చిన్నప్పట్నించీ తెలుసు. తండ్రి ఎప్పుడూ నోరు తెరిచేవాడు కాదు. తల్లి మాటలు నిజం కావని అప్పుడప్పుడూ పెళ్లాంతో అంటాడు. కానీ, తండ్రి లాగే తను కూడా తల్లి దగ్గర నోరు తెరవడు. కానీ ఎప్పుడో ఆగలేకపోతే పెద్ద అరుపు అరుస్తాడు. "చాల్లే! వూరుకో!" అంటాడు. అంతేగానీ, చెప్పే విధంగా చెప్పడు. తల్లి చాలా మొరటుగా ప్రవర్తిస్తోంటే, కొడుకు మందలించవద్దా? ఆ మందలింపులే వుండవు. ఆ కోడలు, నాకు బాగా తెలిసిన మనిషి. మామగారు బతికి వున్న కాలంలో, ఆయనకి కుష్టు జబ్బు! పాదాల మీద పుండ్లు. కోడలు తెగ మర్దనాలు చేసేది. ఎప్పుడూ డాక్టర్ల దగ్గరకు తిప్పుతూ, వాళ్లు చెప్పినట్టే మందులు వాడుతూ, కట్లు కడుతూ, మామకి సేవలు చేసేది. ఆ ముసలాయన్ని, భార్య గానీ, కొడుకు గానీ, ముట్టుకునేవారు కారు. ఆయన పదేళ్ల కిందటే పోయాడు. ఆ కోడలు, నాకు, అత్తగారి చేష్టలు చెప్పినప్పుడల్లా, "ఆ మనిషిని ఎందుకు మందలించరు మీరు?" అనేదాన్ని నేను మొదట్లో. "ఎందుకు మందలించం? ఏదో ఒకటి అనకుండా వుంటానా? ఎన్ని అన్నా, అన్నీ గాలికి పోతాయి" అంటుంది కోడలు. అలా వినీ వినీ, "అయితే, మీ అత్తని ఆశ్రమంలో పడెయ్యి!" అనడం మొదలుపెట్టాను. "ఆ మనిషి ఇంట్లో వుంటే, ఇల్లు నరకం అవుతుంది" అన్నాను చాలా సార్లు.

కోడలు నిరుత్సాహంగా నవ్వుతుంది. "అమ్మో! మా వాళ్లందరూ ఏమనుకుంటారు? అసలు, మా అమ్మే తిడుతుంది నన్ను. 'పెద్దావిడ ఏదో అంటే అంటుంది. ఆ మాటలకే నీ ఒళ్లు చిల్లులు పడిపోతుందా? కాస్త ఏదో వండి పెట్టు, సరిపోతుంది. నా కొడుకు నన్ను ఏదో ఆశ్రమంలో పడేస్తే, మీరందరూ ఏడవరా?' అని, తెగ తిడుతుంది మా అమ్మ. ఒక్కోసారి నాకే చావాలనిపిస్తుంది. ఏం చెయ్యాలి? నేను చస్తే నా పిల్లల్ని ఎవరు చూస్తారు?" అంటూ చెప్పుకొస్తుంది కోడలు నాతో. ఆ అత్త, మనవణ్ణి పలకరిస్తుంది గానీ, మనవరాల్ని పలకరించదు. "నీ తల్లి అందమే నీది" అంటూ వుంటుంది పిల్లతో. అత్తకి కదలలేని స్థితి వచ్చిందని, ఇంట్లోనే నర్సుని పెట్టారు. నెలకి 14 వేలు. ఆ నర్సుకి అందేది 8 వేలే. బ్రోకర్‌కి 6 వేలు. అత్తగారు, తన నైజం అంతా ఆ నర్సు వేపు కూడా తిప్పింది. ఆ అత్తకి మలమూత్రాల కోసం డైపర్లు కట్టాలి, తియ్యాలి. రాత్రింబవళ్లూ ఆ మార్పుళ్లు. నర్సు ఓపిగ్గానే చేస్తూ వున్నా, ఆమె మీద కేకలే! నర్సుకి సెల్‌ఫోను వుంది. ఆ ఫోన్ వస్తే, నర్సు దూరంగా వెళ్లి మాట్లాడితే, అత్త భరించదు. "అటెందుకు పోతావు? నా మీద చెప్పాలనా? ఇక్కడే వుండి మాట్లాడు ఎప్పుడు ఫోనొచ్చినా! అసలు, నీకా ఫోను ఖర్చులెందుకు? నా మూలాన నీకు అంత డబ్బు ఇస్తున్నారు. అదంతా దుంపనాశనం చేసుకుంటావా?" అంటూ తెగ తిడుతుంది. ఒక్కోసారైతే, "ఎవడితో మాట్లాడతావు ఫోన్లో?" అంటుంది. అత్త కోసం, మంచం పక్కన చిన్న టీవీ వుంది. అత్త, ఆ టీవీని తన వేపే తిప్పుకుంటుంది. దాని సౌండు తగ్గించేస్తుంది. నర్సుకి దాన్ని కనపడనివ్వదు, వినపడనివ్వదు. తను భోజనం చేస్తేగానీ, తన కన్నా ముందు నర్సు తినకూడదు. అత్తకి ఆహారం, చీకట్నే 2 కోడిగుడ్ల మీద మిరియాల పొడితో మొదలవుతుంది. ఆ తర్వాత కాఫీ. తర్వాత 3 ఇడ్లీలూ, అరిటిపండూ. పది గంటల వేళ మళ్లీ కాఫీ. అన్ని రకాలుగా తిని, మధ్యాహ్నం ఒంటి గంట దాటినా అన్నం తినదు. నర్సు కూడా ఇడ్లీలు తిన్నా, ఆమెకి ఆకలే. కోడలు, నర్సుకే ముందు అన్నం పెట్టేస్తే, "దానికి అప్పుడే ఎందుకు పెట్టావు? నా ఆకలితో నేను చావాలా? నేను తినేసి నిద్రపోయాకే దానికి పెట్టు!" అంటుంది అత్త. ఆ అత్తకి "మెంటల్" అని ఏ డాక్టరూ చెప్పలేదు. "ఆమె అంతే, ఆమె మాటలు వినకండి!" అంటారు డాక్టర్లు. నర్సు, అత్త మంచం పక్కన చాప మీద మంచానికి దగ్గరగా పడుకుంటే, "ఇదుగో, నా మంచం ముట్టుకుంటావా? దూరంగా పడుకో!" అంటుంది. ఆ తర్వాత, నర్సు, తన చాపని దూరంగా జరుపుకుంటే, "అంత దూరంగానా? నేను నిన్ను లేపాలంటే ఎలాగ? చాప ఇటు జరుపు" అంటుంది. ఒక్కో సారి నర్సుని లేపాలంటే, గిల్లి లేపుతుంది. నర్సు ఉలిక్కిపడి లేచి, "ఏంటి మామ్మగారూ?" అంటే, "ఏంటో చెప్పాలా? అంత మొద్దు నిద్రా? నాలుగు సార్లు పిలిస్తే లేచావా? మరి గిల్లకేం చేస్తాను?" అంటుంది అత్త. అది సరేగానీ, నన్ను 'మామ్మ' అంటావేం? ఎప్పుడో చెప్పాను. నేనే ఈ ఇంటికి పెద్దదాన్ని. నా కొడుకు ఇల్లు ఇది. నన్ను 'పెద్దమ్మగారూ' అనాలి. నా కోడలుదాన్ని అమ్మగారూ అంటావెందుకు? అది 'అమ్మగారు' కాదు నేనూ అమ్మగార్ని!" అయినా నర్సు చప్పున మళ్లీ "మామ్మగారూ" అనేస్తుంది. తిట్లు తింటుంది. ఇద్దరు నర్సులు పారిపోయారు. కొత్త నర్సు దొరికేదాకా కోడలే చాకిరీ చేసింది. ఆ కోడలికి దాదాపు 60 ఏళ్లు. ఉద్యోగం ఎప్పుడో మానుకుని ఇంట్లోనే వుంటోంది. మూడో నర్సుని తొందరగానే కుదిర్చారు. అత్త స్నానం చేసేటప్పుడు రోజూ దిద్దులు తీసి తనే కడిగి మళ్లీ చెవులకు ఎక్కించుకుంటుంది. దిద్దుల్లో మంచి ముత్యాలు పెట్టించుకుంది. దిద్దుల్ని కడగడం గదిలో మంచం మీదే నీళ్ల గిన్నెలో చేసుకోమని కోడలు చాలాసార్లు చెప్పినా వినలేదు. ఆ పని బాత్‌రూమ్‌లో, కమోడ్ మీద కూర్చుని దిద్దులు విప్పుతుంది. ఒక రోజు, ఒక చెవిది, కమోడ్‌లో పడిపోయింది. నర్సు పరిగెత్తుకొచ్చి కోడలికి చెప్పింది. "పోతే పోనియ్యి! వూరుకో!" నిన్ను తియ్యమంటుంది. తియ్యనని చెప్పెయ్యి!" అంది కోడలు నర్సుతో. అప్పటికే అత్త, కమోడ్‌లో చెయ్యి పెట్టేసి, అక్కడ అశుద్ధంలో వెతికి వెతికి ఆ దుద్దుని బైటికి తీసింది! ఏమీ ఎరగనట్టు దాన్ని చెవికి పెట్టేసుకుంది!

(తరువాయి భాగం గురువారం సంచికలో)

కోరేగాం యుద్ధ వీరుల త్యాగనిరతిని వక్రీకరించొద్దు



గడ్డం దేవదాసు

200 సం॥ల క్రితం పూనే సమీపంలో భీమా నది తీరాన కోరేగాం అనే గ్రామం ఉంది. ఆ గ్రామం వద్ద జనవరి 1, 1818లో బ్రిటిష్, పీష్వా సైనికుల మధ్య ఘోరమైన యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో వేలాదిమంది పీష్వా సైనికులు మహార్, ఇతర కులాలకు చెందిన సైనికులను హత్య చేసారు. మహార్లు, ఇతర కులాలకు చెందిన సైనికులు 49మంది ఈ యుద్ధంలో మృతిచెందగా వారిలో 22మంది మహార్ సైనికులుకాగా, 27మంది ఇతర కులాలకు చెందిన సైనికులుగా చరిత్ర రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. కోరేగాం యుద్ధంలో వీరోచితంగా పోరాడి రక్త తర్పణకు పాల్పడిన సైనికుల జ్ఞాపకార్థం స్మృతి స్థూపం కోరేగాంలో నిర్మించబడింది. ప్రతి యేటా జనవరి 1 నుండి 31వ తేదీ వరకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది బహుజనులు కోరేగాం స్మృతి స్థూపాన్ని దర్శించి నివాళులు అర్పిస్తారు. ఆ స్థూపాన్ని చేతులతో తాకి తన్మయం చెందుతారు.

కోరేగాం యుద్ధాన్ని, పీష్వా నియంతృత్వ, నిరంకుశ, కుల అణచివేతకు, సాంఘిక పీడన దాష్టీకానికి వ్యతిరేకంగా మహార్ సైనికుల యుద్ధంగా ఏకపక్షంగా కొంతమంది అభివర్ణిస్తున్నారు. కోరేగాం యుద్ధంలో మహార్ సైనికులతోపాటు 27మంది ఇతర కులాలకు చెందిన సైనికుల భాగస్వామ్యం ఉంది. మహార్ సైనికులను కీర్తిస్తూ ఇతర కులాలకు చెందిన సైనికుల త్యాగనిరతిని విస్మరించడం సరియైంది కాదు. ఆ యుద్ధంలో మహార్ సైనికులను ఇతర కులాలకు చెందిన సైనికులను విడదీసి చూపడం, స్మరించడం చారిత్రక తప్పిదమే అవుతుంది. కొంతమంది కులతత్వ వాదులు మహార్ సైనికుల వీరోచిత గాథకే పరిమితమై సంకుచిత దృష్టితో కోరేగాం యుద్ధ విజయాలను వివాదాస్పదం చేస్తున్నారు. మరి కొంతమంది కల్పిత కథగా మహార్ సైనికులకు అపాదించి వ్యాఖ్యలు చేస్తున్నారు. మనువాదం ఈ దేశ బహుజనులను సర్వనాశనం చేసింది, చేస్తూనే ఉంది. ఊరు, వాడను వేరు చేసినట్టుగానే, మానవ సమాజాన్ని ముక్కలు ముక్కలుగా విడదీసి అణచివేసిన వాదమే మనువాదం. మూతికి ముంత, ముడ్డికి చీపురు, చేతిలో గంటను కట్టి అవమానించిన ఈ వాదం విద్యతోపాటు భూమి, ఆయుధం, అధికారం, అందకుండా చేసిన ఈ మనువాదాన్ని తక్కువ అంచనా కోరేగాం యుద్ధం మహార్‌ల విముక్తి సమరం కానే కాదు. అలాగైతే మహార్లు మహారాష్ట్రకు పాలకులయ్యేవారు. కాని నేటికీ మహార్లు కుల అణచివేతకు, అంటరానితనానికి, పలు సాంఘిక పీడనలకు గురవుతూనే ఉన్నారు. మహారాష్ట్రలోనే కాదు దేశమంతా మాల, మాదిగల పరిస్థితి అంధకారంగానే ఉంది. ఆత్మగౌరవం లేక, సామాజిక న్యాయం పొందక, ఆ రోజుల్లో డా॥ బి.ఆర్. అంబేద్కర్ పోరాట కృషి ఫలితంగా వచ్చిన రిజర్వేషన్ ఫలాలను అనుభవిస్తూ ఆ మేరకు జీవిస్తున్నారు, మనుగడను సాగిస్తున్నారు. ఎస్సీల్లోని ఇంక కొన్ని కులాలు నేటికీ రిజర్వేషన్ ఫలాలు అనుభవించనివారు, అందుకోలేనివారు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. బ్రిటిష్ వాళ్లు కల్పించిన అవకాశాన్ని మహార్లు (మహారాష్ట్ర), దుసదలు (బీహార్), దళిత సిక్కులు (పంజాబ్), ఉత్తరాదిలో చమార్, రామదాసీలు, మెహతార్, ఆంధ్రలో మాలలు కొంత అందుకోగలిగారు. విద్య, ఉద్యోగాలలో చేరి మంచి హోదా, గౌరవప్రదమైన జీవితం కాదు కానీ, కూడు, గుడ్డ, నీడకు కొదవ లేకుండా జీవించారు. కుల వివక్ష, అణచివేత, సాంఘిక పీడనలకు బలికాకుండా అప్పుడు, ఇప్పుడు మహార్లు, మాంగులు ఉండలేకపోతున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు పూర్తిగా తొలిగిపోయినప్పుడే మంచి జీవితం, మంచి హోదా, ఆత్మగౌరవాన్ని దళితులు పొందగలరు.

కులమంటే అంతర్ వివాహ పద్ధతి తప్ప మరేమీ కాదని డా॥ బి.ఆర్. అంబేద్కర్ చెప్పారు. శ్రమ విభజనతోపాటు శ్రామికుల విభజన జరిగిందని డా॥ బి.ఆర్. అంబేద్కర్ అంటాడు. సమాజ అవసరాలను తీర్చడం కోసం, సామాజిక ఉత్పత్తి తప్పనిసరైంది. ఆ ఉత్పత్తి క్రమంలో వృత్తులు ఏర్పడినాయి. ఆ వృత్తులను వంశపారపర్యం చేసి, ఆ వృత్తులకు అంతర్ వివాహ పద్ధతిని జోడిస్తే వృత్తులు కులాలుగా మారాయి. ఈ కులాలు బల ప్రయోగంతో కొనసాగుతున్నాయి. కుల వ్యవస్థను నిర్మూలించాలంటే అంతర్ వివాహ పద్ధతిని, కులాంతర వివాహాల (రక్త మార్పిడి) ద్వారానే కట్టడి చేయవచ్చు. దీనివల్ల కుల వివక్ష తొలగిపోతుంది. రక్త మార్పిడి, హేతువాదం ఆచరణతోనే కులం, మతం, కనుమరుగవుతుంది. తద్వారా కొత్త మానవుడి సృష్టికి పునాదులు పడతాయి. ఇందులో బల ప్రయోగం లేదు, కొనసాగింపు లేదు.

: 96666 51179

వ్యవసాయానికి అండగా నిలవాలి



వినోద్‌కుమార్ సుద్దాల

గతంలో వ్యవసాయం ఉత్తమం, వ్యాపారం మధ్యమం, ఉద్యోగం అదమం అన్న నానుడి ఉండంటే నేటి కాలంలో ఆశ్చర్యం వేయక మానదు. నేడు ఆ పరిస్థితి తలకిందులై "రైతే రాజు" అన్న పదం పేరుకే స్థిరపడిపోయింది. "రైతు లేనిదే రాజ్యం లేదు", 'రైతే దేశానికి వెన్నెముక' అనే పదాలతో సంతప్తి చెందడమే తప్ప రైతుకు ఒరుగుతున్నది ఏమీ లేదు. అందరికీ అన్నం పెట్టే రైతన్న పురుగుల మందు ఎందుకు తాగుతున్నాడు? ఇంటి చూరుకో, చెట్టుకొమ్మకో ఎందుకు దీనంగా వేలాడుతున్నడు? ఎన్నో కమిటీలు, రిపోర్టులు, సమావేశాలు, ప్రకటనలు, వరాలు అయినా నేటికీ రైతు పరిస్థితిలో కించిత్ మార్పు రాలేదు. నిజానికి ప్రపంచంలో పెరుగుతున్న జనాభా ఒకవైపు, తరుగుతున్న వ్యవసాయ భూములు మరోవైపు. గతి తప్పుతున్న రుతుపవనాలు, కల్తీమయమైన విత్తనాలు, రసాయనాలు, క్రిమిసంహారక పురుగు మందులు ఇత్యాది కారణాలతో భవిష్యత్తులో ఆహార భద్రతకు పెను సవాలు కానున్నది. అంతేకాకుండా వ్యవసాయ భూములను సైతం తేరగా వచ్చిన ధనాన్ని నయా పెట్టుబడిదారులు గ్రామాల్లో చేరి భూములను చెరబట్టడం, రియల్ ఎస్టేట్ వైపు మళ్లించడం లాంటి చర్యలతో నిజమైన రైతులే రైతు కూలీలుగా మారుతున్న దుస్థితి దాపురించింది. "సేద్యం గానీ స్వేదం గానీ ఎరుగని" నయా పెట్టుబడిదారుల చెరలోకి భూమి తరలుతున్నది.

వ్యవసాయదారులు చినుకు కోసం నింగి వైపు, చినుకు పడితే పెట్టుబడి కోసం గ్రామ సావుకారుల దగ్గరికి, విత్తుల కోసం ఆరాటం, కూలీ డబ్బుల చెల్లింపు కోసం పోరాటం, తదనంతరం క్రిమిసంహారక మందులతో కుస్తీతోనే పంట కాలం గడుపుతున్నా, చివరికి దిగుబడి వచ్చేసరికి అతనికి పెట్టిన పెట్టుబడి సైతం రాని దుస్థితి ఇంకెన్నాళ్లు? రైతులకు దక్కని గిట్టుబాటు దళారీలకు దక్కుతున్న తీరు ఇంకెన్నేళ్లు? పైపై ప్రకటనలు, ఎన్నికల హామీలతో రైతులను నమ్మించి నట్టేట ముంచుతున్న ప్రభుత్వాలు ఇప్పటికైనా రైతుగోసను మన్నించి వ్యవసాయ రంగ సమూల ప్రక్షాళనకు పూనుకోవాలి. భారత హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్ లాంటి శాస్త్రవేత్తలు చేసిన మేలైన సూచనలు ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాలి. ముఖ్యంగా రైతులకు అదునుకు పెట్టుబడి సాయం, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, భూసార పరీక్షలు, సేంద్రియ జీవ ఎరువులు, మార్కెట్ సదుపాయాలు ఆధునీకరణ, గిట్టుబాటు ధర, నిల్వ సదుపాయాలు, మౌలిక వసతుల పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, ఆధునిక సేద్య పద్ధతులు, నీటి పారుదల వ్యవస్థ మెరుగు వంటి చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. అంతేకాకుండా వ్యవసాయ అధికారులను జవాబుదారీ చేస్తూ విరివిగా ప్రచారం, అవగాహన కల్పించి నకిలీల, కల్తీలేని బెడదను అరికడుతూ రైతులను నట్టేట ముంచే కంపెనీల భరతం పట్టాలి. దళారీ వ్యవస్థ తగ్గించడానికి చర్యలు, ప్రభుత్వ నిత్య పర్యవేక్షణ, ధరలను మాయచేసే మాయగాళ్ల అదుపు, రైతులను మోసం చేసే వారిపై కఠిన చట్ట ప్రయోగంతోపాటు విరివిగా గిడ్డంగులు, శీతల గిడ్డంగులలో నిలువ సౌకర్యాన్ని పెంచాలి. అంతేకాకుండా ఆహారశుద్ధి పరిశ్రమను ప్రోత్సహించాలి. రైతు కూలీల సంక్షేమానికి ప్రభుత్వాలు కషిచేస్తే రైతులపై భారం తగ్గుతుందని మరవరాదు. అంతేకాకుండా ప్రతి రైతును ప్రభుత్వానికి అనుసంధానం చేసుకుని నేరుగా రుణాలు, ఇతర ఉపకరణాలు అర్హులకే చేరేలా చర్యలు చేపట్టాలి. అంతేకాకుండా తనఖా లేకుండా బ్యాంకు రుణాలు, కంపెనీల అడ్డగోలు ప్రచారంపై నియంత్రణ, వ్యాపారస్తుల నుండి రశీదులు తప్పనిసరి చేయటం, వ్యవసాయోత్పత్తులు ప్రభుత్వం ద్వారా కొనుగోలు (వీలైనంత మేరకు), కరువు, వరద, పంటలపై చీడపీడలు లేదా వాతావరణ మార్పుల వల్ల నష్టం వాటిల్లితే నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం కషి చేయాలి. రైతు కష్టానికి ఫలసాయం దక్కేలా చర్యలు గైకొనడమే కాదు వ్యవసాయ సంబంధ అన్ని సమస్యలను క్రమక్రమంగా పరిష్కరించాలి. ప్రభుత్వాలు సైతం వ్యక్తి కేంద్రంగా కాక రైతులను సంఘటితపరిచి సంఘాలుగా సమిష్టి పరచి రైతు సమూహం అభివద్ధికి మౌలిక వసతుల పెంపు, ఉపకరణాలపై సబ్సిడీ, యంత్రాలు, ఇతర ఆధునిక పరికరాలు, నీటిపారుదల వ్యవస్థ, నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలి. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలకు సైతం ఊతమిచ్చి ప్రోత్సహించినప్పుడే ఆరుగాలం శ్రమించే రైతన్నకు కాసింత ఆలంబనగా ఉంటుంది.

: 9908312949

వ్యాపారమయమైన విద్యా విధానం



ముంజ అశోక్‌గౌడ్

తయారీ దారుడు ఒక వస్తువును తయారు చేశాడు. తను ఆ వస్తువుపై ఎంత ఖర్చు చేసాడో లెక్క చూసుకొని ఒక ధర నిర్ణయిస్తాడు. ఉదాహరణకు తను ఆ వస్తువు మీద ఖర్చుచేసిన దానికి మరికొంత ధర తగిలించి అమ్మకం దారునికి ఇస్తాడు. తరువాత అమ్మకందారు ఆ వస్తువు తీసుకురావడానికి అయ్యే ఖర్చులను కలిపి తన ఆదాయానికి భంగం వాటిల్లకుండా కొత్త ధర నిర్ణయిస్తాడు. ఇది మనకు తెలిసిన విషయమే. ఏంటి అన్నీ తెలిసిన విషయాలే చెప్తున్నాడు అనుకుంటున్నారా... పాయింట్‌కి వస్తున్నా ... మరి విద్యాలయాలు ఎవరిని అడిగి ఈ తరగతికి ఇంత ఫీజు అని నిర్ణయిస్తున్నాయి? వేలకు వేలు వసూలు చేస్తున్నారు... వారు పెట్టిన పెట్టుబడికి ఎన్నో రెట్లు వసూలు చేస్తున్నారు. కొందరి పెద్దల ఆలోచన ఈ మధ్యకాలంలో గ్రహించాను. ఎక్కువ డబ్బు వుంటే రాజకీయంలోకి వెళ్లాలి. ఒక మోస్తరుగా వుంటే ఒక స్కూల్ కాని, కాలేజీ కాని పెట్టేయ్యాలి అనుకుంటున్నారు. అంటే దీన్నిబట్టి ఒక పావలా ఖర్చుకు పది రూపాయల ఆదాయం వస్తుంటే అలానే వుంటుంది మరి. తమ పిల్లలు పెద్ద చదువులు చదవాలని, ఇంగ్లీషులో మాట్లాడాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రయివేటు స్కూళ్లవైపు మొగ్గ చూపుతున్నారు. అంతే కాకుండా మన గవర్నమెంట్ బడులపై కూడా అక్కడ వున్న పాలకుల నిర్లక్ష్య ధోరణి చేత కూడా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రయివేటు స్కూళ్లపై ఆసక్తి చూపిస్తున్నారు. మన గవర్నమెంట్ బడులే కరెక్ట్‌గా వుంటే పుట్టగొడుగుల్లాంటి ప్రైవేట్ కళాశాలలు మొలిచి ఉండేనా... వెరసి ఆయా నగరాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో ఆయా విద్యా సంస్థలు ఫీజు దోపిడీకి పాల్పడుతున్నాయి. ఇక్కడ బాధాకరం ఏంటంటే పాఠశాలల్లో ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా వసూలు చేస్తున్నా నాయకులు అని చెప్పుకునే వారు కనీసం పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్టు ఉండడమే. అసలు మనకు ఒక యాక్ట్ వుందని దానికి లోబడి మెలగాలని కళాశాలలు పట్టించుకోవడం లేదు. (విద్యాహక్కు చట్టం) నియమ నిబంధనలకు లోబడి ఆరు నుంచి 14 ఏండ్ల లోపు చిన్నారులకు విద్య ప్రాథమిక హక్కు. ప్రాథమిక పాఠశాలలు కనీస ప్రమాణాలు పాటించాల్సి ఉటుంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పేద కుటుంబాల పిల్లలకు 25 శాతం సీట్లు రిజర్వు చేయాల్సి ఉంటుంది. పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు వసూలు చేయడం వల్ల పిల్లలు లేదా వారి తల్లిదండ్రులను ఇంటర్వ్యూ చే యడం నిబంధనలకు విరుద్ధం. కొన్ని కళాశాలల యాజమాన్యాలు మరీ దారుణంగా వున్నాయి. ఇటీవల ఎనిమిదేండ్ల పసిపాప కొన్ని కారణాల వల్ల మరణిం చింది. ఆ శోక సముద్రంలో పుట్టెడు ద్ణుఖంలో వున్న తల్లిదండ్రులకు ప ది రోజులు కూడా గడవకముందే ఫోన్ చేసి స్కూల్ ఫీజు అడిగారంట. చూశారా ఎంత స్వార్థపు సమాజంలో మనం బతుకుతున్నామో... ఒక రైతు పంట చేతికి వస్తుంది అనుకొని సంబరపడ్డాడు. కానీ చేతికి పంట వచ్చే సమయానికి విధి వెక్కిరించింది. తను బతకలేక తన పిల్లలకు ఫీజులు కట్టలేక కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకున్నారు. ఇలా బయటకురాని వేదనలు ఎన్నో.. పిల్లల భవిష్యత్తును డబ్బుతో తూచకుండా ఒక చిన్న మార్పు తీసుకురాగలరని కోరుకుంటూ.. నాయకులు కూడా స్పందించమని మనవి చేస్తున్నారు.

: 9441021212


ఈ పేజీ మీ అందరిది

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. నవతెలంగాణ అభిప్రాయాలు కానవసరం లేదు. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లోను 6000 క్యారెక్టర్లకు మించకుండా పంపించండి. వివిధ ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్ నెంబర్ ఇవ్వాలి.

- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228



షో

మెల్‌గిబ్సన్..
సాహసాలకు మారుపేరు.
భిన్న పాత్రలకు,
ప్రయోగాత్మక చిత్రాలకు
కేరాఫ్‌గా నిలిచిన
యాక్షన్ హీరో.
నటుడిగా, దర్శకుడిగా,
నిర్మాతగా, రచయితగా..
నాలుగు దశాబ్దాలకు పైగా
ప్రపంచ ప్రేక్షకుల్ని
మెస్మరైజ్ చేసిన
ఆల్‌రౌండర్.
ఉత్తమ దర్శకుడిగా
ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డుని
కైవసం చేసుకున్న
బహుముఖ ప్రజ్ఞాశాలి
మెల్‌గిబ్సన్ గురించి
ఈ వారం అందిస్తున్న
స్పెషల్ షో..

ప్రేక్షకుల్ని మెప్పించిన ఆల్‌రౌండర్



సోదరి ప్రోద్భలంతో..

మెల్ గిబ్సన్ 1956 జనవరి 3న పీక్స్‌కిల్‌లో జన్మించారు. 11 మంది సంతానంలో గిబ్సన్ ఆరవ వాడు. తండ్రి హట్టన్ గిబ్సన్, తల్లి అన్నె పాట్రిసియా. మొదట్నుంచి బాగా ఉన్న కుటుంబం. గిబ్సన్ సోదరుడు డోనాల్ కూడా నటుడిగా రాణిస్తున్నారు. గిబ్సన్‌కు అలనాటి సింగర్ ఎవా మైలాట్ గ్రాండ్‌మదర్. సిడ్నీలో స్కూల్ విద్య పూర్తి చేశారు. గ్రాడ్యుయేట్ చేసేటప్పుడు ఆయన మంచి చెఫ్ లేదా జర్నలిస్ట్ అవ్వాలనుకున్నారు. తన సోదరి ప్రోద్భలంతో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రామటిక్ ఆర్ట్‌లో జాయిన్ అయ్యారు. ఆ టైమ్‌లో నిడా ప్రొడక్షన్ వాళ్ళు నిర్వహించే 'రోమియో అండ్ జూలియెట్' నాటకంలో పాల్గొన్నారు. 'ది సుల్లివాన్స్' టెలివిజన్ సిరీస్‌తో నటుడిగా మారి 'ఏ మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్', 'డెత్ ఆఫ్ ఏ సేల్స్‌మ్యాన్', 'వెయిటింగ్ ఫర్ గాడాట్', 'లవ్ లెటర్స్' వంటి టీవీ సిరీస్‌లో నటించి మెప్పించాడు.

మలుపు తిప్పిన మ్యాడ్‌మ్యాక్స్..

గిబ్సన్ నటించిన మొదటి ఫీచర్ ఫిల్మ్ 'ఐ నెవర్ ప్రామీస్డ్ యు ఏ రోజ్ గార్డెన్'. ఇందులో చిన్న పాత్ర ద్వారా నటుడిగా వెండితెరగేట్రం చేశారు. పూర్తి స్థాయి నటుడిగా 'సమ్మర్ సిటీ' (1977) చిత్రంలో నటించారు. దానికి ఆయన అందుకున్న పారితోషికం 400 డాలర్లు. గ్రాడ్యుయేట్ చేసే టైమ్‌లోనే సౌతెర్న్ ఆస్ట్రేలియన్ థియేటర్ కంపెనీలో రూపొందే క్లాసికల్ 'ఓయిడిపస్ అండ్ హెన్రీ 4' చిత్రాల్లో నటించారు. రెండేండ్ల తర్వాత వచ్చిన 'మ్యాడ్‌మ్యాక్స్' గిబ్సన్ కెరీర్‌నే మలుపు తిప్పింది. 1979లో వచ్చిన ఈ సినిమాకు గానూ గిబ్సన్ 15000 డాలర్ల రెమ్యూనరేషన్ అందుకున్నారు. జార్జ్ మిల్లర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో మెయిన్ ఫోర్స్ పెట్రోల్‌కు చెందిన వారియర్ మ్యాక్స్ పాత్రలో గిబ్సన్ నటన, రేసింగ్ సన్నివేశాలు మంత్రముగ్ధుల్ని చేస్తాయి. ఈ చిత్రం 100 మిలియన్‌లను వసూలు చేసి అప్పటి వరకు ఆస్ట్రేలియాలోనే అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రంగా నిలిచింది. అనంతరం చేసిన 'టిమ్' చిత్రంలో మానసిక పరివర్తన చెందని యువకుడిగా నటించి మెప్పించాడు. ఈ చిత్రానికి ఆస్ట్రేలియన్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ అవార్డునందుకున్నారు. ఆయన అందుకున్న మొదటి పురస్కారమిది. మొదటి ప్రపంచ యుద్ధం నేపథ్యంలో వచ్చిన 1981లో వచ్చిన 'గల్లిపోలి' చిత్రంలో స్వాతంత్ర్య భావాలు కలిగిన వ్యక్తిగా నటించి మెప్పించారు. అదే ఏడాది వచ్చిన 'మ్యాడ్‌మ్యాక్ 2: ది రోడ్ వారియర్'లో నటించారు. ఈ చిత్ర విజయం గిబ్సన్‌ను అంతర్జాతీయంగా స్టార్‌ని చేసింది. దర్శకుడు పీటర్ వెయిర్‌తో పనిచేసిన రెండవ చిత్రమిది. ఇక గిబ్సన్ నటించిన మొదటి రొమాంటిక్ చిత్రం 'ది ఇయర్ ఆఫ్ లివింగ్ డేంజరస్లీ'. ఇందులో నటి సిగౌర్నీ వీవర్‌తో కలిసి నటించారు. వీరిద్దరి జంట సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసింది.

హాలీవుడ్ ఎంట్రీ..

1983 వరకు ఆస్ట్రేలియాకే పరిమితమైన గిబ్సన్ 1984లో తొలిసారి అమెరికన్ చిత్రం 'ది రివర్'లో నటించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. ఇక 1985లో 'మ్యాడ్‌మ్యాక్స్: బియాండ్ థండర్‌డమ్' చిత్రంలో నటించారు. ఈ చిత్రాలతో అమెరికన్ పాపులర్ మ్యాగజైన్ పీపుల్‌లో మొదటిసారిగా 'సెక్సీయెస్ట్ మ్యాన్ ఎలైవ్'గా గుర్తింపు తెచ్చుకున్నారు. బ్లాక్‌బస్టర్ 'లెథల్ వెపన్' చిత్రంలో పోలీస్ మార్టిన్ రిగ్స్‌గా నటించి అదరగొట్టారు. ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా భారీ విజయాన్ని సాధించింది. దీంతో ఈ చిత్రానికి సీక్వెల్స్ తీయడం ప్రారంభించారు. అలా '1989లో 'లెథల్ వెపన్ 2', 1992లో 'లెథల్ వెపన్ 3', 1998లో 'లెథల్ వెపన్ 4' చిత్రాలొచ్చాయి. ఈ నాలుగు చిత్రాల్లో హీరోగా గిబ్సన్, విలన్‌గా డానీ గ్లోవర్ నటించారు. ఈ సిరీస్‌తో 'గుడ్ పోలీస్'గా గిబ్సన్‌కు, 'బ్యాడ్ పోలీస్'గా గ్లోవర్‌కు పేరొచ్చింది. వీటితోపాటు 'బర్డ్ ఆన్ ఏ వైర్', 'ఎయిర్ అమెరికా', 'హామ్‌లెట్' చిత్రాల్లో నటించి ఆకట్టుకున్నారు. ఈ మూడు చిత్రాలు ఒకే ఏడాది 1990లో విడుదల కావడం విశేషం.'ఫరెవర్ యంగ్' కూడా మంచి పేరు తెచ్చిపెట్టింది. ఆ టైమ్‌లో యానిమేషన్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'పోచహొంటాస్'కు వాయిస్‌ను ఇవ్వడంతోపాటు పాట కూడా పాడారు. ఇలా వరుసగా 'పేబ్యాక్', 'ది పేట్రియట్', 'చికెన్ రన్', 'వాట్ ఉమెన్ వాంట్', 'ది మిలియన్ డాలర్ హోటల్', 'సైన్', బిబిసి మినిసిరీస్‌లో వచ్చిన 'ఎడ్జ్ ఆఫ్ డార్క్‌నెస్', వియత్నాం వార్ నేపథ్యంలో రూపొందిన 'వీ వర్ సోల్జర్స్'లో నటించారు. వీటిలో "వి వర్ సోల్జర్స్', 'సైన్' చిత్రాలు గిబ్సన్ కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రాలుగా నిలిచాయి. 'ది సింగింగ్ డిటెక్టివ్', 'గెట్ ది గ్రింగో', 'బ్లడ్ ఫాదర్', 'డాడీ హోమ్ 2' చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేశారు. హీరోగానేకాదు విలన్‌గానూ నటించి విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకున్నారు. 'మచెట్ కిల్స్'లో వోజ్ పాత్రలో డాన్నీ ట్రెజోకు ప్రత్యర్థిగా, 'ది ఎక్స్‌పెండబుల్స్ 3'లో కాన్రాడ్ స్టోన్‌బ్యాంక్ పాత్రలో సిల్వెస్టర్ స్టాలోన్‌కు ప్రతినాయకుడిగా నటించి తన విలక్షణ నటనను చాటుకున్నారు.

దర్శకుడు, నిర్మాత, రచయిత..

'లెథల్ వెపన్' చిత్ర విజయంతో గిబ్సన్ ప్రొడక్షన్ ప్రారంభించారు. బ్రూస్ డేవీతో కలిసి 1989లో ఐకాన్ ప్రొడక్షన్స్ సంస్థను ప్రారంభించారు. మొదటి చిత్రంగా 'హామ్‌లెట్'ను తెరకెక్కించారు. తక్కువ బడ్జెట్ చిత్రాలతోపాటు భారీ సినిమాలనూ నిర్మించారు. 'ఇమ్మోర్టల్ బిలవ్డ్', 'ఫరెవర్ యంగ్', 'ఎయిర్ బోర్న్', 'ది మ్యాన్ వితౌట్ ఏ ఫేస్', 'మేవ్‌రిక్', 'బ్రేవ్‌హార్ట్', '187', 'పేబ్యాక్', 'వాట్ ఉమెన్ వాంట్', 'వీ వర్ సోల్జర్స్', 'అపోకలిప్టో' చిత్రాలున్నాయి. ఆయన నిర్మించిన చిత్రాల్లో పలు సపోర్టింగ్ రోల్స్ కూడా పోషించారు. దాదాపు 60 సినిమాలను, ఆరు టీవీ సిరీస్‌లను నిర్మించారు. దర్శకులు జార్జ్ మిల్లర్, పీటర్ వెయిర్, రిచర్డ్ డాన్నర్‌ల ప్రభావం మెల్ గిబ్సన్‌పై ఎక్కువగా ఉంటుంది. వారిని స్ఫూర్తిగా తీసుకుని 'ది మ్యాన్ వితౌట్ ఏ ఫేస్' చిత్రంతో దర్శకుడిగా మారారు. 1993లో విడుదలైన ఈ చిత్రంతో మంచి ప్రశంలందుకున్నారు. ఓ టీచర్‌కు, సమస్యలున్న విద్యార్థికి మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో టీచర్ పాత్రలో గిబ్సన్ నటించడం విశేషం. ఒక విద్యార్థికి అండగా నిలిచి అతని లైఫ్‌ను తీర్చిదిద్దడమనే కథాంశంతో దర్శకుడు గిబ్సన్ మొదటి సినిమాతోనే విమర్శకుల మెప్పు పొందారు. ఆ తర్వాత నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'బ్రేవ్‌హార్ట్' చిత్రం సంచలన విజయం సాధించింది. ఇంగ్లాండ్‌కు చెందిన కింగ్ ఎడ్వర్డ్-1 ఆగడాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే సైనికుడి కథ నేపథ్యంలో గిబ్సన్ ఈ చిత్రాన్ని బయోగ్రఫీ హిస్టారికల్ డ్రామాగా అత్యద్భుతంగా తెరకెక్కించారు. ఒక దర్శకుడు రెండవ చిత్రంగా ఇంత భారీగా, యుద్ధ నేపథ్యంలో సినిమాను రూపొందించడం గొప్ప విషయం. అంతేకాదు ఇందులో తిరుగుబాటు చేసే యోధుడు విలియమ్ వాల్లెస్ పాత్రలో గిబ్సన్ నటన రోమాలు నిక్కపొడిచేలా ఉంటుంది. ఎపిక్ వార్‌గా రూపొందిన ఈ సినిమా 65 మిలియన్లతో తెరకెక్కి 210 మిలియన్ డాలర్ల భారీ కలెక్షన్లను సాధించింది. నాలుగు ఆస్కార్ అవార్డులను అందుకుంది. 'ది ప్యాషన్ ఆఫ్ ది క్రిస్ట్', 'అపోకలిప్టో', 'హక్సారిడ్జ్' చిత్రాలను తెరకెక్కించి ఆల్‌రౌండర్‌గా అనిపించుకున్నారు. ఇందులో జేరూసలేంలో యేసుకు శిలువ వేయబోయే 12 గంటల సమయంలో చోటు చేసుకున్న సంఘటనల సమాహారంగా 'ది ప్యాషన్ ఆఫ్ క్రిస్ట్' చిత్రాన్ని తెరకెక్కించారు. అత్యంత ఉత్కంఠభరితంగా, మనసు పొరల్ని తడిమేలా సాగే ఈ చిత్రంలో దర్శకుడిగా గిబ్సన్ టేకింగ్ విమర్శకుల మన్ననలను పొందేలా చేసింది. కేవలం 30 మిలియన్ డాలర్లతో తెరకెక్కిన ఈ సినిమా ఏకంగా 612 మిలియన్ డాలర్లను వసూలు చేయడం విశేషం. అనేక వివాదాలు ఎదుర్కొనడంతోపాటు అవార్డులనూ దక్కించుకుంది. అంతేకాదు ఈచిత్రంతోనే గిబ్సన్ రచయితగా కూడా మారారు. మయాన్ రాజ్యంలో అక్కడి పాలకుల మూఢవిశ్వాసాలను, ఇబ్బందులను ఎదురించి పోరాడిన ఓ మయాన్ యువకుడి అత్యంత సాహసోపేతమైన పోరాటమే 'అపోకలిప్టో' కథ. ఎపిక్ అడ్వెంచరస్‌గా ఈచిత్రం విశేష ఆదరణ పొందింది. మంచికలెక్షన్లను కూడా సాధించింది. విభిన్నమైన స్క్రీన్‌ప్లే, కథలోనూ సహజత్వం గిబ్సన్ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. రచయిత, నిర్మాతగా గిబ్సన్‌కు మంచి పేరును తెచ్చిపెట్టిందీ చిత్రం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో గాయాలైన సైనికులకు వైద్యం అందించడం, చనిపోయిన వారిని తరలించడం వంటి వాటితో అమెరికా చరిత్రలోనే ఫైరింగ్ చేయకుండా మెడల్‌ను సాధించిన ఆర్మీ మెడిక్ డెస్మాండ్ టి. డాస్ జీవితం ఆధారంగా రూపొందించిన చిత్రం 'హాక్సారిడ్జ్'. సౌండ్ మిక్సింగ్, ఎడిటింగ్ విభాగంలో ఆస్కార్ అవార్డులు పొందిన ఈ చిత్రానికి గిబ్సన్ దర్శకత్వం హైలైట్‌గా నిలిచింది. మంచికలెక్షన్లను సాధించింది. దీంతోపాటు రచయితగా 'గెట్ ది గ్రింగో' చిత్రానికి పనిచేశారు. దర్శకుడిగా 'కంప్లీట్ సేవేజస్', 'ది బార్బే కోస్ట్' వంటి టెలివిజన్ సిరీస్‌లను రూపొందించారు.

వ్యక్తిగతం.. వివాదాలమయం..

1980లో డెంటల్ నర్స్ రాబీన్ డెనిస్ మూరెను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి ఒక కూతురు హన్నా, ఆరుగురు కుమారులున్నారు. 26 ఏండ్ల తర్వాత విడిపోవడంతో భార్యకు భరణంగా 400 మిలియన్ డాలర్లను ఇచ్చారు. హాలీవుడ్ చరిత్రలోనే ఇది అత్యధికం. ఆ తర్వాత రష్యన్ పియానోయిస్ట్ ఓక్సానా గ్రిగోరెయివాతో సహజీవనం చేసినట్టు వార్తలొచ్చాయి. ఆమె కారణంగా వేధింపులకు సంబంధించిన పలు వివాదాల్లో ఇరుక్కున్నారు. గ్రిగోరియివాను ఏడు లక్షల యాభై వేల డాలర్లు చెల్లించి తన కేసును క్లీయర్ చేసుకున్నారు. గిబ్సన్ 13ఏండ్ల వయసులోనే మద్యానికి బానిసయ్యారు. మద్యం తాగటం కారణంగా అనేకసార్లు జైలుకెళ్ళారు. అలాగే మద్యం సేవించి సినిమాలు చేసిన రోజులూ ఉన్నాయి. 30 ఏండ్ల వయసులో డిప్రెషన్ కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. తన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని టీనేజ్ మద్యానికి బానిసలు కాకుండా ఉండటం కోసం ఓ ఆర్గనైజేషన్‌ను స్థాపించారు. ఒకానొక సందర్భంలో గిబ్సన్ స్వలింగ సంపర్కుడు అనే ఆరోపణ హల్‌చల్ చేసింది. గిబ్సన్ రియల్ ఎస్టేట్ రంగంలోనూ రాణించారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలకు, సేవా కార్యక్రమాల కోసం భారీ స్థాయిలో విరాళాలిచ్చారు. 'బ్రేవ్‌హార్ట్' చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా, ఉత్తమ చిత్రంగా రెండు ఆస్కార్ అవార్డులను, ఒక గోల్డెన్ గ్లోబ్ పురస్కారం దక్కించుకున్నారు. 'హక్సా రిడ్జ్' ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది. పలు బ్రిటీష్, ఆస్ట్రేలియన్ ఆకాడమీ పురస్కారాలను అందుకున్నారు.



నట విశ్వరూపానికి ప్రతీకలు

గిబ్సన్ ఒక్కో సినిమాలో ఒక్కో రకమైన పాత్రతో ప్రపంచ ప్రేక్షకులకు తన నట విశ్వరూపాన్ని చూపారు. కమర్షియల్ హీరోగా, యుద్ధ వీరుడిగా, ప్రేమికుడిగా, బాధ్యత కలిగిన పౌరుడిగా, తండ్రిగా, స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తిగా, తిరుగుబాటు దారుడిగా, వినోదభరిత పాత్రలూ పోషించి తన నటనలోని భిన్న కోణాలను ఆవిష్కరించారు. 'మ్యాడ్‌మ్యాక్స్' మోడ్రన్ కల్చర్‌ను ప్రతిబింబించే ఈచిత్రం అప్పటి యువతను ఎంతో ప్రభావితం చేసింది. అత్యంత నైపుణ్యం కలిగిన పోలీస్‌గా మ్యాక్స్ పాత్రలో గిబ్సన్ నటన ప్రేక్షకులను ఫిదా చేసింది. దీనికి సీక్వెల్‌గా వచ్చిన 'మ్యాడ్‌మ్యాక్స్2' సైతం యాక్షన్ ఫిల్మ్‌గా ఆకట్టుకుంది. శరణార్థులపై రావింగ్ బ్యాండ్ టీమ్ దాడులను అడ్డుకునేందుకు హైవే పోలీస్ ఆఫీసర్ మ్యాక్ చేసే పోరాటమే ఈ చిత్రం. ఇందులో మరోసారి తనదైన నటనతో గిబ్సన్ ఆకట్టుకున్నారు. ఆ తర్వాత 1985లో వచ్చిన 'మ్యాడ్‌మ్యాక్స్ 3'లో అవినీతికి వ్యతిరేకంగా మ్యాక్స్ పాత్రలో గిబ్సన్ ఒంటరిగా చేసే పోరాటం సినిమాకు హైలైట్‌గా నిలిచింది. ఇక 'గెట్ ది గ్రింగో' చిత్రంలో క్రిమినల్‌గా గిబ్సన్ నటన ఆకట్టుకుంటుంది. అత్యంత సాహసోపేతంగా సాగే ఈచిత్రాన్ని ఆయనే నిర్మించడంతోపాటు రచయితగా పనిచేశారు.

ఒక సంపన్న కుటుంబానికి చెందిన అమ్మాయితో లేబర్ అయిన గిబ్సన్ సాగించే ప్రేమాయణం నేపథ్యంలో రూపొందిన 'టిమ్' చిత్రంలో గిబ్సన్ లవర్‌బాయ్‌గా, మానసికంగా ఇబ్బంది పడే వ్యక్తిగా ఆకట్టుకుంటారు. 'ది ఇయర్ ఆఫ్ లివింగ్ డేంజరస్'లో గాఢ ప్రేమికుడిగా, 'ది రివర్'లో వ్యవసాయ కుటుంబానికి చెందిన వ్యక్తిగా, 'మిస్టర్ సోఫెల్'లో జైలు నుంచి పారిపోయే ఖైదీగా, క్రైమ్ థ్రిల్లర్ 'టెక్విల్ సన్‌రైజ్'లో డ్రగ్ డీలర్‌గా నట విలక్షణతను చూపించారు. 'బర్డ్ ఆన్ ఏ వైర్'లో కామెడీ తరహా పాత్రలో డ్రగ్ డీలర్‌గా మెప్పించారు. యాక్షన్ కామెడీ 'ఎయిర్ అమెరికా'లో పైలట్‌గా, షేక్స్పియర్ ట్రాజెడీ కథ 'హామ్లెట్'లో ప్రిన్స్‌గా, 'ఫరెవర్ యంగ్'లో ఆర్మీ ఎయిర్ కాప్స్ కెప్టెన్‌గా, ప్రియుడిగా, 'మేవరిక్'లో గ్యాంబ్లర్‌గా, క్రైమ్ థ్రిల్లర్ 'రాన్సమ్'లో మల్టీమిలియనీర్‌గా, పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ 'కాన్స్పిరసీ థియరీ'లో టాక్సీ డ్రైవర్‌గా, నియో నాయిర్ క్రైమ్ చిత్రం 'పేబ్యాక్'లో గ్యాంగ్‌స్టర్‌గా, 'ది పేట్రాయిట్'లో యుద్ధ వీరుడిగా, 'వాట్ ఉమెన్ వాంట్'లో లవర్ బాయ్‌గా, 'వి వర్ సోల్జర్స్'లో లెఫ్టినెంట్ కల్నల్‌గా, యుద్ధ వీరుడిగా మంత్రముగ్ధుల్ని చేశారు. ఇక హర్రర్ ప్రధాన చిత్రం 'సైన్'లో విభిన్న పాత్రలో భయపెట్టించారు. అంతేకాదు మ్యూజికల్ కామెడీ 'ది సింగింగ్ డిటెక్టివ్'లో డాక్టర్‌గా మెప్పించారు. ఇలా 45కుపైగా చిత్రాల్లో నటుడిగా, ఆరు చిత్రాల్లో గెస్ట్ రోల్స్ చేశారు.

మీరొద్దన్నా మేం వినం!

బడుల్లో యథేచ్ఛగా గైడ్ల వినియోగం

- విద్యాశాఖ వద్దని ఆదేశించినా పట్టించుకోని వైనం
- 'సీసీఈ' అమలులో అధికారుల తీవ్ర అలసత్వం

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్


"సమగ్ర మూల్యాంకన విధానం(సీసీఈ)లో స్టడీమెటీరియల్, గైడ్లతో పాటు ఎలాంటి ప్రింటింగ్ మెటీరియల్ వినియోగించరాదు. పాఠశాలల్లో వీటిని వినియోగిస్తే టీచర్లు, ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకుంటాం..." ఇవీ నాలుగేండ్ల నుంచి పాఠశాల విద్యాశాఖాధికారులు డీఈఓలు, ఎంఈఓలకు ఇస్తున్న ఆదేశాలు. కానీ ఆదేశాలు ఎక్కడా అమలు కావడం లేదు. ఈ ఏడాది ఏకంగా పలు జిల్లాల్లో డీఈఓలే స్టడీ మెటీరియల్స్ తయారు చేయించి, పదోతరగతి విద్యార్థులకు అందించడం గమనార్హం. ఈ నేపథ్యంలో మరోసారి పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రింటింగ్ మెటీరియల్ ఉపయోగించొద్దని ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్రంలోని 2014-15 విద్యాసంవత్సరం నుంచి పాఠశాలల్లో సీసీఈ విధానం అమలు చేస్తున్నారు. ఈ విధానం ప్రకారం పాఠ్యపుస్తకాల్లో ఉన్న ఏఒక్క ప్రశ్న పరీక్షల్లో రాదు. కాబట్టి విద్యార్థులు ఉపాధ్యాయుల బోధన, పాఠ్యపుస్తకాల పఠనం ద్వారా అర్థమైన అంశాల ఆధారంగానే ప్రశ్నలకు జవాబులు రాయాల్సి ఉంటుంది. ఇది మంచి ఆలోచన విధానమే. కానీ దీని అమలులో కొన్ని లోపాలున్నాయని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. ఈ విధానం అమలులోకి వచ్చి నాలుగేండ్లు అవుతున్నా ఇప్పటికీ ఈ విధానంపై ఉపాధ్యాయుల్లోనూ పూర్తిస్థాయి అవగాహన లేదు. గతేడాది ఈ విధానంపై నోడల్ ఆఫీసర్ల పరిశీలనలో వెల్లడికాగా, తాజాగా రాష్ట్ర మానిటరింగ్ బృందాల తనిఖీల్లోనూ ఇదే విషయం బహిర్గతమైంది. ఇప్పటికీ చాలా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో స్టడీ మెటీరియల్ వినియోగిస్తున్నట్టు గుర్తించి, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

ఈనెల 15నుంచి ప్రారంభం కానున్న పదోతరగతి పరీక్షలకు ఐదులక్షలకు పైగా విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు బడుల్లో స్టడీమెటీరియల్స్, గైడ్లు వినియోగిస్తున్నారు. సిద్దిపేట, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో డీఈఓలే నేరుగా స్టడీమెటీరియల్స్, నమూనా ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. వద్దని నాలుగేండ్ల నుంచి పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసినా, ఉపాధ్యాయులు,హెచ్ఎంలే కాదు..ఏకంగా డీఈఓలూ వాటిని అమలు చేయడం లేదు. అయితే కలెక్టర్ల ఆదేశాల మేరకే స్టడీమెటీరియల్ తయారు చేయించి ఇచ్చినట్టు అధికారులు చెబుతుండటం గమనార్హం. సర్కారు బడులు, హాస్టళ్లతో పాటు ప్రయివేటు పాఠశాలల్లోనూ స్టడీమెటీరియల్, గైడ్లు వినియోగిస్తున్నారు. ఒకటోతరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకూ స్టడీమెటీరియల్స్ వినియోగిస్తుండటం గమనార్హం. సీసీఈ విధానంపై ఇంకా ఉపాధ్యాయుల్లోనూ అవగాహన పెంచాలనీ, దీని అమలుపై ఉపాధ్యాయసంఘాల అభిప్రాయాలనూ సేకరించాలని ఇటీవల రాష్ట్ర మానిటరింగ్ కమిటీ తన నివేదికలో పేర్కొన్నది.

స్టడీ మెటిరియల్స్ వినియోగిస్తే చర్యలు: కిషన్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్

కొన్ని జిల్లాల్లో పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ వినియోగిస్తున్నట్టు మాదృష్టికి వచ్చింది. సీసీఈ విధానంలో ఇలాంటి పనులు నిషేధం. పలు జిల్లాల్లో కలెక్టర్ల ఆదేశాల మేరకు మెటిరియల్ రూపొం దించినట్టు సమాచారముంది. కలెక్టర్లకూ లేఖలు రాశాం. స్టడీమెటిరియల్ వినియోగించడం అంటే విద్యార్థుల ఆలోచన శక్తిని తగ్గించడమే. దీన్ని సీరియస్‌గా పరిగణిస్తు న్నాం. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం తరగతులు నిర్వహించాలని ఆదేశాలిచ్చాం. గైడ్లు, స్టడీమెటిరియల్ వినియోగిస్తే చర్యలు తప్పవు.



తెలంగాణ ప్రజల పార్టీ ఆవిర్భావం

(మొదటిపేజీ తరువాయి)

సభలో పార్టీ పేరు, జెండా, రాష్ట్ర కార్యవర్గాన్ని జస్టిస్ చంద్రకుమార్ ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులుగా బి చంద్రకుమార్, ఉపాధ్యక్షులుగా వేద వికాస్, సుతారి లచ్చన్న, ముప్పారపు ప్రకాశ్, మోహన్‌రాజ్, రవీంద, సెక్రటరీ జనరల్‌గా డాక్టర్ టీవీ రామనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ డి సాంబశివగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏలేశ్వరం వెంకటేశ్, జైరాజ్, డి భద్రయ్య, సురేశ్‌బాబు, రవీందర్, జాయింట్ సెక్రటరీగా ఎ సందీప్‌కుమార్, పుట్టయ్య, రాజన్న, ఎండీ ఆహ్మద్, స్వామి, కోశాధికారిగా రఘు ఎంపికయ్యారు. మహిళా విభాగం ప్రతినిధులుగా ఆత్మీయ నిర్మల, జి స్వర్ణ, కృష్ణవేణి, విద్యార్థివిభాగం ప్రతినిధిగా నల్లగొండ అంజి, యువజన విభాగం ప్రతినిధులుగా సూరజ్‌గౌడ్, వాసుకోట్ల, ఎర్రకృష్ణ, బోడ లక్ష్మణ్ , భద్రునాయక్, రాకేశ్ ఎన్నికయ్యారు. రైతువిభాగం ఏసీరెడ్డి, రామకృష్ణ, మైనార్టీ విభాగం కేపీ రహమాన్, మీడియా విభాగం వేణుమాధవ్ పేర్లను చంద్రకుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ...ప్రతి పేదవాడి ముఖంపై చిరునవ్వు చూడాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటీ చేస్తామని చెప్పారు.ఈసమావేశంలో సాంబశివగౌడ్, ప్రొఫెసర్ తిరుమలి, సీహెచ్ ప్రభాకర్, జేబీరాజు, ప్రొఫసర్ ఈశ్వరయ్య మాట్లాడారు.

టీఆర్టీకి 2,42,332 మంది హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) రాతపరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. టీఆర్టీకి 2,71,459 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 2,42,332 (89.27 శాతం) మంది అభ్యర్థులు రాతపరీక్షలకు హాజరయ్యారు. గతనెల 24న టీఆర్టీ రాతపరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈనెల 4వ తేదీ వరకు టీఆర్టీ రాతపరీక్షలు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) రాతపరీక్షలను ప్రశాంతంగా నిర్వహించింది. 16 విడతల్లో రాతపరీక్షలు జరిగాయి. ఇందులో 13 విడతల్లో జరిగిన రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో, మిగిలిన మూడు విడతలు ఎస్జీటీ తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమం, స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్, మ్యాథ్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్టులు) తెలుగు మాధ్యమం అభ్యర్థుల రాతపరీక్షలు ఆఫ్‌లైన్ (ఓఎంఆర్) పద్ధతిలో జరిగాయి. హాల్‌టికెట్లలో కొంత గందరగోళం జరిగింది. అభ్యర్థులకు ఆన్‌లైన్ పద్ధతి పట్ల పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల కొన్ని తప్పులు చోటుచేసుకున్నాయి. మీడియం, సబ్జెక్టు, మార్కులు, పేర్లు వంటి తప్పులు, పర్సెంటేజీ కారణంగా పలువురు అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. గతనెల 24న ఉదయం భాషాపండితులు (తెలుగు)తో టీఆర్టీ రాతపరీక్షలు ప్రారంభ మయ్యాయి. చివరిరోజు ఆదివారం ఉదయం స్కూల్ అసిస్టెంట్ (బయలా జికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్ స్టడీస్) తెలుగు మీడియం అభ్యర్థులకు, మధ్యాహ్నం పీఈటీ ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులకు రాతపరీక్షలు జరిగాయి. పాత పది జిల్లాల ప్రకారం 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 2017, అక్టోబర్ 21న నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే.

చివరిరోజు 87,211 మంది హాజరు

టీఆర్టీ రాతపరీక్షలకు చివరి రోజు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా భారీగా హాజరయ్యారు. చివరిరోజు రాతపరీక్షలకు 1,01,268 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 87,211 మంది అభ్యర్థులు హాజరయ్యారని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పాత పదిజిల్లాల పరిధిలో 205 కేంద్రాల్లో జరిగిన స్కూల్ అసిస్టెంట్ (బయలాజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, సోషల్ స్టడీస్) తెలుగు మీడియం పరీక్షకు 1,00,417 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే, 86,657 (89.18 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం హెచ్ఎండీఏ పరిధిలో జరిగిన పీఈటీ ఇంగ్లీష్ మీడియం పరీక్ష రాసేందుకు 851 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 554 మంది రాశారని తెలిపారు. ఉపాధ్యాయ రాతపరీక్షలు తొలిసారిగా తెలంగాణలో జరిగాయని పేర్కొన్నారు. అందులో ఆన్‌లైన్‌లో జరిగిన రాతపరీక్షలకు రికార్డుస్థాయిలో ఎక్కువ మంది అభ్యర్థులు హాజరుకావడం మంచి పరిణామమని తెలిపారు.

కరీంనగర్‌లో ఆలస్యంగా పరీక్ష ప్రారంభం

కరీంనగర్‌లో ప్రశ్నాపత్రం తెచ్చే ప్రభుత్వ వాహనం ప్రమాదానికి గురైంది. దీంతో అక్కడ కొన్ని కేంద్రాల్లో టీఆర్టీ రాతపరీక్ష ఆలస్యంగా ప్రారంభమైందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఎ వాణీప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ వాహనం ప్రమాదానికి గురైనా ఆ జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి పరీక్షను సమర్థవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తలేదని వెల్లడించారు. టీఆర్టీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో సమర్థంగా నిర్వహించినందుకు జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పరిశీలకులు, స్క్వాడ్‌లు ప్రత్యేకంగా కృషి చేశారని పేర్కొన్నారు.

మూఢత్వంతో నరబలికి యత్నం

నవతెలంగాణ-కాల్వశ్రీరాంపూర్

గుప్తనిధుల కోసం తవ్వకాలు మొదలెట్టారు...నరబలి ఇస్తే నిధి దొరుకుతుందన్న మూఢత్వంతో ఓ యువకుడికి మాయమాటలు చెప్పి తవ్వకాల జరిపే చోటుకు తీసుకెళ్లారు.. ఆ యువకుడు నరబలి మాటలు విని వారి నుంచి తప్పించుకున్నాడు. గ్రామంలోకి వెళ్లి అక్కడ జరుగుతున్న తతంగాన్ని గ్రామస్తులకు చెప్పాడు. గ్రామస్తులంతా వెళ్లి గుప్తనిధులను తవ్వుతున్న వారిని చితకబాదారు. పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన పెద్దపల్లి కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేటలో ఆదివారం జరిగింది.

గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన గోళి ప్రేమ్‌కుమార్‌రెడ్డి(40), పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన చలిగంటి రాజెల్లు(26), కిష్టంపేట గ్రామానికి చెందదిన సాదర్ల రవి(35) కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు కిష్టంపేట గ్రామ శివారు మానేరు నది సమీపంలోని సుంకరికోట గుట్టల్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపేందుకు శనివారం రాత్రి వెళ్లారు. తవ్వకాలు ప్రారంభించారు. మధ్యలో నరబలి చేస్తే గుప్త నిధులు త్వరగా దొరకుతాయని భావించారు. దీంతో నరబలికి ఎవరినైనా తీసుకురావాలని బైకులపై ఊర్లోకి బయలుదేరారు. కిష్టంపేట గ్రామంలోని గాదర్ల రమేష్ వద్దకెచ్చి వ్యవసాయ విద్యుత్ మోటర్లకు పైపులు బిగించాలని నమ్మించారు. ఇదే గ్రామానికి చెందిన సాదర్ల రవి ఉండటంతో అతను నమ్మి వారితో బైక్‌పై వెళ్లాడు. గుట్టలోని గుప్త నిధుల తవ్వకాల ప్రదేశానికి చేరేందుకు కొంతదూరం నడిచి వెళ్లారు.

గుప్తనిధుల సొరంగం సమీపంలో రమేష్‌ను ఉంచి కొంత దూరంలో మద్యం సేవించడం మొదలు పెట్టారు. ఆ సమయంలో సొరంగం వద్ద నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఉండటాన్ని రమేష్ గమనించాడు. వారి మాటల్లో నరబలి ప్రస్తావన రావటంతో అనుమానంతో ఇదేదో మాయలా ఉందని, తనను చంపుతారని రమేష్ భయపడ్డాడు. వారి నుంచి తప్పించుకుని గ్రామంలోకి పరిగెత్తాడు. జరిగిన ఘటనను గ్రామస్తులకు వివరించాడు. వెంటనే గ్రామస్తులు తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి వెళ్లారు. ముఠా సభ్యులను తీసుకొచ్చి ఊరిలో చెట్టుకు కట్టేసి చితకబాదారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గుప్తనిధుల తవ్వకాలు చేపట్టిన ముగ్గురనీ విచారిస్తున్నారు. అయితే సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రేమ్‌కుమార్‌రెడ్డికి, కాల్వశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన వారికి సంబంధం ఎక్కడిది? గుప్త నిధుల తవ్వకాల వెనుక ఇంకా ఎవరెవరున్నారు? ఇంతకు ముందు ఎక్కడైనా తవ్వకాలు జరిపారా? అన్న కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ షేక్ జాన్‌పాషా తెలిపారు.

గ్రేహౌండ్స్‌కు చిక్కిన మావోయిస్టు అగ్రనేత

- హరిభూషణ్ ల్యాప్‌టాప్, మరో మూడు సెల్‌ఫోన్‌లు
- పరిశోధిస్తున్న సైబర్‌క్రైమ్ విభాగం

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

మావోయిస్టు రాష్ట్ర కమిటీ కార్యదర్శి హరిభూషణ్ ఎలియాస్ వేప నారాయణకు చెందిన చెందిన రహస్య ల్యాప్‌టాప్ గ్రేహౌండ్స్ పోలీసులకు చిక్కింది. అలాగే ఎన్‌కౌంటర్ జరిగిన ఘటనా స్థలంలోనే మరో మూడు సెల్‌ఫోన్లు కూడా సాయుధ పోలీసులకు చిక్కినట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం భద్రాద్రి కొత్తగుడెం జిల్లాకు సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఉసురు పోలీసు స్టేషన్ పరిధజలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో పది మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మరో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సైతం మృతి చెందాడు. కాగా ఘటనా స్థలం నుంచి మారణాయుధ్ధాలు, క్లైమోర్‌మైన్‌లు ఇతర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్న గ్రేహౌండ్స్ దళాలకు ఒక ట్యాప్‌టాప్‌తో పాటు మరో మూడు సెల్‌ఫోన్‌లు కూడా లభించినట్టు తెలిసింది. వాటిని స్వాధీనం చేసుకున్న ఎస్ఐబీ అధికారులు ల్యాప్‌టాప్‌ను సైబర్‌క్రైమ్ విభ్యాగం అధజకారులతో పరిశోధన చేయిస్తున్నారని తెలిసింది. మావోయిస్టరాష్ట్ర కార్యదర్శి హరిభూషణ్ టార్గెట్‌గా కూంబింగ్ ఆపరేషన్ జరిపిన గ్రేహౌండ్స్‌కు లభించిన ల్యాప్‌టాప్ అగ్రనేత దేనని అనుమానిస్తున్నారు. ఆ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచిన పోలీసు ఉన్నతాధికారులు ల్యాప్‌టాప్‌లోని సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. అదే సమయంలో లభించిన మూడు సెల్‌ఫోన్‌లు ఎవరివి , అందులో ఉన్న నంబర్లు ఎవరివి, వాళ్లంతా ఎవరు, అందులో ఏమైనా మెసేజ్‌లు ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నదని తెలిసింది. ఇందులో లభించే కీలక సమాచారం ఆధారంగా ఘటనా స్థలం నుంచి పారిపోయినట్టుగా అనుమానిస్తున్న హరిభూషణ్ మరి కొందరు నాయకుల రహస్యసమాచారాన్ని ఎస్ఐబీ అధికారులు సేకరించనున్నారని తెలిసింది. అయితే ఈ ల్యాప్‌టాప్ హరిభూషణ్‌ది అని అనుమానిస్తున్న అధికారులకు దానిలోని పాస్‌వర్డ్‌ను డికోడ్ చేసి తెరిస్తేనే గాని పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీఉ వర్గాలు తెలిపాయి.

ఇది ప్రజాస్వామ్యమేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఏండ్ల తర్వాత కూడా దేశంలో రైతు ఆత్మహత్యలా? అని ప్రశ్నించారు. 'దేశంలో అందరి జీతాలు పెరుగుతాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయి. కానీ రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర మాత్రం పెరగదు' అన్నారు. చిల్లర..మల్లర రాజకీయాలతో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నాటకాలడుతున్నాయని మండిపడ్డారు. ఈ నాలుగేండ్లలో బీజేపీ ప్రభుత్వం ఒక్క పనైనా చేసిందా? అని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీలు ఏది తెగదన్నారు.

రాజకీయ లబ్ది కోసమే..

జాతీయ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కూడా ఢిల్లీలో డబ్బులు వేసే ప్రజాస్వామ్యం మనది. విద్య, వైద్యం, వ్యవసాయం విధానాలను రాష్ట్రాలకు అప్పగించాలి. అర్బన్ డెవలప్‌మెంట్ రాష్ట్రాలకు అప్పగించాలి. ఢిల్లీలో పెత్తనం పెట్టుకుని రాజకీయ లబ్ది కోసం పాకులాడుతున్నారని విమర్శించారు.

రాజకీయాలతో ఆటలు

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రాజకీయాలతో ఆటలాడుతున్నాయే తప్ప వాస్తవాల ఆధారంగా పని చేయడం లేదని కేసీఆర్ విమర్శించారు. ఒక్కసారి మనం ఆలోచిస్తే, దేశంలో రైతు ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించారు. 'దేశంలో 70 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉన్నాయి. వాటాలు తేల్చరు. 14 ఏండ్లు అవుతున్నా బ్రిజేష్ ట్రిబ్యునల్ కృష్ణా గోదావరి నదీ జలాల లెక్కలు తేల్చలేదు. లెక్కల్లేవా? గేజ్‌లు లేవా?' అని ప్రశ్నించారు. హిమాలయాల అవతల ఉన్న చైనా, అమెరికా, జపాన్, సింగపూర్ లాంటి అభివృద్ధిలో దూసుకెళ్లుతుంటే...మన దేశ పరిస్థితి అథోగతిపాలవుతుందన్నారు. కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేశామని, బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేండ్లలో ఎవరికేం జరిగిందని ప్రశ్నించారు. 'బీజేపీ మీద కోపమొస్తే కాంగ్రెసోళ్లు వస్తారు. కాంగ్రెసోళ్ల మీద కోపమొస్తే బీజేపోళ్లు వస్తారు ఎవరొచ్చినా ప్రజలకు ఒరిగిందేమీ లేదు' అన్నారు. దేశంలో నిజమైన ఫెడరలిజం రావాలంటే నాన్ కాంగ్రెస్, నాన్ బీజేపీ కూటమి ఏర్పాటు కావాలన్నారు.

అప్పుడే దేశంలో గుణాత్మక మార్పు వస్తోందన్నారు. రాష్ట్రాలకు అధికారాలు అప్పజెప్పి లిమిటెడ్ అధికారాలు కేంద్రం వద్ద ఉంటేనే దేశం బాగుపడుతుందని వివరించారు. పది లక్షల కిలో మీటర్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుందని, తెలంగాణలో ప్రారంభమైన ఈ ప్రస్థానం యావద్దేశం చుట్టుముడుతుందని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

విభజన హామీలు తేల్చండి...

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. ఇదే విషయంపై మోడీ సర్కారును నిలదీయాలని విపక్షాలు సిద్ధమయ్యాయి. గతంలో విజయ్‌మాల్యా ఇలాంటి ఆర్థికమోసాలకు పాల్పడి విదేశాలకు వెళ్లిపోగా.. ఇటీవల నీరవ్‌మోడీ దేశం దాటారు. కేంద్ర ప్రభుత్వ ఉదాసీన వైఖరి వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. కాగా యూపీయే హయాంలోనే పీఎన్‌బీ స్కాం మొదలైందని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ వేదికగా ఈ విషయంలో వాగ్వాదం, వాదోపవాదం జరిగే అవకాశముంది. ఇక మోడీ సర్కారు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న త్రిపుల్ తలాక్ బిల్లును సైతం ఈ సమావేశాల్లో ఆమోదించుకోవాలన్న పట్టుదలతో ఉంది. దీంతోపాటు ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పిస్తూ ప్రవేశపట్టిన ఓబీసీ బిల్లు సైతం ప్రభుత్వ అజెండాలో ఉంది. దీంతోపాటు మొదటి విడత సమావేశాల్లో జైట్లీ ప్రవేశపెట్టిన వార్షికబడ్జెట్‌పై పార్లమెంట్ చర్చించి ఆమోదించనుంది.

విభజన హామీలపై తెలుగు రాష్ట్రాల పోరు...

'అంశాలవారి మద్దతు' అంటూ కొన్ని సంవత్సరాలుగా కేంద్రానికి అండగా నిలుస్తున్న టీఆర్ఎస్ సైతం ఈసారి పోరాట బాట ఎంచుకుంది. విభజన హామీలతో పాటు రిజర్వేషన్ అంశంపై ఆ పార్టీ అధినేత కేసీఆర్ గుర్రుగా ఉన్నారు. పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఇప్పటికే పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. తమిళనాడు ఇతర రాష్ట్రాల మాదిరిగా రాష్ట్రంలోనూ రిజర్వేషన్ కోటా పెంచాలని టీఆర్ఎస్ పట్టుబడుతోంది. అయితే గతంలోనూ విభజన హామీలపై పోరు చేస్తామని ప్రకటించిన టీఆర్ఎస్.. తీరా సమావేశాలు ప్రారంభమయ్యాక ఆ పార్టీ ఎంపీలు మౌనమే తమ సమాధానంగా వ్యవహరించారు. ఈసారి ఏ వైఖరి అవలంబించనున్నారో మరి కొన్ని గంటలో తేలనుంది. ఇక గత సమావేశాల్లో బడ్జెట్‌లో అన్యాయం చేశారంటూ టీడీపీ ఉభయసభల్లో చేసిన ఆందోళనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. టీడీపీ ఎంపీలను సంతృప్తిపరిచేందుకు ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ఉభయసభల్లో ప్రకటనలు చేశారు. అయితే కేంద్రం సమాధానంపై టీడీపీ అసంతృప్తిగా ఉంది. మరోవైపు మార్చి 6వ తేదీన వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తారని ఇప్పటికే ఆ పార్టీ అధ్యక్షుడు జగన్ ప్రకటించారు.

ఒక్కరోజే ఏడుగురు రైతులు

(మొదటిపేజీ తరువాయి)

సాగు చేశాడు. అకాల వర్షాలతో పంట దెబ్బతింది. తెంపిన పత్తి కూడా నాణ్యత లేక ధర రాలేదు. మరోవైపు ఎకరాకు రూ.8వేల చొప్పున కౌలు చెల్లించాడు. పెట్టుబడి, కౌలు కోసం రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. బ్యాంకులోనూ అప్పుంది. అప్పులెలా తీర్చాలనే ఆందోళనతో శనివారం రాత్రి పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగి చనిపోయాడు. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. కేసు దర్యాప్తులో ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌కి చెందిన రాచకొండ మహేశ్(25) మూడేండ్లుగా మూడెకరాలతో పాటు ఎకరం కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది నాలుగెకరాల్లో పత్తి సాగుచేశాడు. దిగుబడి సరిగా రాలేదు. రూ.3లక్షలా 75 వేల అప్పుంది. అదే బాధతో మామిడితోటలో మహేష్ శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది. భూపాలపల్లి జిల్లాకు చెందిన కదుర్ల భద్రయ్య పదిహేనేండ్ల కింద కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం తనుగుల గ్రామపరిధిలోని శంబునిపల్లికి బతుకుదెరువు కోసం వలసొచ్చాడు. ఐదేండ్లుగా నాలుగెకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. పెట్టుబడి కోసం రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. అప్పుల బాధతో శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది. సైదాపూర్ మండలం ఘన్‌పూర్‌కి చెందిన తిప్పారపు బాలమ్మ (47) మూడెకరాల్లో పత్తి, వరి పంటలు సాగు చేసింది. వర్షాలు సరిగ్గా కురవక మూడేండ్ల నుంచి ఆశించిన మేర దిగుబడు రాలేదు. పెట్టుబడి కోసం సుమారు రూ. 3లక్షల అప్పు చేసింది. అప్పు తీర్చే మార్గంలేక తీవ్ర మనస్తాపానికి గురై శనివారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను హుజూరాబాద్ ప్రభుత్వా స్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం సాయంత్రం చనిపోయింది. కేసు దర్యాప్తులో ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం జిన్నుకుంట గ్రామానికి చెందిన ఎల్లస్వామి, పోలేరాములమ్మ(45) భార్యా భర్తలు. వారికి ఆరెకరాలుంది. నాలుగు నెలల కింద బోరేశారు. మూడెకరాల్లో పల్లీ, ఎకరంలో వరి సాగు చేశారు. పల్లీ పంట దిగుబడి సరిగా రాలేదు. మార్కెట్‌లో ధర కూడా లేదు. దీంతో రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలని వారం నుంచి రాములమ్మ చింతించింది. ఆదివారం తెల్లవారుజామున నీళ్లలో గుళికలు కలుపుకొని తాగింది. గమనించి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ చెందిన తిపిరెడ్డి మహిపాల్‌రెడ్డి (32) వికలాంగుడు. తన ఎకరంన్నరలో సాగుచేసుకుంటూ జీవిస్తున్నాడు. సాగులో నష్టం వచ్చి ఇటీవల భూమి అమ్మేశాడు. అయినా, మరో రెండు లక్షల అప్పు మిగిలింది. అప్పుల బెంగతో ఇంట్లో కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి ఇద్దరు కొడుకులు, కూతురు ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

విత్తనోత్పత్తి రాష్ట్రానికి 'విత్తన చట్టమేదీ'?

(మొదటిపేజీ తరువాయి)

రూ. 9,352 కోట్లు మాత్రమే ఇందులో విత్తన సబ్సిడీ, ఎరువులు సబ్సిడీ, పత్తి గింజలు, నూనెగింజలు, మొక్కజొన్నల పరిశోధన, ఉద్యోగుల వేతనాలకు మిళితమై ఉన్నాయి. ఉద్యోగుల విషయానికొస్తే 882 మంది వ్యవసాయ అధికారులు, 1112 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు, 30 జిల్లాలకు సంబంధించిన అధికారులు, సిబ్బందికి చెందిన వేతనాలు కూడా రూ. 9,352 కోట్ల నుంచే ఖర్చు చేయాల్సి ఉంది. వాస్తవంగా రాష్ట్రంలో కోటి 30 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వబోమని సీఎం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. ప్రతి ఏటా 250 మండలాలు కరువుకు గురవుతున్నాయి. స్థూలంగా ఏటా రూ.5వేల కోట్ల నష్టం వస్తున్నది. 2015 నుంచి 2020 వరకు రూ.1500 కోట్లు ఫైనాన్స్ కమిషన్ పరిహారం కింద కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. కేంద్రం ఇచ్చిన ఈ నిధులకు తోడు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 30 కోట్లను కలిపి పంట నష్టపోయిన రైతులకు ఇచ్చి ఆదుకోవాలి. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 20 వేల ఎకరాల్లో మొక్కజొన్న, పసుపు, మిరప పంట వేసిన రైతులకు రూ. 50 కోట్ల పంట నష్టం వాటిల్లింది. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా కేంద్రం 2015-16లో రూ. 791 కోట్లు విడుదల చేసింది. అయితే మంజూరు చేసిన వాటా కింద నిధులు విడుదల చేయకపోగా కేంద్రం విడుదల చేసిన రూ.791 కోట్లల్లో కేవలం రూ. 450 కోట్లు మాత్రమే ప్రభుత్వం పంపిణీ చేసింది. అంటే దాదాపు రూ.341 కోట్లను కేసీఆర్ ప్రభుత్వం తన ఖాతాలోకి మళ్లించుకుంది.

సంవత్సరం	బడ్జెట్	రుణమాఫీ	వాస్తవ ఖర్చు (కోట్లల్లో)
2014-15	5925	4159	1766
2015-16	6359	4086	2273
2016-17	6665	4250	2415
2017-18	5855	2957	2898
మొత్తం	24,804	15452	9352

గత సంవత్సరం బిజి-3 అనే అనుమతి లేని పత్తి విత్తనం విడుదల చేయడం వల్ల ఒక్కో ఎకరానికి రూ. 20వేల చొప్పున పత్తి రైతులు నష్టపోయారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇవే విత్తనాలు కొనుగోలు చేసిన పత్తి రైతులు నష్టపోతే వారిని ఆదుకోవడానికి అక్కడి ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కమిటీ నియమించింది. కేసులు నమోదు చేసింది. కంపెనీల లైసెన్స్‌లు రద్దు చేసింది. తెలంగాణలో మాత్రం సదరు విత్తన కంపెనీలపై కేసులు నమోదు చేయాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి చెప్పినా ఆచరణలో అమలు కాలేదు.

దీంతో విమర్శలు వెల్లువెత్తాయి.

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర రావడం లేదు. కందులు, వేరుశనగ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కేంద్రం కొనుగోలు చేయాలని రాష్ట్రం, రాష్ట్రం కొనుగోలు చేయాలని కేంద్రం అంటూ ఒకరిపై ఒకరు నెట్టేసుకొని బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. చెబుతుంది. కొనుగోల అంశం రాష్ట్ర పరిధిలోనిదని కేంద్రం చెబుతుంది. మొత్తంగా రైతులు నష్టపోతున్నారు. ఒక్కో క్వింటాలుకు రూ. 1800 నుంచి రూ. 2000 వరకు రైతులు నష్టపోయారు. మద్ధతు ధర రూ.5420 ఉంటే రూ. 3500కు మించి కొనుగోలు చేసే వారు లేరు. పెట్టుబడి పథకం కింద ఎకరానికి రూ. 4వేలు ఇస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులు నష్టపోయిన పంట పరిహారంలో పది శాతం కూడా కాదని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వినబడుతోందా?

(మొదటిపేజీ తరువాయి)

నిర్వీర్యం! భారతదేశంలోని నవజాత శిశువులు భవిష్యత్తులో 'మూగ-చెవిటి'గా మారే ప్రమాద మున్నట్టు కాక్లియర్ ఇండియా మరియు ఫస్ట్ మామ్స్ క్లబ్ సంస్థలు చేసిన సంయుక్త సర్వేలో వెల్లడవ్వడం ఆందోళనను కలుగజేస్తోంది. ఇక, అధ్యయనం ప్రకారం.. మన దేశంలో పుట్టే ప్రతి పదిమంది పిల్లల్లో కేవలం ముగ్గురు నవజాత శిశువులకు మాత్రమే వినికిడి పరీక్షలు సక్రమంగా జరుగుతు న్నాయని, మిగిలిన ఏడుమంది పిల్లలు ఈ పరీక్షలకు దూరంగా ఉంటున్నట్టు సర్వే పేర్కొంది. దేశంలోని సుమారు 84.1శాతం మంది తల్లులు తమబి డ్డలకు.. పుట్టిన వెంటనే, సదరు వైద్యులు వినికిడి పరీక్షలు జరుపుతున్నట్టు భావిస్తున్నారని.. ఐతే, దురదృష్టవశాత్తు అవి జరగడం లేదని, కేవలం 38.9శాతం మంది తల్లిదండ్రులు మాత్రమే తమ పిల్లలకు ఈ పరీక్షల గురించి శ్రద్ధగా వాకబు చేస్తూ.. పరీక్షలను కచ్చితంగా నిర్వహించేలా చేస్తున్నారని సర్వే ప్రతినిధులు తెలిపారు. భారతదేశంలో చాలా మంది పేరెంట్స్ కు పిల్లలకు వచ్చే వినికిడి సమస్యపై సరైన అవగాహన లేకపోవడం, వినికిడి పరీక్షలను ఎక్కడ, ఎవరి వద్ద చేయించాలనే విషయం కూడా తెలియకపోవడం విచారకరం. కాగా, గర్భవతిగా ఉన్న తల్లికి రుబెల్లా వైరల్ ఇన్ఫెక్షన్ సోకడం, బిడ్డ కడుపులో ఉన్నప్పుడు తల్లి తీసుకునే అమైనోగ్లైకోసైట్స్ వంటి మందుల మూలంగా, బర్త్ అనాక్సియా(బిడ్డ పుట్టగానే ఏడవకపోవడం), కామెర్లలో బిలురుబిన్ పాళ్లు ఎక్కువగా ఉండటం వంటి తదితర కారణాల మూలంగా పుట్టే పిల్లల్లో వినికిడి సమస్యలు తలెత్తే అవకాశముంటుందని వైద్యులు పేర్కొంటున్నారు.

46.6కోట్ల సౌండ్ ఇంజినీర్లు

2050 సంవత్సరంలోపు ప్రపంచ వ్యాప్తంగా సుమారు 90కోట్ల మంది వినికిడి సమస్యలతో బాధపడే అవకాశమున్నదని, ఐదేండ్ల కిందట 36కోట్లుగా ఉన్న ఈ సంఖ్య.. ప్రస్తుతం 46.6కోట్లుగా ఉన్నదని తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. కాగా, వినికిడి సమస్య బాధితుల్లో సుమారు 3.4కోట్ల మంది పసివారే కావడం గమనార్హం. మధుమేహం, అధిక రక్తపోటు, కిడ్నీ సమస్యలు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, తలకు దెబ్బ తగలటం, క్యానోమైసిన్, అమికాసిన్ వంటి అమైనోగ్లైకోజైడ్ రకం యాంటీబయాటిక్ మందులను 10 రోజులకు మించి వాడటం వంటి పలు సందర్భాలు, నగరీకరణ మూలంగా పెరుగుతోన్న రణగొణ ధ్వనులు వంటి కారణాల వల్ల పెద్దల్లో వినికిడి సమస్యలు ఎదురయ్యే ప్రమాదము న్నది. సాధ్యమైనంత వరకు పెద్ద శబ్దాలకు దూరంగా ఉండడం. కంపెనీ, పరిశ్రమలు, సినిమా హాళ్ళు, డీజే, క్లబ్బుల్లో పనిచేసే వారు, రోడ్ల మీద ఎక్కువగా తిరిగే వాళ్లు ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది. ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు, హఠాత్తుగా వచ్చే వినికిడి లోపాలు మందులతో సులభంగా నయమవుతాయి. వినికిడి సమస్యను గుర్తించడంలో అలసత్వం వహించి.. సకాలంలో వైద్యం తీసుకోకపో తే అది దీర్ఘకాలిక సమస్యగా మరింత జటిలం అవ్వొచ్చు. చెప్పేది వినబడుతుందా? జాగ్రత్త మరి..!

వినికిడి - కొన్ని అంశాలు

- నెలలు నిండకుండానే పుట్టే పిల్లల్లో, పుట్టిన బిడ్డను నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసీయూ) లో 48 గంటలకు పైగా ఉంచి చికిత్స చేసే సందర్భాల్లో.. నవజాత శిశువులకు వినికిడి లోపాలు రావొచ్చుట!
- 65 ఏండ్లు పైబడిన ప్రతీ ముగ్గురిలో ఒకరికి వినికిడి సమస్య ఉందని డబ్లూహెచ్ఓ రిపోర్ట్ సారాంశం.
- వినికిడి సమస్యను సరైన సమయంలో గుర్తించకపోవడం మూలంగా ఏటా ప్రపంచ దేశాల వివిధ రంగాల ఉత్పత్తిలో కలుగుతోన్న నష్టం విలువ 75వేల కోట్ల డాలర్లని అంచనా!
- అంతర్జాతీయ వినికిడి దినోత్సవం -2018 నినాదంగా "భవిష్యత్తును వినండి(హియర్ ది ఫ్యూచర్)" అంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది. ● కండక్టివ్ హియరింగ్ లాస్ (శబ్ద తరంగాలు చెవిని, చెవి లోపలి భాగాలను సరిగా చేరకుండా ఉండటం), సెన్సోరీ-న్యూరల్ డెఫ్‌నెస్(నరాలకు సంబంధిం చిన సమస్యలు) లను వినికిడి సమస్యకు ప్రధానమైన రెండు రకాలుగా నిపుణులు గుర్తించారు.

అమెరికా ట్రేడ్ వార్‌పై చైనా హెచ్చరిక

(మొదటిపేజీ తరువాయి)

(చైనా దిగుమతులు ఎక్కువయ్యాయి), దీనిని సవరించాలని, ట్రేడ్ వార్‌తో వాణిజ్యలోటును సరిదిద్దుతానని ట్రంప్ చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో ట్రంప్ చైనా పర్యటనలో 300 బోయింగ్ విమానాల్ని (250 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు) కొనుగోలు చేయడానికి ఇరుదేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. అలాగే అమెరికా నుంచి సోయాబీన్స్, బీఫ్, చమురు దిగుమతులుకు చైనా ఎలాంటి అభ్యంతరాలూ చెప్పటం లేదు. అంతేగాక తరుచూ ఎవరో ఒకరు దౌత్య ఉన్నతాధికారిని అమెరికాకు పంపుతూ చర్చలు జరుపుతూ, ట్రేడ్‌వార్ రాకుండా సాధ్యమైనన్ని ప్రయత్నాలు చైనా నాయకత్వం చేస్తోంది. అమెరికా-చైనా ద్వైపాక్షిక సంబంధాలు మొత్తం ప్రపంచానికే అత్యంత కీలకమైనవని, స్థిరమైన, అభివృద్ధితో కూడిన ద్వైపాక్షిక సంబంధాలు ఏర్పడటం ఈ రెండు దేశాలకేగాక...అంతర్జాతీయ సమాజానికీ అవసరమని అమెరికాలో చైనా రాయబారిగా పనిచేసిన ఝూంగ్ అభిప్రాయపడ్డారు. రాజకీయంగా, చారిత్రకంగా ఇరుదేశాల నేపథ్యం వేరైనప్పటికీ...గత 39 ఏండ్లుగా ఆర్థిక, వాణిజ్య సంబంధాలు కొనసాగుతున్నాయని, తద్వారా రెండు దేశాలూ లబ్దిపొందాయని ఆయన తెలిపారు.

ఆ బిల్లు జీవించే హక్కును హరించేది..

- 'ట్రాన్స్‌జెండర్ బిల్లు-2016'పై రౌండ్‌టేబుల్‌లో ప్రొఫెసర్ కంచ ఐలయ్య
- తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ట్రాన్స్‌జెండర్ల జీవించే హక్కును హరించేందుకే 'ట్రాన్స్‌జెండర్ బిల్-2016'ను కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోతున్నదని టీ మాస్ ఫోరం రాష్ట్ర చైర్మెన్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య హెచ్చరించారు. ప్రస్తుతమున్న బిల్లును యధావిధిగా ఆమోదింపజేసేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఈ ప్రయత్నాలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బిల్లును వ్యతిరేకిస్తూ తెలంగాణ ట్రాన్స్‌జండర్ పీపుల్స్ అసోసియేషన్, టీ మాస్ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఐలయ్య మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్లు బతుకుదెరువు కోసం భిక్షాటన చేస్తారని తెలిపారు. దాన్ని పూర్తిగా క్రిమినలైజ్ చేస్తూ ఆర్నెల్ల నుంచి రెండేండ్ల వరకు జైలు శిక్షను విధించే విధంగా బిల్లులో క్లాజును పొందుపరిచారని చెప్పారు. ఇది సమాజం ముందు వారిని మరింత నేరపూరితమైన వ్యక్తులుగా చిత్రీకరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి 2014లో సుప్రీంకోర్టు ఒక తీర్పును వెలువరించిందని గుర్తుచేశారు. అందుకు భిన్నంగా ఈ బిల్లును రూపొందించటం శోచనీయమని అన్నారు. ఇది మానవ హక్కులను ఉల్లంఘించటమే అవుతుందని చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ట్రాన్స్‌జెండర్ మోనా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తాము స్వయంగా ట్రాన్స్‌జెండర్లమని చెప్పుకుంటున్నామని.. ఇందుకు సంబంధించి స్వయం గుర్తింపు పత్రాన్ని ప్రభుత్వం కూడా అంగీకరిస్తున్నదని చెప్పారు.

ఇప్పుడు దీన్ని కాదని జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ నిర్వహించే పరీక్షలకు హాజరుకావాలంటూ ప్రభుత్వం నిర్దేశిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ట్రాన్స్‌జెండర్ వైజయంతి మాట్లాడుతూ.. పౌర హక్కుల సమాజం, ఇంటర్ సెక్స్ సమాజం, ట్రాన్స్ సముదాయంతో ప్రభుత్వం చర్చించటం ద్వారా వారి సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తద్వారా జెండర్ సమానతను ప్రతిబింబించేలా, అందరికీ ఆమోదయోగ్యకరమైన రీతిలో బిల్లును రూపొందించాలని కోరారు. సమావేశంలో ట్రాన్స్‌జెండర్లు రచన, చంద్రముఖి, నగ్మా, హెచ్‌సీయు విద్యార్థి అర్పిత తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రైవర్లపై కొరడా

- 10మంది తల్లిదండ్రులను జైలుకు పంపిన ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు

హైదరాబాద్: నిబంధనలు ఉల్లంఘిస్తూ మైనర్లు డ్రైవింగ్ చేయడంపై హైదరాబాద్‌లో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టు అసహనం వ్యక్త చేసింది. బైక్ నడిపేందుకు మైనర్లను ప్రోత్సహించిన 10మంది తల్లిదండ్రులకు ఒక్కరోజు జైలు శిక్ష విధించింది. మోటర్ వెహికల్ 180 యాక్ట్ కింద 500 రూపాయల జరిమానా విధించింది. మైనర్లు వాహనం నడపడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ డ్రైవింగ్ చేసిన 14 ఏండ్ల బాలుడిని ఒక్క రోజు జువైనల్ హోంకు తరలించాల్సిందిగా తీర్పునిచ్చింది. ఈ కేసుల న్నింటిలో వాహనాలను సీజ్ చేశారు. మైనర్ డ్రైవర్లు, తల్లిదండ్రులు ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సిందిగా సమన్లు జారీ చేసిన తర్వాత కేసులు విచారించింది. డ్రంకెన్ డ్రైవింగ్‌ను అరికట్టేందుకు చేస్తున్న క్యాంపెయిన్‌తోపాటు మైనర్ల డ్రైవింగ్(అండర్ ఏజ్ డ్రైవింగ్)ను అరికట్టే క్యాంపెయిన్ నగరంలో ఊపందుకున్న విషయం తెలిసిందే. గతేడాది మైనర్ల ప్రమేయం ఉన్న 130 యాక్సిడెంట్లు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాలలో చాలా వరకు బాధితులు తీవ్రంగా గాయపడగా, కొన్ని ప్రమాదాలలో మరణాలూ సంభవించాయి.

తెలుగబ్బాయి... జర్మనీ అమ్మాయి

- హైదరాబాద్ వేదికగా ఒక్కటైన ప్రేమజంట
- భారతీయత ఉట్టిపడేలా విదేశీయుల వేషధారణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మాజీ చైర్మెన్ ఎం జనార్ధన్‌రెడ్డి, అమరావతి దంపతుల కుమారుడు అభినవ్ వివాహం ఆదివారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగింది. తెలుగబ్బాయి అభినవ్, జర్మనీకి చెందిన అమ్మాయి బియాంకా హైదరాబాద్ వేదికగా ఒక్కటయ్యారు. ఐదేండ్లుగా వారిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. ఐదేండ్ల తర్వాత వారి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో ఆ ప్రేమజంట ఒక్కటైంది. వధువు తల్లి లొట్టె (రేడియాలజిస్ట్), తండ్రి ప్రొఫెసర్ రోఫె ఈ పెండ్లి వేడుకకు హాజరయ్యారు. వధువు బియాంకా ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసింది. ప్రస్తుతం సింగపూర్‌లో కేప్‌వెల్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. అభినవ్ సింగపూర్‌లోనే నాన్‌యాంగ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. సింగపూర్‌లో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా ఎనర్జీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. క్రీడలంటే ఇద్దరికీ అభిరుచి ఎక్కువ. సామాజిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. జర్మన్ డ్రాగన్ క్లబ్‌లో ఇద్దరూ సభ్యులు. ఆ క్లబ్ ద్వారా క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు సంరక్షణ కోసం పలు సేవా కార్యక్రమాలు చేపడతారు. పర్వతారోహణ కూడా వారి అభిరుచి. అభినవ్, బియాంకాల వివాహ వేడుకల్లో భారతీయత ఉట్టిపడింది. జర్మనీకి చెందిన దేశస్తులు భారతీయ సంప్రదాయంలో పెండ్లికి హాజరుకావడం అతిథులను ఆకర్షించింది. మహిళలు చీరకట్టులో, పురుషులు షెర్వానీ వేషధారణతో హాజరయ్యారు. తెలంగాణ జానపద పాటలకు స్థానికులతో కలిసి విదేశీయుల ఆట (కోలాటం) అందరినీ మంత్రముగ్ధులను చేసింది.

బీజేపీకి మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ రాజీనామా

నవతెలంగాణ - అంబర్‌పేట

బీజేపీకి మాజీ ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ రాజీనామా చేస్తున్నట్టు పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కు రాజీనామా పత్రాన్ని పంపించారు. దిలీప్ గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా, మాజీ మంత్రి మాధవరెడ్డి వద్ద సెక్రెటరీగా ఆరేండ్లు పనిచేశారు. 2004-07 వరకు టీఆర్ఎస్, కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పుడు సెక్రెటరీగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన ఈఎస్ఐ సెంట్రల్ బోర్డు మెంబర్‌గా ఉన్నారు. బీజేపీ సిద్ధాంతాలు నచ్చక రాజీనామా చేస్తున్నట్టు ఆయన మీడియాకు తెలియజేశారు. త్వరలోనే కోదండరాం ఏర్పాటు చేయబోయే పార్టీలో చేరనున్నట్టు విశ్వసనీయ సమాచారం.

వర్గీకరణతోనే అంతరాలకు పరిష్కారం

ప్రొఫెసర్ నాగేశ్వర్

- 13న బంద్‌కు మావోయిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు : వరవరరావు
- ఉమ్మడి రిజర్వేషన్ల విధానానికి కాలం చెల్లింది : మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ - సిటీబ్యూరో

'ఎస్సీ కులాల్లో అంతరాలున్నాయి. అందరినీ ఒకటిగా కలపడం సరైందికాదు. వర్గీకరణ ఉద్యమం మాలలకు వ్యతిరేకంగా కాకుండా రాజ్యాంగ విలువల పరిరక్షణ ఉద్యమంగా చూడాలి. వర్గీకరణతోనే ఎస్సీ సామాజిక తరగతుల్లోని అంతరాలకు పరిష్కారం లభిస్తుంది' అని మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు. 'ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమాన్ని బలపర్చుదాం-ఎమ్మార్పీఎస్, ప్రజా ఉద్యమాలపై రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుదాం' అనే అంశంపై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విప్లవ రచయితల సంఘం(విరసం) ఆధ్వర్యంలో సభ జరిగింది. 'ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ-రాజ్యాంగం-వివిధ కమిషన్లు' అనే అంశంపై నాగేశ్వర్ మాట్లాడుతూ.. అంటరానితనం, రిజర్వేషన్ల ప్రయోజనాలను సమానంగా అందుకోలేక పోవడం, ఎస్సీ కులాల్లో ఉన్న అంతరాల ప్రాతిపదిక ద్వారానే వర్గీకరణ ఉద్యమాన్ని బలపర్చాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 16(1) సమానత్వం గురించి చెబుతుంటే, ఆర్టికల్ 16(4) ఏదైనా ఒక వర్గం చాలినంతగా ప్రాతినిధ్యం లేకుంటే, అందుకు అవసరమైన నివారణా చర్యలు తీసుకునే హక్కు రాజ్యాంగం కల్పిస్తోందని వివరించారు. సమానత్వం అనే భావనను సాధించేందుకే రిజర్వేషన్లు అవసరమన్నారు. 'వర్గీకరణ ఉద్యమంపై రాజ్య నిర్బంధం' అనే అంశంపై విరసం వ్యవస్థాపక సభ్యులు వరవర రావు మాట్లాడుతూ..పార్లమెంటులో బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్న ఎమ్మార్పీఎస్‌పై ఎందుకు నిర్బంధం ప్రయోగిస్తున్నారని సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. మన రాష్ట్రంలోనూ తమిళనాడు తరహాలో రిజర్వేషన్లను పెంచాలన్నారు. అడవిని పెట్టుబడిగా ఆక్రమించుకోవడం కోసమే ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రభుత్వాలు ప్రజలపై యుద్ధం చేస్తున్నాయన్నారు. తాజా బూటకపు ఎన్‌కౌంటర్‌తో ఆపరేషన్ గ్రీన్‌హంట్ మూడో దశకు చేరుకుందన్నారు. ప్రజలపై జరుగుతున్న పెట్టుబడి దాడిని ఎదుర్కొనేది దళితులు, ఆదివాసీలు మాత్రమేనన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఏ ఒక్క రాజకీయ పార్టీ వ్యతిరేకించకున్నా, వర్గీకరణ ఎందుకు కావడం లేదని ప్రశ్నించారు. ఈనెల 13న జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర బంద్‌కు మావోయిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు వరవర రావు ప్రకటించారు. వర్గీకరణ ఉద్యమ నేపథ్యంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ 'నేను పుట్టకముందే ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు లోకూర్ కమిషన్ వేశారు. ఆ తర్వాత జస్టిస్ రామచందర్‌రావు, ఉషామెహ్రా కమిషన్లు వర్గీకరణ చేయాలని స్పష్టమైన నివేదికలు ఇచ్చినా... పలుకుబడి కలిగిన వర్గాలు అడ్డుపడుతున్నాయి' అని విమర్శించారు. రాజ్యాంగంలోని ఉమ్మడి రిజర్వేషన్ల విధానానికి కాలం చెల్లిందన్నారు. ఉమ్మడి రిజర్వేషన్లను పొందడంలో వ్యత్యాసాలు ఉన్నందున తక్షణమే రాజ్యాంగాన్ని సవరించి, ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలన్నారు.

సుప్రీంకోర్టు కొలీజియంపై వ్యాఖ్యలు చేసినందున జస్టిస్ కర్ణన్‌కు శిక్ష వేసి, అదే సుప్రీం కొలీజియంపై విమర్శలు చేసిన నలుగురు జడ్జీలను సంక్షోభం పేరుతో అగ్రకుల పాలకులు కాపాడుకున్నారని చెప్పారు. వర్గీకరణ అంబేద్కర్ దృక్పథానికి వ్యతిరేకం కాదని, దళితుల ఐక్యతను ఎక్కడా దెబ్బతీయలేదన్నారు. రాజకీయ పార్టీలు అవకాశవాదంగా వ్యవహరించడం వల్లే వర్గీకరణ జాప్యం అవుతుందన్నారు. రెండు సెషన్లుగా జరిగిన ఈ సభలో విరసం నగర కన్వీనర్ గీతాంజలి, విరసం రాష్ట్ర నాయకులు డాక్టర్ సి.ఖాసీం అధ్యక్షత వహించగా సీనియర్ విరసం సభ్యులు రత్నమాల, డాక్టర్ డి.ఉదయభాను, పాణి, జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజా కళా మండలి కళాకారులు పాటలు పాడారు.

పేదలకు ఇండ్లు కట్టివ్వని నీకు 150 గదుల భవనమెందుకు కేసీఆర్?

- అమరుల కుటుంబాలకు అన్యాయం.. ద్రోహులకు ఆశ్రయం
- రాష్ట్రాన్ని లూటి చేసి ఇక దేశంపై కన్ను
- వనపర్తి గర్జనలో ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రతినిధి/పెబ్బేరు

"పేదలకు ఇండ్లు కట్టివ్వలేని నీకు 150 గదుల భవనమెందుకు కేసీఆర్? అమరుల కుటుంబాలకు అన్యాయం చేసి ద్రోహులకు ఆశ్రయం కల్పించావు. ప్రజలంతా గమనిస్తున్నరు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే బట్టలూడదీసీ రాళ్లతో కొడతారు" అని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి అని ఘాటుగా వ్యాఖ్యానించారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే చిన్నారెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ సింహగర్జన సభ ఆదివారం జరిగింది. సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తెలంగాణను అప్పుల కుంపటిగా మార్చారని విమర్శించారు. రాష్ట్రాన్ని ముంచింది చాలదన్నట్టు దేశ సంపదను కొల్లగొట్టడానికే సీఎం కేసీఆర్ కేంద్ర రాజకీయాలపై మక్కువ చూపుతున్నారని విమర్శించారు. పేదలకు రెండు పడకల గదుల నిర్మాణం ఏమో కానీ తాను నిర్మించుకున్న 150 పడకల భవనంలో బాత్‌రూమ్‌కు కూడా బుల్లెట్‌ప్రూఫ్ అద్దాలు పెట్టుకుని తన రాచరికపు బుద్ధులను చూపెట్టారన్నారు. అమరుల కుటుంబాలను మరిచి..సతీష్‌కుమార్‌ను పెద్దల సభకు పంపడం సరిగాదన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడైన శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మకు ప్రభుత్వం చేసిన సహాయమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. బంగారు తెలంగాణ తెస్తానన్న కేసీఆర్ అప్పుల కుంపటిగా మార్చి తన కుటుంబానికి రూ.వేల కోట్ల సంపాదించుకున్నాడని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ మొదలు పెట్టిన ప్రాజెక్టులను అరకొర నిర్మాణం చేసి రూ.వేల కోట్లు కమీషన్ల పేర తీసుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. వనపర్తి నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జిగా ఉన్న నిరంజన్‌రెడ్డి కాసుల కక్కుర్తితో గంజిలో వ్యాపారుల దగ్గర కమీషన్లు తీసుకుంటూ చిల్లర పనులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సామాజిక న్యాయం తెస్తానన్న కేసీఆర్ మంత్రి వర్గంలో ఒక్క మహిళకు కూడా ఎందుకు చోటు కల్పించలేదని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో గెలవడానికి ఆరాటపడుతున్న నిరంజన్‌రెడ్డి నిర్వాకం మీద నిజనిర్ధారణ కమిటీ వేస్తే ఆయన బండారం బయటపడుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వ సమయంలో కేసీఆర్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం వల్లే తెలంగాణ ఉద్యమాన్ని మొదలు పెట్టాడని తెలిపారు. 2000లోనే వనపర్తి ఎమ్మెల్యే చిన్నారెడ్డి తెలంగాణలోని 42 మంది ఎమ్మెల్యేలతో వనపర్తిలో భారీ బహిరంగసభ ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. సోనియాగాంధీ బేగంపేట విమానాశ్రయంలో వినతిప్రతం ఇవ్వగా.. తెలంగాణ పట్ల ఆమె సానుకూలంగా స్పందించిందని వివరించారు. తెలంగాణ ఏర్పాటుకు చిన్నారెడ్డి మొదటి నుంచీ కృషి చేశారన్నారు. సోనియా రాష్ట్రాన్ని ఇచ్చిందే తప్పా ఇందులో కేసీఆర్ చేసిందేమి లేదన్నారు. చీటికిమాటికి కేసీఆర్ వ్యంగ్రస్త్రాలతో పరుషపదజాలంతో దుర్భషాలాడడాన్ని మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజుశ్రవణ్‌కుమార్, నాయకులు సతీష్‌మాదిగ, మాజీ ఎమ్మెల్యే వంశీకృష్ణ, కొల్లాపూర్ ఇన్‌చార్జి హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీడీ కార్మికుల గోడు పట్టని ప్రభుత్వాలు

- బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ



నవతెలంగాణ-నిజామాబాద్

దేశంలో 3 కోట్లు, రాష్ట్రంలో 7 లక్షల మంది బీడీ కార్మికులున్నా.. వారి గోడును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ అన్నారు. కార్మికులకు సంక్షేమం కోసం తీసుకొచ్చిన జీవో నెంబర్ 41ను యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి రద్దు చేశారని విమర్శించారు. ప్రస్తుతం తీసుకొచ్చిన జీవో నెంబర్ 81తో కనీస కూలి కూడా పడని పరిస్థితి ఉందన్నారు. నిజామాబాద్ సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యేశాల గంగాధర్ అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ రమ మాట్లాడుతూ... వర్ధి బీడీలను అరికట్టి కార్మికులందరికి పీఎఫ్ నెంబర్లు ఇవ్వాలని, నెలకు 20 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు నెలకు రూ. 18 వేల రూపాయలు వేతనం చెల్లించాలన్నారు. 50 ఏండ్లు నిండిన వారికి రిటైర్‌మెంట్ పెన్షన్ కింద నెలకు రూ. 5 వేలు, బీడీ ప్యాకర్లకు, బట్టీ, కార్మికులందరికీ జీవన భృతి కింద నెలకు వెయ్యి ఇవ్వాలని కోరారు. వ్యక్తిగతంగా ఇండ్లు నిర్మించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.1.50 లక్షలు చెల్లించాలని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల పిల్లలందరికీ స్కాలర్‌షిప్ ఇవ్వాలని కోరారు. సదస్సులో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిద్ధిరాములు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు, జిల్లా అధ్యక్షులు పి.వెంకటేశ్, బీడీ అండ్ సిగార్స్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నూర్జహాన్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కామ్రేడ్ ఠాను నాయక్ మ్యూజియం ఏర్పాటు చేయాలి

- మల్లు స్వరాజ్యం డిమాండ్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి గిరిజన అమరుడు కామ్రేడ్ ఠాను నాయక్ మ్యూజియం ఏర్పాటు చేయాలని, ట్యాంక్‌బండ్‌పైన విగ్రహం పెట్టాలని, మార్చి 20న అధికారికంగా వర్ధంతి సభలు నిర్వహించాలని తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సీపీఐ(ఎం) సీనియర్ నాయకురాలు మల్లు స్వరాజ్యం డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌వీకేలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం ధర్మనాయక్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. జనగామ జిల్లా దేవుర్పుల మండలం, ధర్మపురం గ్రామం పడమటి తండాల్లో పుట్టారని పేర్కొన్నారు. ఆనాడు రాజాకార్లు, దొరలు చేస్తున్న ఆగడాలను అరికట్టాలని చిన్నతనంలో తుపాకి పట్టి దళంలో చేరారని తెలిపారు.

ఆ కుటుంబం సంఘంలో చేరి పేదల ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేశారన్నారు. వెట్టి సాకిరి, దోపిడి, మహిళల పట్ల అరాచకాలను సహించేది లేదన్నారు. ఆరుగురు అన్నదమ్ములు సాయుధ పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. నైజాం మూకలైన బాబు దొరను మట్టుపెట్టిన వీరుడు ఠానునాయక్ అన్నారు. కుట్రపన్ని పట్టుకుని ఎండ్లబండికి కట్టేసి బండి నడుస్తుండగానే నైజాం మూకలు ఆయనను కాల్చి చంపారని చెప్పారు. తెలంగాణసాయుధ పోరాటంలో నాలుగువేల మంది అమరులయ్యారని, 10వేల ఎకరాల భూములు పేదలకు పంచారన్నారు. ఈ మహత్తర పోరాటంలో అసువులుబాసిన విప్లవపోరాట వీరుడు ఠాకు నాయక్ ప్రజల గుండెల్లో పది కాలాలపాటు చిరస్థాయిగా ఉండాలంటే...రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయన పేరిట మ్యూజియం, హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై విగ్రహం, వర్ధంతి సభను అధికారికంగా నిర్వహించాలని ఆమె కోరారు. గిరిజన సంఘం నాయకులు ఎం బాలునాయక్, కె శంకర్‌నాయక్, వి రాంకుమార్, కె భరత్‌నాయక్, కె క్రిష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

టెంట్లు లేనోళ్ల ఫ్రంట్లతో ఒరిగేదేం లేదు

- సీఎం వ్యాఖ్యలపై బీజేపీ ఎద్దేవా

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టెంట్లు లేనోళ్ల ఫ్రంట్లతో ప్రజలకు ఒరిగేదేం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్ ఎద్దేవా చేశారు. థర్డ్‌ఫ్రంట్ ఏర్పాటుపై సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన పై విధంగా స్పందించారు. రాష్ట్ర ప్రజలు టీఆర్ఎస్ పాలనతో విసిగిపోయి ఉన్నారని, ప్రత్యామ్నాయంగా వారు బీజేపీవైపు ఉన్నారనే విషయాన్ని కేసీఆర్ గుర్తించారని చెప్పుకొచ్చారు. ఆదివారంనాడిక్కడి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. నాలుగేండ్లలో సీఎం కేసీఆర్ ప్రజలకు చేసింది ఏమీ లేదని, కేంద్రప్రభుత్వం ఇచ్చిన నిధుల్ని సైతం పక్క తోవ పట్టించి, కాంట్రాక్టులు, కమిషన్లకే పరిమితమయ్యారని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు మోడీ భయం పట్టుకుందని, ఈశాన్య రాష్ట్రాల్లో బీజేపీ విజయాన్ని చూసి, ఇక్కడ కూడా అవే పునరావృతమౌతాయనే విషయం అయనకు అర్థమైందని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రకటకు మజ్లిస్ వంత పాడటం పెద్ద విచిత్రం ఏమీ కాదన్నారు. ఏపార్టీ అధికారంలో ఉంటే వారి పాట పాడే మజ్లిస్‌పార్టీ నుంచి అంతకు మించి ఏమీ ఆశించలేమన్నారు. ఆపార్టీకి ధైర్యం ఉంటే రాష్ట్రవ్యాప్తంగా తమ అభ్యర్థుల్ని పోటీలో పెట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజ్యాంగం పట్ల అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, గడీల రాజ్యం నుంచి తెలంగాణ ప్రజలు విముక్తి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ముస్లిం రిజర్వేషన్ల విషయంలో నేను కొట్టినట్టు చేస్తా... మీరు ఏడ్చినట్టు చేయండన్నట్టు సీఎం కేసీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లకు తావు లేదని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పారని, దీనిపై హైకోర్టు మొట్టి కాయలు వేసినా.. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ముస్లిం రిజర్వేషన్ల జపం చేస్తున్నారన్నారు. తమ తప్పుల్ని కప్పిపుచ్చుకునేందుకే ఆయన కేంద్రంపై నిందలు వేస్తున్నారని చెప్పారు. కేంద్రం అనేక పథకాల క్రింద ఇచ్చిన నిధులకు రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు చెప్పకుండా, రాష్ట్ర వాటా కల్పించకుండా, వాటిని నిర్వీర్యం చేశారన్నారు. గిరిజన యూనివర్సిటీ, ఎయిమ్స్ వంటి సంస్థల ఏర్పాటులో డీపీఆర్‌లు కూడా ఇవ్వకుండా... జాప్యం చేస్తూ... కేంద్రంపై నింద మోపుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నియంతృత్వాన్ని భరించలేని స్థితిలో ఉన్నారని, ఆవే పోకడలను ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తామనడమే థర్డ్‌ఫ్రంట్ లక్ష్యమని విమర్శించారు. ఇలాంటి ఫ్రంట్‌లు ఎన్ని వచ్చినా ప్రజలు బీజేపీ పక్షానే ఉంటారని, ఈ ఫ్రంట్‌ల భాగోతాన్ని దేశ ప్రజలు గతంలోనే చూసారని చెప్పుకొచ్చారు.

మోహన్‌రెడ్డి బినామీలకు ఐటీ నోటీసులు

- హైదరాబాద్‌లోని ఐటీ ఆఫీసుకు 8న రావాలని ఆదేశం
- నేటినుంచి ట్రయల్‌కు ప్రసాదరావు కేసు

నవతెలంగాణ-కరీంనగర్ టౌన్

అక్రమ ఫైనాన్స్ దందా ప్రధాన నిందితుడు, మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డికి సంబంధించిన 30 మంది బినామీలు ఆస్తుల పత్రాలతో ఈ నెల ఎనిమిదో తేదీన హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి స్వయంగా హాజరుకావాలని బినామీ నిరోధక చట్టం డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ నోటీసులు జారీ చేశారు. ఏడేండ్లుగా చెల్లించిన ఐటీ పన్ను, కుటుంబ సభ్యులపై ఆస్తుల వివరాలు తీసుకుని రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఐటీ సిబ్బంది స్వయంగా బినామీల ఇండ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చినట్టు సమాచారం.

మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డి బినామీలపై దృష్టిపెట్టి చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని 2017 జనవరిలో లోక్‌సత్తా ప్రధానమంత్రికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రధానమంత్రి కార్యాలయం నుండి ఐటీ, రాష్ట్ర హోంశాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ మోహన్‌రెడ్డికి సంబంధించిన 13 బినామీ అస్తులు రద్దు చేసింది. బాధితులకు తిరిగి ఆస్తులు లభించాయి. దీంతో బాధితుల్లో ఆశలు చిగురించాయి. ఐటీ శాఖ అధికారుల నోటీసులతో తమకు న్యాయం చేకూరుతుందనే ఆశాభావం నెలకొంది.

వెలుగులోకి హిస్టరీషీట్.. పీడీ యాక్ట్‌కు దారులు ?

మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డి క్రిమినల్ చర్యలపై నిఘా ఉంచాలని 2017 ఆగస్టు 8న కరీంనగర్ ఏసీపీ సస్పెక్టెడ్ హిస్టరీ షీట్‌ను వన్‌టౌన్ పోలీసులకు అందజేసింది. దీంతో అతనిపై మనీలాండరింగ్, తదితర కేసులు నమోదయ్యాయి. అతనిపై పీడీ యాక్టు నమోదు చేయాలని బాధితుల సంఘం, లోక్‌సత్తా పోరాడుతున్నాయి. ఈ క్రమంలోనే మోహన్‌రెడ్డిపై పీడీ యాక్ట్ పెట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది.

ట్రయల్‌కు ప్రసాదరావు కేసు

2015 అక్టోబర్‌లో కరీంనగర్‌లో కెన్‌క్రెస్ట్ విద్యాసంస్థల అధినేత ప్రసాదరావు ఆత్మహత్యతో అప్పటి ఏఎస్ఐ మోహన్‌రెడ్డి అక్రమ ఫైనాన్స్ దందా వెలుగులోకి వచ్చింది. ప్రసాదరావు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అతనిపై కేసు నమోదైంది. బాధితుల ఫిర్యాదుతో 50కిపైగా కేసులు నమోదయ్యాయి. ప్రసాదరావు కేసు సోమవారం నుంచి జిల్లా కోర్టులో ట్రయల్ జరగనుంది.



దీక్షలకు నాయకత్వం వహిస్తున్న జయ భాగ్యమ్మ

దివిటీల్లాంటి గొట్టిపాడు దళిత స్త్రీల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. వాళ్లు ఆ దళితవాడలో ఆత్మగౌరవ చైతన్యాన్ని ఉగ్గుపాలతో పెంచి పోషించిన తల్లులు. ఒక్కోసారి తాగుడుకి బానిసలైన మగవాళ్ల ప్రలోభాలకు లొంగిపోయినప్పటికీ వాళ్లు పిల్లల్ని క్రమశిక్షణతో పెంచడమే కాకుండా తాగుబోతు భర్తలకి బుద్ధి చెప్పిన ధీరులు. గ్రామంలో లైసెన్స్ వున్న మద్యం దుకాణాన్ని సైతం తమ పోరాటంతో మూయించగలిగిన కార్య సాధకులు వారు. జొన్నలగడ్డ జయ భాగ్యమ్మ ఆ దళిత వాడకు ఓ చుక్కాని వంటి వ్యక్తి. జయ భాగ్యమ్మ నాయకత్వంలోనే వారు సారా వ్యతిరేక ఉద్యమాన్ని విజయవంతంగా నడిపారు. దాడి సందర్భంగా దళిత స్త్రీలు చూపిస్తున్న ధైర్య సాహసాలు, వారి పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమైంది. గుంటూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ, ఆ తర్వాత ఫిబ్రవరి ఆరో తేదీ నుంచి జరుగుతున్న నిరాహార దీక్షలోనూ స్త్రీలే ప్రధాన పాత్ర వహిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. జయభాగ్యమ్మ నష్టపరిహారం, పునరావాసం కోసం ప్రభుత్వమిస్తానంటున్న సౌకర్యాల మీద మండిపడ్డారు. 'మీరు డబ్బులిస్తారని, రోడ్లు వేయిస్తారని మేము వాళ్లచేత దాడి చేయించుకోలేదు. మా ఆత్మ గౌరవ సమస్యని డబ్బుతో ముడిపెట్టొద్దు' అని ఆమె కోరుతున్నారు. దళిత పురుషుల్లో కొందర్ని కమ్మ కుల పెద్దలు తాగబోసి తమపైకి తగువుకి వుసిగొల్పి దీక్షా శిబిరాన్ని మూయించి తద్వారా తమ పోరాటం మీద నీరు చల్లాలని చూస్తున్నారనీ, తాము మాత్రం ఎంతో సంయమనంతో శిబిరాన్ని నడిపిస్తున్నామని జయ భాగ్యమ్మ చెప్పారు.

ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి

గొట్టిపాడులో దళిత స్త్రీల పోరాట స్ఫూర్తి

మాల, మాదిగ కులాలు కలిసి సుమారు వెయ్యి గడప వున్న పెద్ద గొట్టిపాడు దళితవాడ చైతన్యానికి మారు పేరు. వారు తమపై తరతరాలుగా రుద్దిన అంటరానితనాన్ని ధిక్కరించి ఆత్మగౌరవంతో జీవిస్తున్నారు. వున్న దాంట్లో తింటూ తెల్ల గుడ్డలేసుకుని తలెత్తి తిరుగుతున్నారు. గొట్టిపాడు మాల మాదిగ కుర్రోళ్లు ఒక్కొక్కరు ఒక చురకత్తి అనొచ్చు. ఎవరన్నా చులకనగా 'అరే, వొరే' అంటే వాళ్లకి నషాళానికంటుకుంటుంది. గ్రామంలోని పెత్తందారుల ఆగడాలను ప్రశ్నిస్తున్నారు. అర్హులైన వారికి వద్ధాప్య, వితంతు పింఛన్లు రాకపోతే అధికారులను నిలదీస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లింపు పైన ఆరా తీస్తున్నారు. 'నీరు-చెట్టు' పేరుతో మాదిగల చెరువుని కబ్జా చెయ్యడం పైన అధికార యంత్రాంగాన్ని ప్రశ్నిస్తూ జన్మభూమి కమిటీల పేరుతో కమ్మ దొరలు చేస్తున్న ఆగడాలను ఎండగడుతున్నారు. కమ్మ కులస్తులు కరెంటు పన్ను, ఇంటి పన్ను కట్టకుండా మాల మాదిగలు కట్టిన పన్ను డబ్బుతో తమ వీధుల్లో సిమెంట్ రోడ్లు వేసుకోవడాన్ని ప్రశ్నించారు. ఇంటికిద్దరు ముగ్గురు మొగపిల్లలుంటే అందరూ చదువుకుంటూ ఖర్చుల కోసం సెలవుల్లో పెయింటింగ్, ఆటో నడపడం, కరెంట్ పని, బేల్దారి పని వంటి మర్యాదకరమైన పనులన్నీ చేస్తారు. దాదాపు అందరికీ టూ వీలర్ బండ్లు, చేతిలో సెల్‌ఫోను వున్నాయి.

డిసెంబర్ 31 అర్ధరాత్రి నుంచి జనవరి ఒకటో తేదీ మధ్యాహ్నం వరకు కమ్మదొరలు మాల పల్లెపై దాడి చెయ్యడానికి ఆ దళితవాడ చైతన్యం, కమ్మ కుల పెత్తనాన్ని వారు అంగీకరించకపోవడమే అసలు కారణం. డిసెంబర్ 31 అర్ధరాత్రి మాల యువకులు బైకులపై వెళ్లి కమ్మ వీధుల్లో ఆడ పిల్లలు ముగ్గులు వేస్తుంటే అల్లరి చేశారనే నెపంతో వారిని కొట్టారు. మరసటి రోజు క్షవరం చేయించుకోడానికి మంగలి షాపుకెళ్లిన యువకుడిని చితకబాదారు. తర్వాత చర్చీకెళ్తున్న స్త్రీ, పురుషులపై దాడి చేశారు. అదేమని అడిగిన ఆడవాళ్లకు లుంగీలెత్తి చూపించి అసభ్యంగా ప్రవర్తించి ఆడవాళ్లని అవమానించే జుగుప్సాకరమైన బూతులు తిట్టి తిరిగి బాధితులపైనే పోలీసు కేసు పెట్టడం ఈ సంఘటనలో ప్రధాన అంశం.

అక్కడి బాధితుల కథనం ప్రకారం దళిత యువకులు కమ్మ వారి వీధుల్లోకే వెళ్లలేదు. వాళ్లు 'హేపీ న్యూ ఇయర్' అని కేరింతలు కొట్టుకుంటూ వెళ్లింది కమ్మ వారికీ మాల పల్లెకీ మధ్యన వుండే చాకలి కులస్తులు నివసించే రోడ్డు మీదకి. అక్కడ వారు ఏదో తగిలి కిందపడ్డారు, అక్కడ కమ్మ స్త్రీలు వుండే అవకాశమే లేదు. అయినప్పటికీ దళితుల ఎదుగుదలను ఓర్వలేని కమ్మ పెత్తందారులు ఏదో ఒక నెపంతో దాడికి పాల్పడడమే కాకుండా 'మాల మాదిగ నా కొడుకులకి బండ్లు కావాల్సి ఒచ్చినాయా? మీ ఆడోళ్లు పది రూపాయలిస్తే మా బండెక్కి ఎక్కడికి రమ్మన్నా ఒస్తారురా!' అని దుర్భాషలాడి దళితవాడను వల్లకాడు చేస్తామని, గొట్టిపాడుని మరో కారంచేడుని చేస్తామని హెచ్చరించారు. ఆధిపత్యవాదులు ముందుగానే పథకం ప్రకారం బయట నుంచి తెచ్చుకున్న కర్రలు, సీసాలు, కత్తులతో వారిని చితక బాదితే కొందరు దళిత యువకులు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరారు. దాడిలో వారి స్త్రీలు కూడా పాల్గొని దళితుల కండ్లల్లో కారం కొట్టడం ఇక్కడ గమనార్హం. ఆడపిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణతో 35 మంది దళిత యువకులపై 354 సెక్షన్ ప్రకారం నాన్-బెయిలబుల్ కేసు పెట్టారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుకు పోలీసు అధికారులు స్పందించిన తీరు నిందితులను వెనకేసుకొచ్చేవిధంగా వుంది. బాధితుల మీద నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి జైలుకి పంపి, అసలు ముద్దాయిలపైన బెయిలబుల్ సెక్షన్‌ల కింద నామమాత్రంగా కేసు పెట్టినట్టే పెట్టారు. ఇప్పుడు వారు బెయిల్‌పైన తిరిగొచ్చి గ్రామంలో స్వేచ్ఛగా తిరుగుతుంటే బాధితులకు బెయిల్ మీద విడుదలైనా, స్వేచ్ఛగా ఇంటికి రాలేక పొరుగూర్లలోనే తలదాచుకుంటున్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మహిళలు

దాడి అనంతరం గొట్టిపాడు దళితులపై రకరకాల వెలిని అమలు పరుస్తున్నారు. గ్రామంలోని కాఫీ హోటళ్లకు దళితులను రానివ్వకుండా, దళితవాడకు నీరు వదలనివ్వటం లేదు. దళితులను కూలి పనికి పిలవకుండా, గ్రామంలో వున్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే పిల్లల్ని రకరకాలుగా వేధింపులకు గురిస్తున్నారు. అసలు ముద్దాయిల్ని అరెస్ట్ చెయ్యకపోగా గ్రామంలో శాంతి భద్రతల పేరుతో 144వ సెక్షన్ విధించి ఇతర ప్రాంతాల వారిని, బాధితులకు అండగా వుండే ప్రజా సంఘాలవారిని అక్కడికి రాకుండా అడ్డుకున్నారు. గొట్టిపాడు దళితులు తమపై జరిగిన దాడికి బెదిరిపోకుండా ప్రతిఘటించడం వారి చైతన్యానికి చిహ్నం. అరెస్టులకు, వెలివేతలకు వారు భయపడడం లేదు.

తమపై జరిగిన దాడిలో ప్రధాన నిందితులను అరెస్ట్ చేయాలనీ, తమ వాడలో పోలీసు పికెట్ తొలగించాలనీ, తమపై అమలవుతున్న అప్రకటిత వెలిని నిషేధించి తమ పిల్లలు స్వేచ్ఛగా చదువుకునేలా శాంతియుత వాతావరణం కావాలని గొట్టిపాడు దళితులు గ్రామంలో రిలే నిరాహార దీక్షకు దిగారు. ఈ కార్యక్రమంలో స్త్రీలు క్రియాశీలకంగా పాల్గొంటున్నారు. తమపై దాడి సందర్భంగా లుంగీలు ఎత్తి తమ మర్మావయాల్ని చూపించిన కమ్మ పురుషులపైన, తమ కండ్లల్లో కారం చల్లిన కమ్మ స్త్రీలపైన చర్య తీసుకోకుండా అధికారులు నిందితులను కాపాడే విధంగా వ్యవహరిస్తున్నారని బాధిత స్త్రీలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక దివిటీల్లాంటి గొట్టిపాడు దళిత స్త్రీల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. వాళ్లు ఆ దళితవాడలో ఆత్మగౌరవ చైతన్యాన్ని వుగ్గుపాలతో పెంచి పోషించిన తల్లులు. ఒక్కోసారి తాగుడుకి బానిసలైన మగవాళ్ల ప్రలోభాలకు లొంగిపోయినప్పటికీ వాళ్లు పిల్లల్ని క్రమశిక్షణతో పెంచడమే కాకుండా తాగుబోతు భర్తలకి బుద్ధి చెప్పిన ధీరులు. గ్రామంలో లైసెన్స్ వున్న మద్యం దుకాణాన్ని సైతం తమ పోరాటంతో మూయించగలిగిన కార్య సాధకులు వారు. జొన్నలగడ్డ జయ భాగ్యమ్మ ఆ దళిత వాడకు ఓ చుక్కాని వంటి వ్యక్తి. జయ భాగ్యమ్మ నాయకత్వంలోనే వారు సారా వ్యతిరేక ఉద్యమాన్ని విజయవంతంగా నడిపారు. దాడి సందర్భంగా దళిత స్త్రీలు చూపిస్తున్న ధైర్య సాహసాలు, వారి పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమైంది. గుంటూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోనూ, ఆ తర్వాత ఫిబ్రవరి ఆరో తేదీ నుంచి జరుగుతున్న నిరాహార దీక్షలోనూ స్త్రీలే ప్రధాన పాత్ర వహిస్తూ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. జయభాగ్యమ్మ నష్టపరిహారం, పునరావాసం కోసం ప్రభుత్వమిస్తానంటున్న సౌకర్యాల మీద మండిపడ్డారు. 'మీరు డబ్బులిస్తారని, రోడ్లు వేయిస్తారని మేము వాళ్లచేత దాడి చేయించుకోలేదు. మా ఆత్మ గౌరవ సమస్యని డబ్బుతో ముడిపెట్టొద్దు' అని ఆమె కోరుతున్నారు. దళిత పురుషుల్లో కొందర్ని కమ్మ కుల పెద్దలు తాగబోసి తమపైకి తగువుకి వుసిగొల్పి దీక్షా శిబిరాన్ని మూయించి తద్వారా తమ పోరాటం మీద నీరు చల్లాలని చూస్తున్నారనీ, తాము మాత్రం ఎంతో సంయమనంతో శిబిరాన్ని నడిపిస్తున్నామని జయ భాగ్యమ్మ చెప్పారు.

ఖైర్లాంజి, లక్షింపేట, గరగపర్రు దళితులపై దాడుల సందర్భంలాగే గొట్టిపాడు దళిత ఉద్యమం విషయంలోనూ కులం, జెండర్ అనే భావనల మధ్య వుండే వైరుధ్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. ఈదేశంలో అనేకచోట్ల దళితులపై జరిగిన దాడుల్లో పెత్తందారీ కులాల స్త్రీలు ఒక్కసారైనా బాధిత స్త్రీల పక్కన నిలబడిన దాఖలాలు లేవు. ఖైర్లాంజి నుంచి గొట్టిపాడు దాకా ఆ విషయం స్పష్టంగానే కనిపిస్తున్నది. స్త్రీలకు కూడా కుల దురహంకారం పురుషుల్లాగే వుంటాయని ఆయా సంఘటనలు మనకి తెలియ చెప్పాయి. అయితే జయ భాగ్యమ్మ లాగా గతంలో దళిత స్త్రీలు కొందరు క్రియాశీలకంగా వున్నప్పటికీ వారిని నాయకులుగా గుర్తించడానికి దళిత పురుషులు అంగీకరించలేదు. జయ భాగ్యమ్మ చాలా కాలం నుంచి ఒక్కతే నిలబడి కొన్ని విజయాలు సాధించడం వలన ఇప్పుడామెని తమ నాయకురాలిగా వారు భావిస్తున్నారు. దళిత ఉద్యమంలో ఇదొక మంచి పరిణామంగా భావించవచ్చు. దళిత స్త్రీల భాగస్వామ్యంతోనే దళిత ఉద్యమం సవ్యంగా ముందుకెళ్తుంది.

గొట్టిపాడు దళిత స్త్రీలను చూస్తే 1920, 30వ దశకాలలో అంబేద్కర్ నడిపిన రాడికల్ ఉద్యమంలో పాల్గొన్న మహర్ స్త్రీలు జ్ఞాపకమొస్తారు. దళిత సమాజాన్ని అంతర్గతంగా సంస్కరించడానికి ఆయన దళిత స్త్రీలపైనే ఎక్కువగా ఆశ పెట్టుకున్నారు. వారాయన ఆశలు నెరవేర్చడమే కాక ఆయన సాగించిన ప్రజా ఉద్యమాలలో క్రియాశీలక భాగస్వాములవ్వడం చూస్తాం. గొట్టిపాడు దళిత పోరాట శిబిరాన్ని కూడా స్త్రీలు శక్తివంతంగా నడిపిస్తున్నారు. వారి పోరాట స్ఫూర్తికి జేజేలు...

సెల్ : 9440362433

ఇసుక దందాలో దళితులే సమిధలు..

అగ్రకులాలు దాడులు చేస్తే ఎస్సీ, ఎస్టీలపై కేసులు ● తాళ్లపల్లి, కార్వంగ కేసుల్లో బలిచేస్తున్న ఆధిపత్య కులాలు ● ఎమ్మెల్యేలు, పోలీసుల అండదండలు?

పరిపూర్ణం

ఇసుక దందాలో దళితులే సమిధలవుతున్నారు. అగ్రకులాల వారు వెనకబడిన తరగతులైన, ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అగ్రకులాల వారికి అధికారులు, స్థానిక నాయకులు అండదండలిస్తూ దళిత, గిరిజనుల మధ్య ఎడం పెంచుతున్నారు. దీంతో గ్రామాల్లో దళితులు మిగతా వారు ఘర్షణ పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం కార్వంగ, తాళ్లపల్లి, నడిగడ్డ గ్రామాల్లో ఇసుక వివాదంలో జరిగిన ఘటనలపై పెట్టిన కేసులు పరిశీలిస్తే దళితులపై వివక్ష బయటపడుతోంది.

తెలకపల్లి మండలం తాళ్లపల్లి, నడిగడ్డ, కార్వంగ గ్రామాల మధ్య చిన్న వాగు నుండి గత ఆరు నెలలుగా ఇసుకను తరలిస్తున్నారు. కొన్నాళ్లు కృష్ణానదికి ఉపనది అయిన దుందుబీ నది నుండి ఇసుకను తరలించారు. నడిగడ్డ, రఘుపత్తిపేట గ్రామస్తులు, రైతులు అడ్డుకోవడంతో ఇసుక తరలింపును నిలిపేశారు. అయినా... రాత్రి వేళల్లో ఇసుకను తరలిస్తున్నారు. చిన్నవాగులో వరదలు వచ్చి ఇసుక మేటలు వేసింది. ఇందులో సర్కారు భూములతో పాటు ప్రయివేటు భూముల్లోనూ ఇసుక మేటలు ఉన్నాయి. ఇది చూసిన ఇసుక మాఫియా వచ్చి ప్రయివేటు వ్యక్తుల దగ్గర ఉన్న భూములను లీజుకు తీసుకుని ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక ఎక్కడ తీసినా భూగర్భ జలాలు వట్టిపోతాయని సమీప రైతులు గతంలో ఆందోళన నిర్వహించారు. అయితే ఇసుక లేకుంటే కట్టడాలు ఎలా చేస్తారని అంటూ ఆర్‌డీవో సైతం మాఫియాకు మౌఖిక అదేశాలు ఇచ్చారు. దీంతో పట్టా భూములతోపాటు సర్కారు భూముల్లో ఉన్న ఇసుకను కూడా యథేచ్ఛగా తరలిస్తున్నారు.

ఇటీవల భూవివాదం తారస్థాయికి చేరుకుంది. ఉన్న పొలం నుండి ఇసుకను తరలిస్తున్నారని మరో ఇసుక మాఫియా అడ్డుకునేందుకు ఇసుక తరలిసున్న ప్రదేశం దగ్గరకు నడిగడ్డ గోవర్ధన్‌రెడ్డి, తాళ్లపల్లి రవీందర్‌రెడ్డి, సర్పంచు రాజేందర్‌రెడ్డి, తెలకపల్లి సింగిల్‌విండో అధ్యక్షులు భాస్కర్‌రెడ్డిలు వెళ్లారు. అప్పటికే అక్కడ ఉన్న మాజీ ఎంపీపీ బండ పర్వతాలు వచ్చి 'మా పొలంలో ఇసుకను తరలిస్తుంటే ఆపడానికి మీరెవరు' అంటూ రెడ్డి వర్గాన్ని నిలదీశారు. దీంతో ఇసుక తరలిస్తున్న ఓ దళితుడు స్వామి ట్రాక్టర్‌ను రెడ్డి వర్గం వారు ఆపాడు. కిందికి దించి ఆ దళితున్ని చితకబాదారు. అడ్డుచెప్పిన బీసీ నాయకుడు బండ పర్వతాలును కూడా కొట్టారు. వారు గాయాలతో ఆస్పత్రిలో చేరారు. దళితుడు స్వామి వెళ్లి 'అగ్రకులాల వాళ్లు నాపై దాడి చేశారు' అని కేసు పెట్టారు. వాస్తవంగా దళితుడిని కొట్టినందుకు భాస్కర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిపై స్వామి కేసు పెట్టారు. అయితే వీరంతా స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అనుచరులు. బండ పర్వతాలు టీఆర్‌ఎస్ పార్టీలోని వ్యక్తే. కానీ ఇతను బీసీ కావడం చేత ఎమ్మెల్యే అగ్రకులాల వారికే సహకరిస్తుంన్నాడని ఆరోపణలు వస్తున్నాయి. ఈ కేసులో



పెత్తందారుల దాడిలో గాయపడిన యువకులు



దళితుల భోజనాల్లో మన్నుపోసి చితకబాదిన ప్రదేశాన్ని చూపుతున్న బాధితుడు

ఏమాత్రం సంబంధం లేని నడిగడ్డ గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, తాళ్లపల్లికి చెందిన సుల్తాన్‌ల పేరుతో 11మందిపై కేసులు పెట్టించారు. బండ పర్వతాలు, రామస్వామి, గోళ్లరాజు, సిహ్మయ్య, భీరయ్య, వల్లపురెడ్డి, రాయపురెడ్డి, నరేందర్‌రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కౌంటర్ కేసు నమోదు చేయించారు. మొదట పెట్టిన కేసు నీరు గారాలంటే కౌంటర్ కేసు పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తోంది. మొదటి కేసు రాజీ పడితేనే రెండో కేసు వదలుకుంటారనే విధంగా పోలీసులు వ్యవహరించడం జిల్లాలో చర్చనీయాంశమైంది. ఈరెండు కేసుల్లో సంబంధం లేని దళితులను ఇరికించడం, దాడులు చేయడం దారుణమని పలు ప్రజాసంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి.

సెల్ :9490099324

దాడులు చేసిన వారిని ఆరెస్టు చేయాలి...

కార్వంగ దళితులపై అగ్రవర్ణాల దాడులు దారుణం. వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారిని అకారణంగా కొట్టడం అన్యాయం. ఈ విషయమై అధికారులు, పోలీసుల వైఖరి సరికాదు. దళితులు కేసులు పెట్టినా నిందితులను అరెస్టు చేయకపోవడం చూస్తుంటే కేసు నీరుగార్చే ప్రయత్నం చేస్నున్నట్టే అనిపిస్తుంది. స్థానిక ఎమ్మెల్యే అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తున్నారు. ఇప్పటికైనా దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలి. లేదంటే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.

-గోపాస్ లక్ష్మణ్, కేవీపీఎస్ నాయకులు, నాగర్‌కర్నూల్ జిల్లా

పరిస్థితులు చక్కదిద్దుతున్నాం...

ఇటీవల తాళ్లపల్లి, నడిగడ్డల మధ్య జరిగిన ఇసుక వివాదం పలు ఘర్షణలకు దారి తీసింది. ఇసుక అక్రమ తరలింపును మొదటి నుండి అడ్డుకుంటూనే ఉన్నాం. అయినా కొంత మంది అక్రమంగా తరలిస్తుండడం మా దృష్టికి వచ్చింది. ఎప్పటికప్పుడు దాడులుచేసి కేసులు నమోదుచేస్తున్నాం. ఈకేసుల్లో కూడా దోషులను శిక్షించి బాధితులకు న్యాయం చేస్తాం.

- ఎస్ఐ విజయ్‌భాస్కర్

ఆకలితో చచ్చినా కుల వృత్తి మారొద్దు!?

ఈరోజుల్లో కూడా కుల వ్యవస్థను సమర్థించే వాళ్లుండటం ఒక దురదృష్టం. సమర్ధించడం ఎన్నో రకాలు. అందులో ఒకటి కుల వ్యవస్థను శ్రమ విభజన (పనికి పంచుకునే) పద్ధతితో పోల్చడం. అన్ని నాగరిక సమాజాలలోను శ్రమ విభజన పద్ధతి అత్యావశ్యకంగా ఉంటున్నది. కనుక, అదే రకమైన కుల వ్యవస్థ మన సమాజంలో ఉండటం తప్పుకాదని ఈ వాదాన్ని సమర్ధించే వాళ్లు అంటున్నారు. ఈ వాదం వాస్తవ విరుద్ధం. కుల వ్యవస్థ శ్రమ విభజనే కాదు. అది శ్రామిక విభజన కూడా. నాగరిక సమాజానికి శ్రమ విభజన అవసరమే. అయితే శ్రమ విభజనతోపాటు శ్రామికుల విభజన జరగటం, వారి నడుమ అసహజమైన దాటడానికి వీలులేని అడ్డుగోడలు కట్టబడటం ఏ నాగరిక సమాజంలోనూ లేదు. అంతేకాదు, శ్రామికులలోని ఈ విభాగలు ఒకదానిపై ఒకటి నిమ్నోన్నత కులాల వారీగా నిర్మించబడ్డ వారసత్వపు నిరంకుశత్వం ఇది. శ్రామికులలో శ్రామికులు హెచ్చుతగ్గు తారతమ్యాలతో తరగతులుగా విభజింపబడ్డ ఈ రకమైన పద్ధతి మరి ఏ దేశంలోనూ లేదు. మరొక విషయం ఏమిటంటే భారతదేశంలోని ఈ కార్మిక విభజన స్వచ్ఛందమైనట్టిది కాదు. వారి వారి సహజ స్వభావాలను, అభిరుచులను బట్టి చేయబడ్డ విభజన కాదది. సాంఘిక సామర్థ్యాన్ని, వ్యక్తిగత సామర్థ్యాన్ని అభివృద్ధి పరచాలంటే ముందుగా తన జీవిత మార్గాన్ని తాను ఎన్నుకున్న, పురగమించగల సామర్థ్యాన్ని మనం వ్యక్తిలో పెంపొందించాలి. ఈ సూత్రం కుల వ్యవస్థలో పూర్తిగా అతిక్రమించబడింది. స్వభావసిద్ధమైన, సురక్షితమైన, శక్తి సామర్థ్యాలను బట్టి కాక, కేవలం తల్లిదండ్రుల సాంఘిక స్థాయిని బట్టి వ్యక్తులు చేయవలసిన పనులను ముందుగానే నిర్ణయించడం కుల వ్యవస్థలోని ముఖ్యోద్దేశం. కుల వ్యవస్థలోని ఈ పద్ధతి వ్యక్తులు చేయవలసిన పనుల్ని అవలంభించవలసిన వృత్తులి, పుట్టుకను బట్టి ముందే నిర్ణయించడం అనే పద్ధతి. మరొక విధంగా కూడా ఇది చాలా వినాశకరమైనట్టిది. ఉదాహరణకు, ఏ పరిశ్రమైనా తీసుకోండి. పరిశ్రమ ఎప్పుడూ ఒకే విధంగా ఉండేది కాదు. త్వరితగతినీ, ఆకస్మికంగానూ మార్పులు ఎన్నో. అందులో జరుగుతూ ఉంటాయి. ఆ రకమైన మార్పులను అనుసరించి తమ పనులను, వృత్తులను మార్చుకొనే స్వేచ్ఛ వ్యక్తికి ఉండవలసి ఉంది. మరే పద్ధతులకు అనుగుణంగానూ తనను తాను మార్చుకొనే స్వేచ్ఛ వ్యక్తికి లేనప్పుడు అతడు బతుకుదెరువు చూసుకోవడమే అసాధ్యమవుతుంది. తాము ఏ పనికి తగుదురో, ఏ వృత్తికి సమర్థులో అట్టి పనులను, వృత్తులను ప్రత్యేకించబడ్డ వృత్తిని తప్ప ఆకలితో మాడి చావైనా చస్తాడు కానీ మరో కొత్త వృత్తిని హిందువుడు చూపట్టడు. దీనికి కారణం కుల వ్యవస్థలోనే మనకు కనిపిస్తుంది. వృత్తులలో పరిస్థితులను బట్టి, శక్తి సామర్థ్యాలను బట్టి సర్దుబాట్లు జరగకుండా అరికట్టడం వల్ల కుల వ్యవస్థే దేశంలోని నేటి నిరుద్యోగ సమస్యకు చాలా వరకు ప్రత్యక్ష కారణం అవుతున్నది.

("కుల సమస్య-అవగాహన-విశ్లేషణ" పుస్తకం నుండి..)

నవతెలంగాణ
హైదరాబాద్ 12
ఆటలు
సోమవారం 5 మార్చి 2018

అరుణారెడ్డికి రూ.2కోట్లు: సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో జరిగిన జిమ్నాజిస్ట్ ప్రపంచకప్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన హైదరాబాద్‌కు చెందిన బుద్దా అరుణారెడ్డికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు రూ.రెండు కోట్ల నగదు ప్రోత్సాహం ప్రకటించారు. ప్రపంచకప్‌లో కాంస్యపతకం సాధించిన తొలి భారతీయ మహిళగా అరుణారెడ్డి చరిత్ర సృష్టించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అరుణారెడ్డి..ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ముఖ్యమంత్రి ఆమెను అభినందించి, సత్కరించారు. ఆమె కోచ్ బ్రిజ్‌కిశోర్‌కూ సహాయం అందించాలని ఆదేశించారు. సీఎంను కలిసిన వారిలో క్రీడల మంత్రి పద్మారావు, సాట్స్ చైర్మెన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, అరుణారెడ్డి తల్లి సుభద్రమ్మ, సోదరి పావని ఉన్నారు.



ఆల్ ఇంగ్లాండ్‌లో అదరగొడతా!

- బ్యాడ్మింటన్ స్టార్ పివి సింధు



నవతెలంగాణ-హైదరాబాద్

రియో ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించి దేశం గర్వపడేలా చేసిన తెలుగు తేజం పివి సింధు రానున్న ప్రతిష్టాత్మక టోర్నీల్లోనూ సానుకూల ఫలితాలు రాబడుతానని విశ్వాసం వ్యక్తం చేస్తోంది. మార్చి 14 నుంచి బర్మింగ్‌హామ్‌లో ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్ మొదలుకానుండగా, ఏప్రిల్ 4 నుంచి ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో కామన్‌వెల్త్ గేమ్స్ ఆరంభం కానున్నాయి. మంచి ఫామ్‌లో కొనసాగుతున్న సింధు.. ప్రపంచ నం.1 లక్ష్యంగా దూసుకెళ్తోన్నది. ' తరువాతి టోర్నీ ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్. అక్కడ మంచి ప్రదర్శన చేస్తానని ఆశిస్తున్నాను. ఇంకా చాలా టోర్నీలు ఉన్నాయి. ఎక్కడైనా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాలన్నదే నా ముందున్న లక్ష్యం' అని సింధు తెలిపింది. సింధు ప్రస్తుతం గోపీచంద్ అకాడమీలో ముమ్మర సాధన చేస్తోంది. ' ప్రిపరేషన్‌లో భాగంగా టోర్నీ వారీగా సిద్ధమవుతున్నాను. సాధన సానుకూలంగా సాగుతోంది. ప్రస్తుతం నా దృష్టంతా ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్‌పైనే. కామన్‌వెల్త్ గేమ్స్ చాలా కష్టమైనవి. ప్రతి మ్యాచ్ కీలకమైనదే. అందుకే కఠోరంగా సాధన చేయటం కీలకం' అని సింధు పేర్కొన్నది. గతంలో చెప్పినట్టు ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరుకోవటమే నా అంతిమ లక్ష్యం. ఇవన్నీ నా లక్ష్య సాధనలో ఉపయోగపడతాయి. నన్ను నేను వరల్డ్ నం.1గా చూసుకోవాలని తపిస్తున్నానని సింధు మనసులో మాట వ్యక్తపరిచింది. బ్యాడ్మింటన్‌లో గ్రాండ్‌స్లామ్‌గా భావించే ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్‌ను ఇప్పటి వరకూ భారత మహిళా షట్లర్‌కు అందుకోలేదు. సైనా నెహ్వాల్ గతంలో ఫైనల్లోకి చేరినా.. టైటిల్ తీసుకురాలేదు. కానీ గొప్ప ఫామ్‌లో ఉన్న సింధు మరో చరిత్ర సృష్టించేందుకు సిద్ధమే అంటోంది.

సూపర్ స్మృతి



- దూకుడు, టెక్నిక్‌ల కలబోత
- మహిళల క్రికెట్ సరికొత్త స్టార్

నవతెలంగాణ క్రీడా విభాగం

2017 మహిళల ప్రపంచకప్. భారత మహిళల క్రికెట్ గతిని మార్చేసింది. ఫైనల్లో ఓడినా.. మహిళా క్రికెటర్లనూ అభిమానులు గుర్తుంచుకున్నారు, సెలబ్రిటీలుగా ఆరాధిస్తున్నారు!. ప్రపంచకప్‌లో మెరుపు ప్రదర్శన చేసి విధ్వంసక ఆటకు కేరాఫ్ వీరేంద్ర సెహ్వాగ్‌తో పోల్చబడిన స్మృతి మంధాన క్రికెట్‌లోనే కాదు సోషల్ మీడియాలోనూ స్టార్ హోదా కొట్టేసింది. ఎంతో ఆదరణ, ప్రాచుర్యం దక్కించుకున్న మంధానను ఓ విలేకరి ' ప్రపంచకప్ తర్వాత మీ జీవితం ఎలా మారింది' అని అడిగాడు. అందుకు ఆమె ఇచ్చిన సమాధానం ' ఆటలో నిలకడ'. 16 ఏండ్ల ప్రాయంలో భారత్‌కు తొలిసారి ప్రాతినిథ్యం వహించిన మంధాన మహిళల క్రికెట్ సరికొత్త స్టార్‌గా ఎదిగింది. నిలకడగా ఆడుతూ భవిష్యత్ భారత కెరటంగా దూసుకెళ్తోంది. మార్చి 12 నుంచి స్వదేశంలో ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో స్మృతి మంధాన భారత బృందంలో కీలక క్రికెటర్. తరువాత ఇంగ్లాండ్, ఆస్ట్రేలియాలో ముక్కోణపు టీ20 సిరీస్‌లోనూ ఉప సారథిగా, బ్యాట్స్‌వుమెన్‌గా మంధాన తనదైన పాత్ర పోషించేందుకు ఎదురుచూస్తోంది.

స్మృతి నువ్వు కొట్టాలి ..

జట్టులో ఆమె సీనియర్ ప్లేయర్ కాదు. పోనీ, అప్పటికీ సక్సెస్‌ఫుల్ క్రికెటర్ కూడా కాదు. అయినా, ఆమె బరిలోకి దిగిన ప్రతిసారీ ఒకే మాట వినిపించేది... ' స్మృతి నువ్వు స్కోరు చేయాలి'. సహచరుల అంచనాలు, జట్టు తన నుంచి ఆశించటం వంటివేవీ మంధానను ఒత్తిడిలోకి నెట్టలేదు. మానసిక సమతూకానికి తోడు తన ఆటపై స్వీయ సమీక్ష చేసుకొనే మంధాన మైదానంలో ప్రతిసారీ మంచి ఇన్నింగ్స్‌లే ఆడింది, ఆడేందుకు ప్రయత్నించింది. ప్రపంచకప్‌లోనూ వరుసగా ఆరు ఇన్నింగ్స్‌ల్లో విఫలమైనా.. ఒత్తిడికి లోను కాలేదు. భారీ ఇన్నింగ్స్‌లతో దూసుకొచ్చింది. కొందరు లేడీ గంగూలీ అన్నారు, మరికొందరు వీరూకి లేడీ వెర్షన్ అన్నారు. 35 వన్డేలు, 32 టీ20లు సహా రెండు టెస్టులాడిన మంధాన... 1792 పరుగులు చేసింది. ఇందులో మూడు శతకాలూ ఉన్నాయి. ముంబయి తరపున దుమ్మురేపిన మంధాన 16 ఏండ్లలోనే (2013) అరంగేట్రం గావించింది. ఇప్పుడు జెమీమా రొడ్రిగస్ కొత్త కెరటంలా దూసుకొచ్చినట్టే.. అప్పట్లో మంధాన మెరిసింది. అంతర్జాతీయ సర్క్యూట్‌లో తిరుగులేని ప్రదర్శన చేసిన స్మృతి జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్నది. దిగ్గజ బ్యాట్స్‌వుమెన్ మిథాలీరాజ్ తోడుగా ఓపెనింగ్ చేస్తూ లెక్కలేనన్ని శుభారంభాల్ని అందించింది. నిలకడగా ఆడుతూ, టెక్నిక్‌కు దూకుడు జోడిస్తోన్న స్మృతి మంధాన భవిష్యత్ భారత మహిళల క్రికెట్ సూపర్‌స్టార్ అని చెప్పనక్కర్లేదు!.

అక్కడ అరిస్తే నచ్చదు ..

మైదానంలో మిస్‌ఫీల్డ్ చేయటం సహజమే. అప్పుడు కెప్టెన్ ఆగ్రహానికి గురి కావటమూ అంతే సహజం. అయితే, కెప్టెన్ ఇలా మిస్‌ఫీల్డ్ కాగానే అరవటం తనకు నచ్చదని మంధాన అంటోంది. ' బంతి చేజారగానే కెప్టెన్ అరిస్తే, తర్వాతి బంతిని కూడా చేజార్చినట్టే అనిపిస్తది'. మైదానంలో భావోద్వేగాలను బయటపెట్టడం నాకే మాత్రం ఇష్టముండదు. బ్యాటింగ్ చేస్తున్న సమయంలోనూ మ్యాచ్ పరిస్థితులు, బంతి ఎలా ఆడాలనే విషయమే భాగస్వామితో చర్చిస్తా. భావోద్వేగాలను బయటపెట్టను. సెంచరీ చేయగానే ఉద్వేగానికి లోను కాను. కానీ నా తొలి టెస్టు కాస్త ప్రత్యేకం. నేను చిన్న వయసులో తొలి సింగిల్ నుంచి శతక అభివాదం వరకూ కలగన్నాను. ఆ టెస్టులో నేను అర్ధ సెంచరీయే చేసినా.. సంతోషం ఆపుకోలేకపోయాను. అప్పుడు ఫిఫ్టీ చేయగానే నాలో మెదిలిన తొలి ఆలోచన.. ఇది చిన్న నాటి కల కదా అనుకున్నాను.

హర్మన్ బ్యాట్ ఇచ్చి.. ఆడమన్నది! ..

21 ఏండ్ల వయసులోనే స్మృతి మంధాన పొట్టి ఫార్మాట్ వైస్ కెప్టెన్ బాధ్యతలు అందుకున్నది. హర్మన్‌ప్రీత్ కౌర్‌తో చాలా కాలం నుంచి కలిసి ఆడుతున్నా.. బంధం బలమైనదైతే కాదు!. ప్రపంచకప్



హర్మన్‌ప్రీత్‌తో స్మృతి

నుంచి తిరిగొచ్చిన తర్వాత హర్మన్‌ప్రీత్‌తో పాటు మంధాన సైతం పాత గాయాల నుంచి కోలుకునేందుకు బెంగళూర్‌లోని నేషనల్ క్రికెట్ అకాడమీలో చేరింది. ఇక్కడ కౌర్‌తో విలువైన సమయం గడిపిన మంధాన.. మంచి బంధం ఏర్పరుచుకున్నది. ' జట్టుతో పాటు ప్రయాణిస్తున్నప్పుడు ప్రత్యేకించి ఒకరితో ప్రత్యేక బంధం ఏర్పరుచుకునేందుకు సమయం ఉండదు. గతంలో కౌర్, నాది అదే పరిస్థితి. గాయాల నుంచి కోలుకునే క్రమంలో ఎన్సీఏలో మేమిద్దరం విలువైన సమయం గడిపాం. మా ఇద్దరి పొరపాట్లు, లోపాలపై మాట్లాడుకునేవాళ్లం. అప్పుడు నేను సరిగా ఆడకపోతే.. కౌర్ ఆమె బ్యాట్ నాకిచ్చి దానితో ఆడమని చెప్పింది. అది మా ఇద్దరి మధ్య బంధం బలపడేందుకు కారణమైంది' అని మంధాన తెలిపింది.

భోజన ప్రియురాలినే..

అప్పటికప్పుడు నన్ను సంతోషంగా ఉంచటంలో భోజనం ముందుండేది. మా అమ్మతో చెప్పేదానిని, మరికొంత ఇస్తే మరో రెండు రౌండ్లు ఎక్కువ పరుగెడతాను. నేను భోజన ప్రియురాలిని. వంట చేయడాన్ని ఇష్టపడేదాన్ని. ఒకానొక సమయంలో చెఫ్ అవుదామనుకున్నా. గాయం తర్వాత నాలో మార్పు వచ్చింది. ఫిట్‌నెస్ కాపాడుకునేందుకు జిమ్, పోషకాహారం విలువ ఏంటో తెలిసింది. ఫిట్‌నెస్ కోసం ఇష్టమైన వంటకాల్ని ఎన్నో వదులుకోక తప్పలేదు.

రిజ్వీ రికార్డు గురి

- షూటింగ్ ప్రపంచ కప్‌లో పసిడి సొంతం



షాజర్ రిజ్వీ

న్యూఢిల్లీ : మెక్సికోలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ పోటీల్లో భారత యువ షూటర్ షాజర్ రిజ్వీ మెరిశాడు. తొలి ప్రయత్నంలోనే బంగారు పతకం సాధించాడు. స్వర్ణం గురి పెట్టటమే గాక ప్రపంచ రికార్డును కూడా నెలకొల్పి అబ్బుర పరిచాడు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రిజ్వీ మొత్తం 242.3 పాయింట్లు సాధించాడు. ఇదే ఈవెంట్లో మరో భారత షూటర్ జితూ రాయ్ కాంస్యం నెగ్గాడు. 219 పాయింట్లతో జితు మూడో స్థానంలో నిలువగా.. ఓమ్ ప్రకాశ్ మిథర్వాల్ 198.4 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇక మహిళా ఈవెంట్లలో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో మెహులి ఘోష్ 228.4 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంజుమ్ మౌద్గిల్ 208.6 ఓవరాల్ పాయింట్లతో నాల్గో, అపూర్వి చండేలా 144.1 పాయింట్లతో ఏడో స్థానంతో సరిపెట్టుకున్నారు.

ర్యాపిడ్ ఈవెంట్లో ఆనంద్ గెలుపు



మాస్కో : దిగ్గజ చెస్ ఆటగాడు విశ్వనాథన్ ఆనంద్ 11వ తాల్ స్మార్ చెస్ టోర్నీలో విజేతగా నిలిచాడు. పలు ప్రపంచ చాంపియన్‌షిప్స్ అందుకున్న ఆనంద్.. ఆరు పాయింట్లతో ర్యాపిడ్ ఈవెంట్లో గెలుపొందాడు. తొలి పోరులోనే డానిల్ దుబోవ్‌ను చిత్తు చేసిన ఆనంద్ రెండో రౌండ్‌లో ఇయాన్‌ను సునాయసంగా ఓడించాడు. మూడో రౌండ్‌లో తడబడిన విశ్వనాథుడు ఆపై నెమ్మదించినా.. కీలక ఆరో రౌండ్లో చెలరేగాడు. హికారు నకమురాను చిత్తు చిత్తుగా ఓడించాడు. ఎనిమిదో రౌండ్లో అలెగ్జాండర్ గ్రిశుక్‌పై విజయం సాధించాడు. ర్యాపిడ్ ఈవెంట్ ఆఖరు దశలో బోరిస్ గెల్ఫాండ్‌తో డ్రా చేసుకుని టైటిల్ విజయాన్ని పంచుకున్నాడు.

ఆఫ్ఘాన్‌పై స్కాట్లాండ్ విజయం

న్యూఢిల్లీ : ప్రపంచ కప్ అర్హత పోరులో అఫ్గానిస్థాన్‌పై స్కాట్లాండ్ జట్టు ఏడు వికెట్ల తేడాతో గెలుపొంది శుభారంభం చేసింది. మరో గ్రూప్ బి మ్యాచులో నేపాల్‌పై 116 పరుగుల భారీ తేడాతో జింబాబ్వే గెలుపొందింది. గ్రూప్ ఏ పోరుల్లో నెదర్లాండ్స్‌ను ఐర్లాండ్ ఓడించింది. డక్‌వర్త్ పద్ధతిన 93 పరుగుల తేడాతో నెగ్గింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జట్టు 56 పరుగుల తేడాతో పపువా న్యూగినియాపై గెలుపొందింది.

విజయం ముంగిట ఆసీస్



మార్క్‌రం(143)

డర్బన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో ఆస్ట్రేలియా జట్టు విజయం ముంగిట నిలిచింది. మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా కింగ్స్‌మెయిడ్ వేదికగా జరుగుతోన్న తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేధించడంలో సఫారీ ఆటగాళ్లు విఫలమయ్యారు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 351 పరుగుల చేసింది. దక్షిణాఫ్రికా కేవలం 162 పరుగులకే ఆలౌట్ అయింది. 189 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 227 పరుగులు చేసి సౌతాఫ్రికాకు 417 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన సఫారీలు ఆసీస్ బౌలర్ల ధాటికి స్వల్పస్కోర్‌కే కుప్పకూలిపోయారు. ఓపెనర్ మార్క్‌రం(143), వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ క్వింటన్ డికాక్(81 బ్యాటింగ్) మినహా మిగితా అందరూ సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. దీంతో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 9 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. క్రీజులో డికాక్(81), మోర్కెల్(0) ఉన్నారు. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే సౌతాఫ్రికా 1 వికెట్‌తో 124 పరుగులు చేయాల్సి ఉన్నది. దీంతో ఆస్ట్రేలియా విజయం ఖాయమే.

క్రికెట్‌పై నల్ల మచ్చ!

- ఇయాన్ చాపెల్ తీవ్ర విమర్శ



న్యూఢిల్లీ : ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్, ప్రముఖ కాలమిస్ట్ ఇయాన్ చాపెల్ బీసీసీఐ పాలన వ్యవస్థపై తీవ్ర విమర్శ చేశాడు. వెస్టిండీస్‌తో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో డేనైట్ టెస్టుపై బీసీసీఐ అంగీకారం తెలుపగా, అందుకు పాలకుల కమిటీ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. అప్పుడు బోర్డు వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన వినోద్ రాయ్.. దీనిపై ఆటగాళ్ళు, కోచింగ్ సిబ్బంది, ప్రజలతో విస్తృత సంప్రదింపులు అవసరమైన తెలిపింది. టెస్టు క్రికెట్ బతికేందుకు డేనైట్ టెస్టులు దోహదం చేయనున్నాయి. వాటికి బీసీసీఐ అనుమతి అవసరం. కానీ డైనైట్ టెస్టుపై బోర్డు, పాలకుల కమిటీ మధ్య అగాధం భారత క్రికెట్‌కు మంచి చేయదు. క్రికెట్‌కు స్థిరమైన, వేగవంతమైన నిర్ణయాలు అవసరం. డేనైట్ టెస్టుపై జరిగిన తంతు క్రికెట్‌పై పడిన నల్లని మచ్చ అని చాపెల్ తన వ్యాసంలో రాసుకొచ్చాడు.

కప్ప తీసుకొస్తాం!

శ్రీలంకలో ముక్కోణపు టీ20 సిరీస్‌కు బయల్దేరే ముందు టీమ్ ఇండియా ఆటగాళ్ల సురేశ్ రైనా, రోహిత్ శర్మ, రిషబ్ పంత్, షార్దుల్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్‌ల తేనేటీ విరామం. మార్చి 6న ఆతిథ్య శ్రీలంకతో తొలి మ్యాచ్‌లో తలపడనున్న టీమ్ ఇండియా.. మార్చి 8న బంగ్లాదేశ్‌తో పోటీపడనున్నది. రౌండ్ రాబిన్‌లో ఒక్కో జట్టుతో రెండుసార్లు ఢీకొట్టిన తర్వాత మెరుగైన రెండు జట్లు ఫైనల్లోకి వెళతాయి. మార్చి 18న కొలంబోలో టైటిల్ పోరు జరుగుతుంది. దక్షిణాఫ్రికా పర్యటనలో బిజీ షెడ్యూల్ ముగించుకుని స్వదేశానికి చేరుకున్న టీమ్ ఇండియా.. శ్రీలంకకు స్వాతంత్ర్యం వచ్చి 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముక్కోణపు సిరీస్ ఆడేందుకు అక్కడికి బయల్దేరింది.



సురేశ్ రైనా, రిషబ్ పంత్, షార్దుల్ ఠాకూర్, యుజ్వేంద్ర చాహల్, రోహిత్ శర్మ

ఇంగ్లాండ్‌తో పోరు డ్రా

- సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్

ఐపో (మలేసియా) : అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయిన భారత్ అజ్లాన్ షా హాకీ టోర్నీ రెండో పోరును డ్రా చేసుకున్నది. ఆదివారం ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇరు జట్ల డిఫెన్సు హోరాహోరీగా తలపడ్డాయి. సర్దార్ సేన ఏకంగా తొమ్మిది పెనాల్టీ కార్నర్ అవకాశాలను వృథా చేసుకుని మ్యాచ్‌లో 1-1తో పోరు ముగించింది. భారత్ తరపున శిలానంద్ లక్రా ఏకైక గోల్ చేశాడు. అంతర్జాతీయ కెరీర్‌లో అతనికిది తొలి గోల్. ప్రథమార్ధంలోనే భారత్ 1-0తో ఆధిక్యం సొంతం చేసుకున్నది. 14వ నిమిషంలో లక్రా గోల్‌తో భారత్‌కు ఆధిపత్యం దక్కినా చివరిదాకా కాపాడుకోలేకపోయింది. మనోళ్ల గోల్ ప్రయత్నాలను సమర్థవంతంగా అడ్డుకున్న ఇంగ్లాండ్, స్కోరు సమం చేయటానికి ప్రయత్నించి సఫలమైంది. మరో ఎనిమిది నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా ఇంగ్లాండ్ పెనాల్టీ గోల్ చేసింది. గోల్‌పై భారత్‌పై సమీక్ష కోరినా ఫలితం ప్రత్యర్థికే అనుకూలించింది. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం ఆరో స్థానంలో కొనసాగుతోన్న భారత్.. మంగళవారం ప్రపంచ నెంబర్ వన్ ఆస్ట్రేలియాతో తలపడనున్నది.



శిలానంద్ లక్రా

కార్తీక్‌కు కోల్‌కత పగ్గాలు

కోల్‌కత : విజయవంతమైన కెప్టెన్ గౌతం గంభీర్‌ను వదులుకున్న తర్వాత.. కెప్టెన్సీ సమస్య ఎదుర్కొన్న కోల్‌కత నైట్‌రైడర్స్ తమ నూతన సారథిని ఆదివారం ప్రకటించింది. వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్ దినేశ్ కార్తీక్ (32) ఐపీఎల్11 సీజన్లో కోల్‌కతకు సారథ్యం వహించనున్నాడు. ఆటగాళ్ల వేలంలో రూ. 7.4 కోట్లకు కార్తీక్‌ను దక్కించుకున్న కోల్‌కత, అతడినే నూతన సారథిగా ఎంచుకున్నది. కోల్‌కత సీనియర్ ఆటగాడు రాబిన్ ఉతప్పనూ నాయకత్వ బాధ్యతలను పరిశీలించినా, తుదకు అతడికి ఉప సారథ్యమే అప్పగించారు. ఈ మేరకు కోల్‌కత నైట్‌రైడర్స్ సీఈవో వెల్లడించాడు. అంతర్జాతీయ సర్క్యూట్ సహా ఐపీఎల్‌లో కెప్టెన్సీ అనుభవం లేకపోయినా.. దేశవాళీలో సొంత రాష్ట్రం తమిళనాడుకు పలుమార్లు సారథ్యం వహించిన అనుభవం కార్తీక్ సొంతం. సుభ్‌మన్ గిల్, కమలేశ్ నాగర్‌కోటి, శివం మహి వంటి యువ ఆటగాళ్లున్న కోల్‌కతను కార్తీక్ గెలుపు దిశగా నడిపించగలడో లేదో కాలమే చెప్పనున్నది. కోల్‌కతకు ఏడు సీజన్లలో కెప్టెన్సీ వహించిన గౌతం గంభీర్ రెండు సార్లు విజేతగా నిలిపాడు.



ఐపీఎల్‌లోకి ప్రసాద్



ముంబయి : లోధా కమిటీ సిఫారసుల్లో కీలకమైన విరుద్ధ ప్రయోజనాల అంశం కారణంగా జూనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మెన్ పదవికి రాజీనామా చేసిన వెంకటేశ్ ప్రసాద్.. ఊహించిన విధంగా ఐపీఎల్‌లోకి అడుగుపెట్టాడు. కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌కు ప్రసాద్ బౌలింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 2008లో బెంగళూర్‌కు, 2009-10లలో చెన్నైకి, తిరిగి 2011-13లో బెంగళూర్‌కు బౌలింగ్ కోచ్‌గా పని చేసిన ప్రసాద్ ఈ సీజన్ నుంచి పంజాబ్ కోచింగ్ సిబ్బందితో కలిసి పని చేయనున్నాడు. పంజాబ్‌కు అశ్విన్ సారథిగా, వీరేంద్ర సెహ్వాగ్ చీఫ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.